thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 80 | కరీంనగర్ శుక్రవారం, 30 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం | వెల - 1.00

## 'తుంగభద్ర'పై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం..

బెంగళూరు : తుంగభద్ర డ్యాం కు గతేడాది కొట్టుకుపో యిన 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటును అమర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ నాయకులు ఆరో పించారు. టీబీడ్యాంపై కొప్పళ జిల్లా బీజేపీ బృందం పర్యటించిం ది. ప్రతిపక్ష నాయకుడు దొడ్డగౌడ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బసవరాజ్ కావటూర్, రమేష్, గణేష్, మంజునాథ్, మల్లికార్జున తదితర నాయకులు బృందం లో ఉన్నారు. దెబ్బతిన్న 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటు అమర్చేం దుకు రూ.2 కో ట్ల వ్యయంతో టెండర్ పిలిచారని, కానీ మళ్లీ రద్దు చేశారన్నారు. ఇక మిగిలిన గేట్లకు ఎప్పుడు టెండర్ పిలుస్తారో.. ఎప్పుడు మరమ్మత్తుచేస్తారో ఆయోమయంగా ఉందని మండిపడ్డారు. డ్యాంకు నీరు వస్తున్న తరుణంలో గేట్లు పటిష్టంగా లేకుంటే నీరు ఎలా నిలుస్తాయని ప్రశ్నించారు. ఇది పూర్తిగా సర్కార్ వైఫల్యమేన న్నారు. పలువురు బీజేపీ నాయకులు డ్యాంను పరిశీలించారు.

# దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదు

## 'జైహింద్ ర్యాలీ'లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి



మేడ్చల్: దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భారత్ సైన్యం విజయవంతంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించిందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆపరేషన్ సిందూర్‌కు మద్దతిచ్చినట్లు తెలిపారు. ఏఐసీసీ ఆదేశం మేరకు మేడ్చల్‌లోని బాచుపల్లిలో కాంగ్రెస్ 'జైహింద్ ర్యాలీ' నిర్వహించింది. వీఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకు సాగిన ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్ మాట్లాడారు. "ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నెక్లెస్ రోడ్డులో ర్యాలీ చేశాం. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాలని మోదీకి మద్దతు తెలిపాం. 4 రోజుల యుద్ధం తర్వాత ఏం జరిగిందో తెలియదు. కానీ, యుద్ధం ఆపేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా ముందుకు వచ్చి యుద్ధం తానే ఆపానని ప్రకటించారు. యుద్ధానికి మద్దతివ్వాలని అఖిలపక్షం నిర్వహించిన ప్రధాని మోదీ.. యుద్ధం ఆపే విషయంలో ఎందుకు చర్చించలేదు. గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తాడు. గతంలో ఇందిరాగాంధీ చైనాను మోకాళ్లపై కూర్చోబెట్టారు. గల్వాన్ ఘటనలో మన కర్నల్ సంతోష్‌ను పొట్టన పెట్టుకుంటే ఏమీ చేయలేకపోయాం. 1971లో అమెరికా అండతో పాకిస్థాన్ మనపై యుద్ధానికి వచ్చింది. యుద్ధం ఆపాలని అప్పటి అమెరికా అధ్యక్షుడు... ఇందిరాగాంధీని బెదిరించారు. కానీ, ఆమె బెదిరింపులకు లొంగలేదు. పాక్‌ను ఓడించి.. ఆ దేశాన్నే రెండు ముక్కలు చేశారు" అని రేవంత్ అన్నారు.




దిల్లీ: తెలంగాణ కాంగ్రెస్‌లో ఐదు కమిటీలను కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసింది. 22మందితో రాజకీయ వ్యవహారాల కమిటీ, 15మందితో సలహా కమిటీ, ఏడుగురితో డీలిమిటేషన్ కమిటీ, 16మందితో సంవిధాన్ బచావో ప్రోగ్రామ్ కమిటీ, ఆరుగురితో క్రమశిక్షణా చర్యల కమిటీలను నియమిస్తూ గురువారం రాత్రి ఏఐసీసీ ప్రకటన విడుదల చేసింది.

**రాజకీయ వ్యవహారాల కమిటీలో ఉన్నది వీరే..** రాజకీయ వ్యవహారాల కమిటీలో మీనాక్షి నటరాజన్, బి.మహేశ్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, చల్లా వంశీచంద్ రెడ్డి, జి.రేణుకా చౌదరి, బలరాం నాయక్, డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, షబ్బీర్ అలీ, అజహరుద్దీన్, ఆది శ్రీనివాస్, శ్రీహరి ముదిరాజ్, బీర్ల ఐలయ్య, పి.సుదర్శన్ రెడ్డి, కె.ప్రేమ్ సాగర్ రావు, జెట్టి కుసుమ్ కుమార్, ఎరవర్తి అనిల్ కుమార్ ఉన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, ప్రత్యేక ఆహ్వానితులుగా క్యాబినెట్ మంత్రులు ఉంటారు.

**అడ్వైజరీ కమిటీ...** మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్, వి.హనుమంత రావు, జానారెడ్డి, కె.కేశవరావు, మధుయాష్కీ గౌడ్, జి.చిన్నారెడ్డి, జె.గీతారెడ్డి, ఎం. అంజన్‌కుమార్ యాదవ్, టి.జయప్రకాశ్ రెడ్డి, జాఫర్ జావేద్, టి. జీవన్ రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, రాములు నాయక్

**డీలిమిటేషన్ కమిటీ...** చల్లా వంశీచంద్ రెడ్డి (ఛైర్మన్), గద్వాల విజయలక్ష్మి, ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, డా. శ్రవణ్ కుమార్ రెడ్డి, పవన్ మల్లాది, డి.వెంకటరమణ

**సంవిధాన్ బచావో ప్రోగ్రామ్ కమిటీ...** పి. వినయ్ కుమార్ (ఛైర్మన్), అద్దంకి దయాకర్, కె.శంకరయ్య, ఎన్.బాలు నాయక్, ఎ.నర్సిరెడ్డి, ఆత్రం సుగుణ, రాచమల్ల సిద్ధేశ్వర్, సంతోష్ కొలకొండ, డా.పులి అనిల్ కుమార్, జూలూరి ధనలక్ష్మి, మజీద్ ఖాన్, జి.రాములు, అర్జున్ రావు, శౌరి, కొల్లం వల్లభ్ రెడ్డి, వి.శ్రీకాంత్ రెడ్డి

**క్రమశిక్షణా చర్యల కమిటీ...** మల్లు రవి (ఛైర్మన్), ఎ.శ్యామ్ మోహన్ (వైస్ ఛైర్మన్), ఎం.నిరంజన్ రెడ్డి, బి.కమలాకర్‌రావు, జాఫర్ జావేద్, డా.జీవీ రామకృష్ణ




# ఆపరేషన్ సిందూర్‌తో ధీటైన జవాబిచ్చాం..

## సిక్కిం రాష్ట్ర అవతరణ వేడుకల్లో ప్రధాని మోదీ

పల్లెక్రాంతి - 50వ రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుపుకుంటున్న సిక్కిం ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. వర్చువల్‌గా వారిని ఉద్దేశించి ప్రసంగించారు. సిక్కిం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని రకాలుగా సాయం చేస్తానని ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి ప్రధాని మోదీ ప్రస్తావించారు. 'పర్యాటక రంగ ప్రభావం ఎంత గొప్పదో సిక్కిం ప్రజలకు తెలుసు. పర్యాటకం అంటే విభిన్నత్వానికి ప్రతీక.

ఇక, పహల్గాం ఘటన భారత్‌పై జరిగిన ఉగ్రదాడి మాత్రమే కాదు. మానవత్వం, సోదరభావంపై జరిగిన దాడి' 'ఎన్నో భారతీయ కుటుంబాల సంతోషాన్ని టెర్రరిస్టులు హరించారు. భారత్‌లో చీలిక తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే, భారత ఐకమత్యం ఎంత గొప్పదో ప్రపంచం చూసింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశమంతా ఒక్కటై ఉగ్రవాదులకు దీటుగా బదులిచ్చింది. ఉగ్రవాద శిబిరాలు ధ్వంసమవడంతో పాక్ ఆక్రోశంతో మన సైన్యం, పౌరులపై దాడులకు తెగబడింది. దీంతో పాక్ బండారం బయటపడింది. పాక్ వైమానిక స్థావరాలను అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేయడం ద్వారా భారత స్పందన ఎంత తీవ్రంగా ఉంటుందో వాళ్లకు చూపించాము' అని ప్రధాని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని.. రాష్ట్రంలో పలు అభివృద్ధికారక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. నమ్చీ జిల్లాలో రూ.750 కోట్లతో నిర్మించనున్న 500 పడకల జిల్లా ఆసుపత్రి, సాంగాచోలింగ్‌లోని ప్యాసెంజర్ రోప్‌వే, గాంగ్‌టాక్ జిల్లాలోని అటల్ అమృత్ ఉద్యానవనంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.

ఈశాన్య రాష్ట్రాలే కేంద్రంగా ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇటీవల ఈశాన్య రాష్ట్రాల ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఢిల్లీలో జరిగిందన్న విషయాన్నీ మోదీ పేర్కొన్నారు. ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. దీంతో, రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయని తెలిపారు. వాస్తవానికి ప్రధాని మోదీ సిక్కిం అవతరణ వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రాన్ని సందర్శించాల్సి ఉంది.

అయితే, వాతావరణం అనుకూలించకపోవడంతో ఆయన పశ్చిమ బెంగాల్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో బాగ్డోగ్రా నుంచి ఆయన వర్చువల్‌గా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.




# మహానాడు గ్రాండ్ సక్సెస్..

## మీ రుణం తీర్చుకుంటా: సీఎం చంద్రబాబు

పల్లెక్రాంతి -కడప, మే 29: కడప మహానాడు గ్రాండ్ సక్సెస్ అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కడప టీడీపీ మహానాడు బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా జై తెలుగుదేశం అని కార్యకర్తలతో చెప్పించారు ముఖ్యమంత్రి. రాయలసీమ గర్జన రాష్ట్రం అంతా మారుమ్రోగాలన్నారు. జనసంద్రంగా కడప నిండిపోయిందన్నారు. ఎన్నోసార్లు కడపకు వచ్చానని.. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు టీడీపీ మహానాడుకు రావడం చూసి కొండంత ధైర్యం వచ్చిందన్నారు. కడపలో మహానాడు పెడితే చాలామంది అనుమానించారని సీఎం తెలిపారు.

**పదికి పది గెలుస్తాం...** కానీ కడప టీడీపీ అడ్డా అని నిరూపించేందుకే మహానాడు ఇక్కడ పెట్టామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి మహానాడు దేవునిగడపలో జరిగిందని.. రెస్పాన్స్ అదిరిందన్నారు. మహానాడు సూపర్ హిట్ అయ్యిందని అన్నారు. కడప రాజకీయం మారబోతోందని.. కడప గడపలో మార్పు కనిపిస్తుందని గత ఎన్నికల ప్రచారంలో చెప్పానన్నారు. అహంకారంతో విర్రవీగే వారికి ఎన్నికల్లో కడప జిల్లా ప్రజలు అద్భుతమైన తీర్పునిచ్చారని కొనియాడారు. ఈ ఎన్నికల్లో కడపతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అద్భుతమైన విజయం సాధించామన్నారు. ఉమ్మడి కడపలో పదికి ఏడు స్థానాలు గెలిచామని చెప్పుకొచ్చారు. ఇప్పటి నుంచి కష్టపడితే 2029 ఎన్నికల్లో పదికి పదికి స్థానాలు గెలుచుకుంటామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో రాయలసీమ ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని, 52 సీట్లకు 45 సీట్లతో కూటమిని గెలిపించారన్నారు. వైసీపీకి రాయలసీమలో ఏడు సీట్లు వస్తే టీడీపీ కూటమికి ఒక్క ఉమ్మడి కడప జిల్లాలోనే ఏడు సీట్లతో గెలిపించారన్నారు. ఈ తీర్పును మనం అర్థం చేసుకున్నామని.. కానీ ఓడిపోయిన పార్టీ ఇంకా అర్థం చేసుకోలేదని మండిపడ్డారు. టీడీపీ అధికారం కోసం పుట్టిన పార్టీ కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

**అలాంటి వారు ఉండటం పార్టీకి అదృష్టం...** అవమానాలు, అక్రమ కేసులు, నిర్బంధాలు అన్నింటినీ ఎదుర్కొన్నారని.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందంటే అది కార్యకర్తలు, నేతలు త్యాగాలే అని తెలిపారు. మెజార్టీలు అత్యధికంగా వచ్చాయన్నారు. ఏడాది క్రితం రాష్ట్రం విధ్వంస పాలనతో 30 ఏళ్లు వెనక్కు వెళ్లిందని విమర్శించారు. 'కష్టాలు, సవాళ్లను చూసి నేను భయపడలేదు. నేను క్లైమోర్ మైన్‌లకు భయపడలేదు. వీటికి భయపడతానా' అని ప్రశ్నించారు చంద్రబాబు. సైకిళ్లు వేసుకుని కడప మహానాడుకు వచ్చారంటూ.. కోడూరు నుంచి సైకిల్ వేసుకుని వచ్చిన వ్యక్తిని సభా వేదికపై సీఎం చూపించారు. ఇటువంటి కార్యకర్తలు ఏ పార్టీకైనా ఉంటారా అని ప్రశ్నించారు. ఇటువంటి కార్యకర్తలు ఉండటం పార్టీకి అదృష్టం అని అన్నారు.

**భూసమస్య లేకుండా చేస్తా...** అన్న క్యాంటీన్లు తెరవడం, రోడ్లు బాగుచేయడం, పెన్షన్లు 4 వేలు చేయడం, దేవాలయాల్లో అన్నదానం ప్రారంభం విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు. కేంద్ర పథకాలు నిధులు డైవర్ట్ చేశారని మండిపడ్డారు. తాను వెంటనే పథకాలను పునరుద్ధరించానని తెలిపారు. తెలుగుదేశం అంటేనే బీసీల పార్టీ అని.. బీసీల కోసం బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లు పెట్టామని చెప్పారు. పలు బీసీ వర్గాలకు ఇచ్చిన పథకాలను సీఎం గుర్తుచేశారు. సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు ఫ్రీ గా సోలార్ విద్యుత్ ఇస్తామన్నారు. రైతులకు వ్యవసాయ పంపు సెట్లు వద్ద సోలార్ విద్యుత్ పెట్టుకోవాలని సీఎం చెప్పారు. ఉద్యోగులను గత ప్రభుత్వం అవమానాలకు గురి చేసిందని.. కానీ ఇప్పుడు ఒకటవ తేదీన జీతాలు ఇస్తున్నామని తెలిపారు. వారికి ఇప్పటికే రూ.7 వేల 500 కోట్లు బకాయిలు ఇచ్చామన్నారు. కూటమి రాగానే ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేశామని తెలిపారు. రాబోయే మహానాడుకు భూ సమస్యలు లేకుండా చేస్తానంటూ ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు.

**ఇక్కడ ఉంది సీబీఎన్.. గుర్తుపెట్టుకోండి...** దేశానికి టెర్రరిస్ట్‌ల వలన చాలా నష్టం జరుగుతోందన్నారు. మన దేశంలో, రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదులు వలన నష్టం కలుగుతోందన్నారు. నాసిరకం మద్యం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తాయని అన్నారు. గంజాయ్ వలన అనేక మంది భవిష్యత్ నాశనం అయిందని అన్నారు. అడవులను ఆక్రమించుకొని ఎస్టేట్‌లు కడతారని ఫైర్ అయ్యారు. 'ఆర్థిక ఉగ్రవాదులు గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తా. డ్రగ్స్ అమ్మే వారికి అదే చివరి రోజు అవుతుంది. ఇక్కడ ఉంది సీబీఎన్ అని గుర్తు పెట్టుకోండి' అంటూ సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

చురకలు






హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న గద్దర్ ఫిల్మ్ అవార్డులను జ్యూరీ ఛైర్‌పర్సన్ జయసుధ ప్రకటించారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుతో కలిసి ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ అవార్డుల కోసం మొత్తం 1248 నామినేషన్లు రాగా వాటిని పరిశీలించిన అనంతరం అవార్డు గ్రహీతల పేర్లను ప్రకటించారు. ఉత్తమ నటుడిగా 'పుష్ప 2' చిత్రానికి గానూ అల్లు అర్జున్ ఎంపికయ్యారు. ఉత్తమ చిత్రాలుగా కల్కితో పాటు మరో రెండు సినిమాలకు అవార్డులు లభించాయి.

**2024 బెస్ట్ ఫిల్మ్స్ ఇవే..** మొదటి ఉత్తమ ఫీచర్ చిత్రం: కల్కి 2898ఏడీ, రెండో ఉత్తమ ఫీచర్ చిత్రం: పొట్టేల్, మూడో ఉత్తమ ఫీచర్ చిత్రం: లక్కీ భాస్కర్, ఉత్తమ బాలల చిత్రం: 35 ఇది చిన్న కథ కాదు, హిస్టరీ విభాగంలో ఫీచర్ హెరిటేజ్ చిత్రం: రజాకార్, ఉత్తమ ప్రజాదరణ చిత్రం: ఆయ్, ఉత్తమ పరిచయ దర్శకుడు: యధువంశీ (కమిటీ కుర్రాళ్లు)

**వ్యక్తిగత విభాగాల్లో అవార్డులు..** ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్ (కల్కి) ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప 2) ఉత్తమ నటి: నివేదా థామస్ (35 ఇది చిన్న కథ కాదు) ఉత్తమ సహాయ నటుడు: ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం) ఉత్తమ సహాయ నటి: శరణ్యా ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్) ఉత్తమ గేయ రచయిత: చంద్రబోస్ (రాజు యాదవ్) ఉత్తమ సంగీత దర్శకుడు: బీమ్స్ (రజాకార్) ఉత్తమ నేపథ్య గాయకుడు: సిద్ శ్రీరామ్ (ఊరి పేరు భైరవకోన) ఉత్తమ నేపథ్య గాయని: శ్రేయా ఘోషల్ (పుష్ప 2-సూసేకి అగ్గిరవ్వ) ఉత్తమ హాస్యనటుడు: సత్య, వెన్నెల కిశోర్ (మత్తువదలరా 2) ఉత్తమ బాలనటుడు: మాస్టర్ అరుణ్ దేవ్ పోతుల (35 ఇది చిన్న కథ కాదు), బేబీ హారిక (మెర్సీ కిల్లింగ్) ఉత్తమ కథా రచయిత: శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి) ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత: వెంకి అట్లూరి (లక్కీ భాస్కర్) ఉత్తమ సినిమాటోగ్రఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి) ఉత్తమ ఎడిటర్: నవీన్ నూలి (లక్కీ భాస్కర్) ఉత్తమ ఆడియోగ్రాఫర్: అరవింద్ మేనన్ (గామి) ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేశ్ ఆచార్య (దేవర) ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్: నితిన్ జిహానీ చౌదరీ (కల్కి) ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్: కె. చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్) ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: నల్ల శ్రీను (రజాకార్) ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: అర్చనా రావు, అజయ్ కుమార్ (కల్కి)

**స్పెషల్ జ్యూరీ అవార్డులు..** నటుడు దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్) నటి అనన్య నాగళ్ల (పొట్టేల్) దర్శకులు సుజీత్, సందీప్ (క) నిర్మాతలు ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి (రాజు యాదవ్) స్పెషల్ జ్యూరీ స్పెషల్ మెన్షన్: ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా 2) తెలుగు సినిమాలపై ఉత్తమ పుస్తకం: 'మన సినిమా ఫస్ట్ రీల్' (రెంటాల జయదేవ్) 14 ఏళ్ల తర్వాత ఈ అవార్డులను ప్రకటించారు. మొత్తం 11 కేటగిరీల్లో వీటిని వెల్లడించారు. 2014 జూన్ నుంచి 2023 డిసెంబర్ 31 వరకు ఏడాదికి ఒక ఉత్తమ చిత్రానికి, 2014 నుంచి 2023 వరకు సెన్సార్ అయిన చిత్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. 2024కు సంబంధించి అన్ని కేటగిరీల్లోనూ అవార్డులు ఇచ్చారు. తెలుగు చిత్రాలతోపాటు ఉర్దూ చిత్రాలకూ అవార్డుల్లో ప్రాధాన్యతనిచ్చారు. ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు సహా మొత్తం 21 మందికి వ్యక్తిగత అవార్డులు ఇచ్చారు. జూన్ 14న ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.




## పీవోకే ప్రజలు మనవాళ్లే.. గ్రేట్ ఇండియా మా సంకల్పం: రాజ్‌నాథ్ సింగ్

పీఓకే ప్రజలు మన వాళ్లేనని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అక్కడున్న వారికి భారత్‌తో దృఢమైన సంబంధాలున్నాయని అన్నారు. ఈమేరకు దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. "భౌగోళికంగా విడిపోయినా పీవోకే ప్రజలు రాజకీయంగా ఏదో ఒకరోజు భారత్‌లో ఏకమవుతారు. ఆ రోజు ఎంతో దూరంలో లేదు. పీఓకే దానంతట అదే తిరిగి వస్తుంది. అక్కడున్నవారికి భారత్‌తో దృఢమైన సంబంధాలున్నాయి. గ్రేట్ ఇండియా మా సంకల్పం. అక్కడ కొందరు మాత్రమే తప్పుదారి పట్టారు. మనం ఏమైనా చేయగలిగేవాళ్లం. అయితే శక్తితో పాటు సంయమనం కూడా ముఖ్యం. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశభద్రతకు మేకిన్ ఇండియా ముఖ్యమని ప్రూవ్ అయింది. మనం ఇప్పుడు ఫైటర్ జెట్లు, క్షిపణి వ్యవస్థలను నిర్మించడంతో పాటు.. కొత్తతరం యుద్ధ సాంకేతికతల పైనా దృష్టిపెట్టాం" అని మంత్రి వెల్లడించారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉపయోగించిన దేశీయంగా అభివృద్ధి చెందిన వ్యవస్థలు ప్రపంచం మొత్తాన్ని షాక్‌కు గురిచేశాయి. శత్రుకవచాన్ని దాటుకొని వెళ్లగలమని నిరూపించాం. ఉగ్రస్థావరాలు, తర్వాత శుత్రువుకు చెందిన మిలిటరీ స్థావరాలను ఎలా ధ్వంసం చేశామో మీరు చూశారు. ఇంకా చాలా చేయగలం. బలం, నిగ్రహం మధ్య సమన్వయాన్ని ప్రపంచానికి చూపాం" అని చెప్పారు. ఈసందర్భంగా పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు. ఉగ్రవాద వ్యాపారాన్ని నడపడానికి పెద్ద ఖర్చేం కాదు కానీ, దానివల్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. అదే ఇప్పుడు పాక్‌కు అర్థమైందన్నారు. పాకిస్థాన్ ఎన్నోఏళ్లుగా పెంచి.. పోషిస్తున్న ఉగ్రవాదాన్ని భారత సైన్యం కేవలం 23 నిమిషాల్లో తుడిచిపెట్టేసిందని ఇటీవల రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం పాక్ చర్యలను భారత్ పరిశీలిస్తుందని.. తేడా వస్తే మరింత కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ ఆపరేషన్ సిందూర్‌పై ఈ రోజు ప్రధాని మోదీ కూడా మాట్లాడారు. భారత్‌లో ఉగ్రవాదం వ్యాప్తి చేసేవారికి సరైన సమాధానం ఈ ఆపరేషన్ అని వ్యాఖ్యానించారు. పహల్గాంలో ఉగ్రమూక చేసింది మానవత్వంపై దాడి అని, ఇప్పుడు మనం టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఏకమయ్యామన్నారు.

## పోలీసుల అదుపులో మావో కీలక నేత హిడ్మా

ఒడిశా, మే 29: ఏవోబీలో కీలక నేత కుంజం హిడ్మా అరెస్ట్ అయ్యారు. కొరాపూట్‌లో హిడ్మాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఏకే 47తో పాటు పలు పేలుడు పదార్థాలకు సంబంధించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇక మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషర్ కగార్ కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఎన్‌కౌంటర్ తర్వాత ఆపరేషన్ కగార్ మరింత దూకుడుగా కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఏవోబీ ప్రాంతంవైపు కూడా పెద్ద ఎత్తున దృష్టిసారించారు భద్రతా బలగాలు. ముఖ్యంగా ఒడిశాలో కొన్ని ప్రాంతాల నుంచి భారీగా పేలుడు పదార్థాలును తీసుకువస్తున్నారన్న విశ్వసనీయ వర్గాల సమాచారంలో పక్కా పథకం ప్రకారం హిడ్మాను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఇక ఏవోబీకి సంబంధించి ఆపరేషన్ కగార్‌లో పెద్ద ఎత్తన కీలక నేతలంతా నేలరాలుతున్నారు. గత సంవత్సర కాలంగా ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. అనేక మార్లు భద్రతా బలగాలతో మావోయిస్టుల ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో చాలా మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టు కీలక నేతలు కూడా ఎన్‌కౌంటర్‌లో మరణించారు. చాలా కాలంగా ఆపరేషన్ కగార్ కొనసాగుతున్న నేపథ్యంలో మావోయిస్టుల వద్ద ఉన్న ఆయుధాలు కూడా పూర్తి స్థాయిలో అడుగంటిన పరిస్థితి. పేలుడు పదార్థాలు, జిలిటెన్ స్టిక్స్, బాంబులకు సంబంధించిన ఎక్స్‌పోసివ్ మెటీరియల్ మొత్తం మావోయిస్టుల వద్ద అడుగంటినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఒడిశా నుంచి పెద్ద సంఖ్యలో పేలుడు పదార్థాలను ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోకి రవాణా చేస్తున్న సమయంలోనే మావోయిస్టు కీలక నేత హిడ్మాను ఒడిశా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.










ఖమ్మం: అన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మంలో ప్రభుత్వ పథకాల అమలుతీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈసారి ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో వచ్చిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా రానంత ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. "రికార్డు స్థాయిలో వస్తే.. అంతే స్థాయిలో సేకరిస్తున్నాం. సన్న వడ్లకు బోనస్ ఇవ్వడంలో ఎలాంటి లోపాలు జరగవద్దు. పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదు. పేదల ఇంటి నిర్మాణానికి గత భారాస ప్రభుత్వం కూడా రూ.5 లక్షలు ప్రకటించింది. కానీ పదేళ్లలో ఒక్కరికి కూడా ఇవ్వలేదు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి. పూర్తిస్థాయిలో భూభారతి అమలుకు సిద్ధం అవుతున్నాం.

ధరణిని రద్దు చేస్తామని ఎన్నికల అజెండాలోనే పెట్టాం" అని భట్టి విక్రమార్క తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదు: రేవంత్



మేడ్చల్: దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భారత్ సైన్యం విజయవంతంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించిందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆపరేషన్ సిందూర్‌కు మద్దతిచ్చినట్లు తెలిపారు. ఏఐసీసీ ఆదేశం మేరకు మేడ్చల్‌లోని బాచుపల్లిలో కాంగ్రెస్ 'జైహింద్ ర్యాలీ' నిర్వహించింది. వీఎన్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకు సాగిన ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్ మాట్లాడారు. " ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నెక్లెస్ రోడ్డులో ర్యాలీ చేశాం. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాలని మోదీకి మద్దతు తెలిపాం. 4 రోజుల యుద్ధం తర్వాత ఏం జరిగిందో తెలియదు. కానీ, యుద్ధం ఆపేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా ముందుకు వచ్చి యుద్ధం తానే ఆపానని ప్రకటించారు. యుద్ధానికి మద్దతివ్వాలని అఖిలపక్షం నిర్వహించిన ప్రధాని మోదీ.. యుద్ధం ఆపే విషయంలో ఎందుకు చర్చించలేదు. గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తాడు. గతంలో ఇందిరాగాంధీ చైనాను మోకాళ్లపై కూర్చోబెట్టారు. గల్వాన్ ఘటనలో మన కర్నల్ సంతోష్‌ను పొట్టన పెట్టుకుంటే ఏమీ చేయలేకపోయాం. 1971లో అమెరికా అండతో పాకిస్థాన్ మనపై యుద్ధానికి వచ్చింది. యుద్ధం ఆపాలని అప్పటి అమెరికా అధ్యక్షుడు... ఇందిరాగాంధీని బెదిరించారు. కానీ, ఆమె బెదిరింపులకు లొంగలేదు. పాక్‌ను ఓడించి.. ఆ దేశాన్నే రెండు ముక్కలు చేశారు" అని రేవంత్ అన్నారు.

## భాజపా స్టేట్ ఫైట్ తప్ప.. స్ట్రీట్ ఫైట్ చేయదు: ఈటల రాజేందర్




హైదరాబాద్: తెలంగాణలో భాజపా అధికారంలో ఉంటే బాగుండని ప్రజలు భావిస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో ఎవరూ కొత్తగా పార్టీ పెట్టబోరని, ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో అర్థం కావడం లేదని తెలిపారు. భాజపా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. "భాజపా స్టేట్ ఫైట్ తప్ప.. స్ట్రీట్ ఫైట్ చేయదు. నీచ రాజకీయాలు భాజపాకి అలవాటు లేదు. పదేళ్లలో కేసీఆర్‌ను నమ్మి ప్రజలు మోసపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి మోసపోయారు. పక్కరాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుంటే.. తెలంగాణ వెలవెలబోతోంది. అప్పుల ఊబి నుంచి రాష్ట్రం బయటపడాలంటే భాజపా అధికారంలోకి రావాలి. కవిత తెలంగాణ వాదులను కలవడం నేరం కాదు..కానీ, నాయకులు, కుటుంబీకుల ఫోన్లు ట్యాప్ చేయడం మాత్రం నేరం. ఇవన్నీ నేర్పించింది కేసీఆర్ కాదా? నేతల మధ్య కంచెలు నాటింది కేసీఆర్.. దాన్ని రేవంత్ కొనసాగిస్తున్నారు. కేసీఆర్ ఎదురుపడితే నమస్కారం పెడతా.. అది సంస్కారం. కాళేశ్వరం కమిషన్ విచారణకు బాధ్యతాయతమైన ఎంపీగా, ఆర్థికశాఖ మాజీ మంత్రిగా హాజరవుతా" అని ఈటల తెలిపారు. "భారాస.. భాజపాలో ఎందుకు విలీనమవుతుంది. మేమెందుకు వారిని చేర్చుకుంటాం. ఉద్యమకారులను కలిసి ఎమ్మెల్సీ కవిత ఏం చేస్తారు. కవిత దగ్గర ఉద్యమకారుల జాబితా ఉందా? మావోయిస్టుల అంశంపై కేసీఆర్ ద్వంద్వ వైఖరి కనబరిచారు. అధికారంలోకి రాకముందే జైలుకు వెళ్లి.. కూర రాజన్నను కలిశారు. అధికారంలోకి వచ్చాక నెల రోజుల్లోనే ఆయనలో భూమికి, ఆకాశానికి మధ్య ఉన్నంత తేడా వచ్చింది. ఇటీవల నిర్వహించిన భారాస సమావేశంలో అపరేషన్ కగార్ ఆపాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు రాశారా?" అని ఈటల ప్రశ్నించారు.

## ఢిల్లీకి నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. కారణమిదే

న్యూఢిల్లీ, మే 29: తెలంగాణ కేబినెట్ విస్తరణ వివాదం ఢిల్లీకి తాకింది. ఢిల్లీలో నలుగురు తెలంగాణ కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు మకాం వేశారు. అడ్లూరు లక్ష్మణ్, మందుల సామెల్, కవ్వంపల్లి సత్యనారాయణ, లక్ష్మీ కాంతారావు ఢిల్లీకి వెళ్లారు.

ఈరోజు (గురువారం) సాయంత్రం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను వీరు కలువనున్నారు. మంత్రివర్గ విస్తరణలో తమ సామాజిక వర్గ ఎమ్మెల్యేలకు స్థానం కల్పించాలని ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను ఈ నలుగురు ఎమ్మెల్యేలు కోరనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం గురించి సీఎం, పీసీసీ, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్‌కు తెలిపే ఢిల్లీ వచ్చామన్నారు. తమ న్యాయమైన డిమాండ్ అన్నారు. మాదిగ కులస్తునికి ఖచ్చితంగా కేబినెట్‌లో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో మాదిగ సామాజికవర్గం పెద్ద సామాజిక వర్గమన్నారు. తమ సామాజిక వర్గ ప్రజలకు న్యాయం జరగాలంటే మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గ ప్రతినిధి ఉండాలన్నారు. మాదిగ వర్గం మొదటి నుంచి కాంగ్రెస్‌కు అండగా ఉందని తెలిపారు. మాలలకు మంత్రివర్గంలో స్థానం కల్పించడం పట్ల తమకు అభ్యంతరం లేదని చెప్పారు. మంత్రివర్గంలో ఎవరుండాలనేది నిర్ణయించేది అధిష్టానం కాబట్టి ఢిల్లీ వచ్చామన్నారు. మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి కచ్చితంగా స్థానం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. మొదటి కేబినెట్ ఏర్పాటులోనే తమకు అవకాశం దక్కుతుందని భావించామని.. ఇప్పుడు రెండోసారి కేబినెట్ విస్తరణ జరుగుతుంది కాబట్టి ఇప్పుడు మరోసారి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. మాదిగ సామాజిక వర్గంలో ఏ ఎమ్మెల్యేకు అవకాశం ఇచ్చిన తమకు అభ్యంతరం లేదని నలుగురు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

## శెభాష్.. స్మార్ట్‌ఫోన్ ముట్టుకోకుండా సివిల్స్ కొట్టావమ్మా: సజ్జనార్ ప్రశంస



హైదరాబాద్: ఇటీవల యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో 11వ ర్యాంకుతో అదరగొట్టిన ఇట్టబోయిన సాయి శివానిని తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అభినందించారు. సాధారణ కుటుంబానికి చెందిన సాయి శివాని.. సివిల్స్‌లో చిన్న వయసులోనే అత్యుత్తమ ర్యాంకు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్ ఫోన్ ముట్టుకోకుండా, సోషల్ మీడియా జోలికి వెళ్లకుండా అనుకున్న లక్ష్యాన్ని సాధించారంటూ ప్రశంసలు కురిపించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఉన్నతంగా రాణించాలని ఆమెకు సూచించారు. సివిల్స్ ర్యాంకర్ సాయి శివాని మేనమామ ప్రకాశ్ రావు ఆర్టీసీలో డీఎం హోదాలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో గురువారం ఆమె తన కుటుంబ సభ్యులతో వచ్చి సజ్జనార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు రాజు, రజితతో పాటు సాయి శివానిని సజ్జనార్ సత్కరించారు. అనంతరం ఈ ఫొటోలను సజ్జనార్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.




మూడేళ్ల క్రితం కెనడా నుంచి అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించేందుకు ఓ భారతీయ కుటుంబం చేసిన ప్రయత్నం విషాదాంతమైంది. సరిహద్దుల్లో తీవ్రమైన మంచు తుపాను కారణంగా చలికి గడ్డ కట్టి ఆ కుటుంబమంతా దుర్మరణం పాలైంది. వీరి మృతితో ఓ అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా నెట్‌వర్క్ బయటపడింది. ఆ ముఠాను నడిపిస్తున్న భారతీయుడు హర్షకుమార్ పటేల్ అలియాస్ 'డర్టీ హ్యారీ'కి తాజాగా అమెరికా కోర్టు జైలు శిక్ష విధించింది. హర్షకుమార్ పటేల్‌ను 2024 ఫిబ్రవరిలో చికాగోలోని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నుంచి అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్నారు. పటేల్, ఫ్లోరిడాకు చెందిన ఆంటోనీ షాండ్ కలిసి ఈ మానవ అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను నడుపుతున్నారని విచారణలో గుర్తించారు. విద్యార్థి వీసాలపై పదుల సంఖ్యలో భారతీయులను కెనడాకు రప్పించి.. అక్కడి నుంచి వారిని అక్రమంగా అమెరికా సరిహద్దులు దాటిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. 2022 జనవరిలో ఇలాగే ఓ గుజరాతీ కుటుంబం సహా మరో ఏడుగురిని అమెరికా-కెనడా సరిహద్దు వద్దకు తీసుకొచ్చారు. ఆ సమయంలో విపరీతంగా మంచు కురిసింది. దీంతో గుజరాతీ కుటుంబం మంచులో కూరుకుపోయింది. మరో ఏడుగురు నడుచుకుంటూ సరిహద్దును దాటినప్పటికీ కేవలం ఇద్దరు మాత్రమే ఆంటోనీ షాండ్ ఏర్పాటుచేసిన వ్యాన్ వద్దకు చేరుకోగలిగారు. వారిని తీసుకొని అమెరికాలోకి వెళ్తుండగా.. భద్రతా సిబ్బంది అడ్డుకొని షాండ్‌ను అరెస్టు చేశారు. ఆ తర్వాత తీగ లాగితే 'డర్టీ హ్యారీ' వ్యవహారం బయటపడింది. దీంతో వీరిద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం డర్టీ హ్యారీని దోషిగా తేలుస్తూ 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. షాండ్‌కు ఇంకా శిక్ష ఖరారు చేయలేదు.

**మంచులో కూరుకుపోయి దారుణమైన స్థితిలో..** షాండ్‌ను అరెస్టు చేసిన రోజే.. సరిహద్దుకు కొంత దూరంలో కెనడా వైపు నాలుగు మృతదేహాలను కనుగొన్నట్లు రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు.. యూఎస్ బోర్డర్ పెట్రోలింగ్ అధికారులకు సమాచారమిచ్చారు.

సరిహద్దుకు 12 మీటర్ల దూరంలో మంచులో కూరుకుపోయి అత్యంత దారుణమైన స్థితిలో ఈ మృతదేహాలు కన్పించాయి. మృతులను భారత్‌లోని గుజరాత్‌కు చెందిన జగదీశ్ బల్‌దేవ్‌భాయ్ పటేల్ (39), ఆయన భార్య వైశాలిబెన్ (37), కుమార్తె విహంగి జగదీశ్ కుమార్ పటేల్ (11), కుమారుడు ధార్మిక్ జగదీశ్ కుమార్ పటేల్ (3)గా గుర్తించారు. ఈ ఘటన అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

# తెలుగు సాహిత్యానికి తత్వ శిఖరం ...శేషేంద్ర శర్మ

## - మే 30...గుంటూరు శేషేంద్ర శర్మ వర్ధంతి



శేషేంద్ర

తెలుగు సాహిత్యాన్ని తన అద్భుత కవిత్వంతో, లోతైన విమర్శలతో, విశ్లేషణాత్మక వ్యాసాలతో కొత్త దిశల్లో నడిపించిన మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ. ఆయన కేవలం ఒక కవి మాత్రమే కాకుండా, సమాజంలో చైతన్యాన్ని రేపే ఒక విప్లవాత్మక శక్తి. ఆధునిక తెలుగు కవిత్వానికి ఊతమిచ్చిన మహోన్నత వ్యక్తిత్వం. శేషేంద్ర సాహిత్య ప్రపంచం వర్ణనాత్మకత, తత్త్వచింతన, సామాజిక చింతన, భాషా వైవిధ్యం, అంతర్జాతీయ దృక్పథం లతో విస్తరించి ఉంది. శేషేంద్ర శర్మ జననం 1927 అక్టోబర్ 20న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నాగరాజుపాడు గ్రామంలో జరిగింది. ఆయన తండ్రి సంస్కృత సాహిత్యంలో ప్రావీణ్యం కలిగిన పూజారి గుంటూరు సుబ్రహ్మణ్య శర్మ. చిన్ననాటి నుంచే శేషేంద్రకు వేదాలు, ఉపనిషత్తులు, సంస్కృతం మీద మక్కువ పెరిగింది. విద్యాభ్యాసం తొటపల్లి గూడూరు పాఠశాలలో ప్రారంభమై ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడిగా, మద్రాసు లా కాలేజీ నుండి న్యాయ శాస్త్రంలో డిగ్రీతో కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మునిసిపల్ కమిషనర్‌గా ఉద్యోగం చేసినప్పటికీ, సాహిత్యపట్ల ఆయన ఆసక్తి ఎప్పటికీ తగ్గలేదు. శేషేంద్ర శర్మ సాహితీ ప్రస్థానం అసాధారణం. ఆయన కవిత్వంలో ఉన్న అద్భుత ఊహాశక్తి, సామాజిక చింతన, తత్త్వ విచారణ, వ్యక్తిత్వ విశ్లేషణ తెలుగు కవిత్వాన్ని కొత్త శిఖరాలకు చేర్చింది. కేవలం రూపకాలు, అలంకారాలతోనే కాదు, కవిత్వంలో లోతైన భావాలను మేళవించి సమాజాన్ని ఆలోచింపజేసే విధంగా రచనలు చేశారు. తన కవిత్వంలో తర్కం, ఆచారవిచారం, చరిత్ర బోధ, తత్త్వచింతన మేళవించి ఒక ప్రత్యేక శైలిని రూపొందించారు. "నా దేశం – నా ప్రజలు" అనే కావ్యం శేషేంద్రగారిని దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తెచ్చింది. ఇందులో సామాజిక అసమానతలు, దేశభక్తి, మానవీయత వంటి అంశాలను రసప్రధంగా, ఆవేశ పూరితంగా వ్యక్తీకరించారు. "మంథర", "షోడశి – రామాయణ రహస్యాలు", "ఆధునిక మహాభారతం", "స్వర్ణహంస", "సముద్రపు రెక్కలు", "నెమలికన్ను" వంటి రచనలు శేషేంద్రను ఆధునిక తెలుగు సాహిత్యంలో దృఢంగా నిలిపాయి. "మంథర"లో భారతీయ తత్త్వశాస్త్రం పట్ల ఆయన అవగాహన, అంతరంగా పొందిన అనుభూతులు ప్రతిఫలిస్తాయి. "షోడశి"లో రామాయణంలోని రహస్యాలను లోతుగా పరిశీలిస్తూ శ్రీవరాలను సరికొత్త దృక్పథంలో ఆవిష్కరించారు. శేషేంద్ర వచన కవిత్వం కేవలం వర్ణనాత్మకతకు పరిమితం కాకుండా, జాతీయ మరియు అంతర్జాతీయ సాహిత్య ధోరణులను అద్భుతంగా మిళితం చేసింది. అందులో భాషా వైవిధ్యం, సంస్కృత పదసముపేతం, ప్రతీకలు, చిహ్నాల విశేష ప్రయోగం, శబ్ద సౌందర్యం సమ్మేళనం సాహితీ పాఠకులను విశేషంగా ఆకర్షిస్తుంది. కవిత్వం అంటే కేవలం భావాలను వ్యక్తీకరించడం మాత్రమే కాదు, అది ఒక చైతన్య ప్రవాహం అని ఆయన నిరూపించారు. శేషేంద్ర కవిత్వం మనసుకు హత్తుకునే రూపంలో, ఒక వేళ వినిపిస్తే సంగీతంలా, చదివితే తత్త్వ రససుధగా అనిపిస్తుంది. "సముద్రం నా పేరు", "గొరిల్లా", "మండే సూర్యుడు", "కవిసేన మేనిఫెస్టో", "రక్తరేఖ", "కాలరేఖ", "జనవంశమ్" వంటి రచనలు కాలంతో పోరాడే కవిత్వానికి, సమాజాన్ని చైతన్యపరిచే సాహిత్యానికి ప్రతీకలు. శేషేంద్రకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (1994లో "నా దేశం %–% నా ప్రజలు"కు), తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, కలకత్తా రాష్ట్రీయ హిందీ అకాడమీ అవార్డు, విశ్వకవి పురస్కారం లాంటి అనేక ప్రతిష్టాత్మక బహుమతులు లభించాయి. కవిసేనాని, కవి చక్రవర్తి, రాష్ట్రేంద్రులాంటి బిరుదులు ఆయన సాహిత్య ప్రస్థానానికి గౌరవ తీర్థాలు. శేషేంద్ర శర్మ కేవలం కవి కాదు %–% తత్త్వవేత్త, చింతకుడు, సమాజానికి మార్గదర్శకుడు. ఆయన రచనలు తెలుగులోనే కాదు, అనేక భాషల్లోకి అనువదించబడి విశ్వ సాహిత్యంలోనూ తనదైన స్థానం సంపాదించు కున్నాయి. 2007 మే 30న ఆయన భౌతికంగా మన మధ్యనుండి వెళ్లిపోయినా, ఆయన సాహిత్యమూర్తి తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది. తెలుగు సాహిత్య చరిత్రలో శేషేంద్ర శర్మ ఒక మహానామం. ఆయన కవిత్వం, విమర్శ, తత్త్వచింతనలు ఈ తరానికి మాత్రమేకాదు, రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలవనున్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# మహానాడుతో పెరిగిన ధీమా



తెలుగుదేశం పార్టీకి ఒక పండుగగా మహానాడుని నిర్వహిస్తారు. ఈసారి కడపలో అలాగే నిర్వహించారు. మహానాడు మీద ఈసారి నారా లోకేష్ ముద్ర అధికంగా పడింది గతానికి ఇప్పటికీ భిన్నం ఏమిటి అంటే చంద్రబాబు కంటే ఎక్కువగా ఫోకస్ లోకేష్ మీద ఉండడం. అంతే కాదు ఈసారు ఆరు శాసనాలు పేరుతో లోకేష్ ప్రతిపాదించిన అంశాల మీద చర్చ సాగింది. మరో వైపు చూస్తే ప్రతీ సారి ఒక తీర్మానానికి ముందూ వెనక చంద్రబాబు సుదీర్ఘంగా ప్రసంగించేవారు. అలాగే నాయకులు కూడా కొంచెం ఎక్కువ సమయం తీసుకునేవారు. దాంతో అనుకున్న దాని కంటే ఎక్కువ సమయం అయ్యేది. కానీ ఈసారి మాత్రం అనుకున్న సమయానికే సభను ముగించారు. సుదీర్ఘమైన ఉపన్యాసాలు లేవు. అంతా టైం చూసుకుని మరీ అర్థవంతమైన నాణ్యమైన ప్రసంగాలు చేశారు. ఒక విధంగా అంతా సిస్టమేటిక్ గా జరిగిపోయింది. దాంతో లోకేష్ మార్క్ ఈసారి మహానాడు మీద స్పష్టంగా ఉంది అని అంతా అంటున్నారు. ఇంకో విషయం ఏంటి అంటే ఈసారి మహానాడు పూర్తి స్థాయి ఆత్మ విశ్వాసంతో ధీమాత సాగింది. మరో నాలుగు దశాబ్దాల పాటు టీడీపీ జెండాకు తిరుగులేదు అన్న నిబ్బరాన్ని అటు నాయకులకూ ఇటు క్యాడర్ కి కూడా ఇచ్చింది. చంద్రబాబు తర్వాత ఎవరూ అన్న ప్రశ్న 2023లో నిర్వహించిన మహానాడు దాకా ఉండేది. కానీ ఈసారి మహానాడుకి మాత్రం అది ఏ మాత్రం కనిపించలేదు. నారా లోకేష్ భవిష్యత్తు నాయకుడిగా ఎదగడమే అందుకు కారణం అని అంటున్నారు. ఇక నాయకులు అంతా లోకేష్ కి ప్రమోషన్ ఇవ్వాలని కోరడం జరిగింది. ఆయనకు వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వాలని బాబుని వినతి చేయడం



జరిగింది. ఆ విధంగా చూస్తే యువ నాయకత్వం టీడీపీకి ఉందని అది పదిలంగా ఉందని బాబు తరువాత లోకేష్ చేతిలో పార్టీ పూర్తి భద్రతతో ఉంటుందని అంతా నమ్మకంగా ఉన్నారు. ఆ సన్నివేశం అయితే ఈసారి మహానాడులో కనిపించింది. దాంతో మహానాడులో అనుకున్న లక్ష్యం అయితే నెరవేరింది అని అంటున్నారు. ఏపీలో బలమైన రాజకీయ పార్టీగా సుదీర్ఘమైన చరిత్ర ఉన్న పార్టీగా టీడీపీ ఈ మహానాడుతో నిరూపించుకుంది. ఇక క్యాడర్ కి ప్రాధాన్యత అని చెప్పడం వారినే అధినాయకత్వంగా గుర్తిస్తామని చంద్రబాబు లోకేష్ గట్టి భరోసా ఇవ్వడంతో క్యాడర్ లో ఫుల్ జోష్ కనిపించింది. అంతే కాదు యువతకు పెద్ద పీట వేస్తామని రానున్న రోజులు అన్నీ యువతరానివే అని చెప్పడం ద్వారా వారిలోనూ కొత్త ఆశలు కల్పించారు. అంతే కాదు కష్టపడి పనిచేస్తే కీలక పదవులు మీ సొంతం అని కూడా చెప్పకనే చెప్పారు. మొత్తానికి ఈసారి మహానాడుతో మరో నాలుగు దశాబ్దాల పాటు పసుపు జెండా రెపరెపలాడేలా ఉత్సాహం కనిపించింది అని అంతా అంటున్నారు.

## తాలిబాన్ నాయకుడికి స్వేచ్ఛ... ట్రంప్ సంచలన నిర్ణయం ఎందుకంటే..?


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ఎన్నో సంచలన నిర్ణయాలు తీసుకొన్న సంగతి తెలిసిందే. ఇందులో కొన్ని ప్రపంచ దేశాలకు షాకిస్తే.. కొన్ని అమెరికా పౌరులకూ షాకిచ్చాయని చెబుతారు. ఈ సమయంలో తాలిబాన్ కీలక నాయకుడి విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అవును... అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు తీసుకున్న అనంతరం డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయాలు తీసుకొంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. ఆ జాబితాలో మరో నిర్ణయం చేరింది. ఇందులో భాగంగా... తాలిబాన్ కీలక నాయకుడికి ట్రంప్ స్వేచ్ఛను ప్రసాదించారు. గతంలో అతడిపై ప్రకటించిన క్యాష్ రివార్డును ఎత్తివేశారు. వివారాల్లోకి వెళ్తే... తాలిబాన్ కీలక నాయకుడు సిరాజుద్దీన్ హక్కానీపై గతంలో 10 మిలియన్ డాలర్ల బహుమతిని అమెరికా



ప్రకటించింది. ఎవరైనా సరే అతడిని పట్టిచ్చినా.. లేదా, అతడు ఎక్కడున్నాడనే సమాచారాన్ని తెలియజేసినా ఈ రివార్డు దక్కించుకోవచ్చని తెలిపింది. అయితే... తాజాగా ఆ రివార్డును ట్రంప్ సర్కార్ ఎత్తేసింది. ఈ సందర్భంగా.. తమ చెరలో ఉన్న దేశస్తుడిని విడుదల చేసిన నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని ఆఫ్ఘనిస్తాన్ హెూం మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అబ్దుల్ మతీన్ ఖనీ తెలిపారు. వాస్తవానికి 2008లో ఆఫ్ఘన్ రాజధాని కాబుల్ లోని సెరెనా హెూటల్ లో అమెరికా పౌరుడు డేవిడ్ హెస్లాతో పాటు ఆరుమంది మృతికి హక్కానీ ప్రధాన సూత్రధారి. ఆ తర్వాత అతన్ని హిట్ లిస్ట్ లో చేర్చింది అమెరికా. ఈ నేపథ్యంలో.. రెండేళ్ళుగా అమెరికా చెరలో మగుతున్న అమెరికా పౌరుడు జార్జ్ గ్లెజ్మాన్ ను రిలీజ్ చేసినట్లు ఆఫ్ఘన్ ప్రభుత్వం తెలిపింది. గత వారమే అతనికి విముక్తి కల్పించినట్లు పేర్కొంది. దీని తర్వాత సిరాజుద్దీన్ పై విధించిన నగదు బహుమతిని అమెరికా ఎత్తేసింది. ఈ చర్చలకు ఖతర్ మధ్యవర్తిత్వం వహించగా.. జార్జ్ ని విడిపించడానికి రంగంలోకి దిగిన ట్రంప్.. హక్కానీ విషయంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

## 'రోజంతా నైటీ వేసుకోమంటున్నాడు'. భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు!


గుజరాత్ లోని అహ్మదాబాద్ లోగల జుహాపురాకు చెందిన 21 ఏళ్ల ఓ మహిళ.. తన భర్త, అత్తమామలు వేధింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేసింది. ఇంట్లో ఉన్నప్పుడు రోజంతా నైటీ ధరించాలని భర్త బలవంతం చేస్తున్నాడని.. తాను ఎప్పుడు పడుకోవాలో, ఎప్పుడు నిద్రలేవాలో ఆయనే డిసైడ్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది! అవును... 2023 మే నెలలో సౌదీ అరేబియాలో ఆ మహిళకు, ఓ డాక్టర్ కు వివాహం అయ్యింది. వివాహం తర్వాత ఆ మహిళ బాపునగర్ కు వెళ్లింది. అక్కడ భర్త, అత్తమామలతో నివసిస్తుంది! ఈ క్రమంలో తన భర్త డాక్టర్ అని, తాగుడుకు బాగా బానిసైపోయాడని, మాటలతో దూషించాడని ఆమె ఆరోపించింది. ఈ సమయంలో అత్తమామలకు అతని ప్రవర్తనపై ఫిర్యాదు చేస్తే... వారు కూడా



అతనికే మద్దతు ఇచ్చి, మరింత దుర్భాషలాడటం ప్రారంభించారని ఆమె ఆరోపించారు. తాను ఎప్పుడు నిద్రపోవాలి, ఎప్పుడు లేవాలి అన్నీ ఆయనే నియంత్రిస్తున్నాడని.. ఆయన పడుకునే ముందు అతని కాళ్లకు మసాజ్ చేయాల్సి వస్తోందని కూడా ఆమె పేర్కొంది. ఈ క్రమంలో... గత ఏడాది మే నెలలో ఫ్యామిలీ అంతా కాశ్మీర్ కు వెళ్లి వచ్చిన తర్వాత పరిస్థితి మరింత దిగజారిందని.. ఆ ట్రిప్ తర్వాత తాను తన పుట్టింటికి తిరిగి వచ్చేసినట్లు తెలిపారు. ఈ సమయంలో మధ్యవర్తిత్వం కోసం ప్రయత్నించినప్పటికీ ఆమె భర్త రాజీకి ప్రయత్నించలేదని ఆమె ఆరోపించారు. దీంతో... తాజాగా ఆమె వెజల్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె చేసిన ఆరోపణలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే... ఆమె భర్త నుంచి కానీ, ఆ ఫ్యామిలీ మెంబర్స్ నుంచి కానీ ఎలాంటి ప్రకటనలు వెలువడలేదు!

## తెల్ల కార్డు ఉంటే అక్కడ అన్నీ చౌకగానే!

ఏపీలో జూన్ 1వ తేదీ నుంచి రేషన్ ని ఇంటింటికీ వచ్చే వాహనాల వద్ద ఇవ్వరన్నది తెలిసిందే. దీని మీద ఈ నెల 20న జరిగిన మంత్రివర్గ సమావేశంలో కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. దాంతో పాటు గతంలో మాదిరిగా రేషన్ దుకాణాల వద్దనే రేషన్ సరుకులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కేవలం బియ్యం మాత్రమే ఇప్పటిదాకా రేషన్ గా ఇచ్చేవారు. కానీ రేషన్ దుకాణాలలో దానితో పాటు నిత్యావసర సరుకులను కూడా చౌక దుకాణాలలో ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దానితో రేషన్ దుకాణాలకు మంచి డిమాండ్ ఏర్పడనుంది. బియ్యంతో పాటు పంచదార, వంట నూనె, అలాగే కందిపప్పు కూడా చౌక ధరలకే ఇస్తారని ప్రభుత్వం ప్రకటించింది. దాంతో నాలుగు రకాలైన సరుకులు చౌకగా లభించనున్నాయన్న మాట. అంతే కాదు బియ్యం ఉచితంగా లభిస్తుంది అన్నది తెలిసిందే. దాంతో తెల్ల రేషన్ కార్డులు ఉన్న వారికి ఇది శుభవార్తగా భావిస్తున్నారు. చాలా కాలంగా రేషన్ అంటే కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. దాంతో బియ్యాన్ని కూడా అమ్ముకునే పరిస్థితి ఉంది. ఇపుడు ఇతర నిత్యవసరాలను ఇవ్వడం ద్వారా తెల్ల కార్డుదారులకు మేలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరో వైపు చూస్తే కనుక రేషన్ సరకులు మరిన్ని భవిష్యత్తులో పెంచే ఆలోచన కూడా ఉందని చెబుతున్నారు. దాని వల్ల చౌక దుకాణదారులకు



సైతం మేలు జరుగుతుందని భావిస్తున్నారు. రేషన్ డీలర్లు అయితే మామూలుగా కేవలం బియ్యం మాత్రమే పంపిణీ అంటే కొంత ఆలోచిస్తారు. అనేక రకాలైన సరకులు రేషన్ దుకాణాల ద్వారానే విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పాటు భవిష్యత్తులో పేదలకు అవసరమైన వస్తువులు అన్నీ కూడా సబ్సిడీ ధరలకు చౌక దుకాణాలే కేంద్రంగా అమ్మాలని ఆలోచన చేయడం వల్ల అందరికీ లబ్ది కలుగుతుందని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే బహిరంగ మార్కెట్ లో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యం ఉంది. గతంలో 2014 నుంచి 2019 దాకా సాగిన చంద్రబాబు ప్రభుత్వంలో సబ్సిడీ మీద అనేక సరుకులు రేషన్ దుకాణాలలో విక్రయించేవారు. తిరిగి అలాంటి పరిస్థితి తీసుకుని రాబోతున్నారు అని అంటున్నారు. అంతే కాదు చౌక దుకాణాలకు పూర్వ వైభవం కలిగించడం ద్వారా డీలర్లకు కూడా మంచి ఉపాధి కల్పించాలని చూస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఇప్పటికే రేషన్ నిల్వలను పౌరసరఫరాల శాఖ నుంచి రేషన్ దుకాణాలకు తరలించే కార్యక్రమం మొదలైంది అని అంటున్నారు. పకడ్బందీగా ఈ ప్రక్రియ సాగుతోంది. ఇంకో వైపు చూస్తే రేషన్ దుకాణాలు పూర్తి పనిగంటలతో నిర్దేశించిన వేళలల తెరచేలా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

## ఇజ్రాయెల్ పై దాడి చేస్తే నాశనమే... ఇది తాజా ఉదా.!

ఇజ్రాయెల్ పై దాడి చేస్తే.. ఇక వారిని పూర్తిగా నాశనం చేసే వరకూ ఆ దేశం విశ్రమించడం లేదు! ఈ విషయంలో పూర్తి అనుభవం హమాస్ ఉగ్రవాదులు, గాజా ప్రజలకు అయ్యిందనే చెప్పాలి! తమ దేశ పౌరులను ఊచకోత కోసినందుకు ప్రతీకారంగా గాజాలో హమాస్ చివరి ఉగ్రవాదిని చంపేవరకూ విశ్రమించకుండా ఐడీఎఫ్ విరుచుకుపడుతుంది. ఇజ్రాయెల్ పై దాడి చేసిన మరుసటి రోజు నుంచి గాజాను ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) వణికించేస్తోంది. గాజా స్ట్రిప్ మొత్తాన్ని కాంక్రీట్ దిబ్బగా మార్చేసింది. ఇక, అక్కడి ప్రజల పరిస్థితి అత్యంత దయణీయంగా మారిపోయింది. ఈ సమయంలో.. హమాస్ కు మద్దతుగా ఇజ్రాయెల్ పై దాడులు చేపట్టిన యెమెన్ లోని హూతీ రెబల్స్ పై ఐడీఎఫ్ కీలక దాడి చేసింది. అవును... హమాస్ కు మద్దతుగా ఇజ్రాయెల్ పై దాడులు చేసిన హూతీ రెబల్స్ పై ఐడీఎఫ్ విరుచుకుపడింది. ఇందులో భాగంగా.. యెమెన్ లోని హూతీ రెబల్స్ ఆధీనంలోని సనా ఎయిర్ పోర్టుపై ఇజ్రాయెల్ ఫైటర్లు జెట్లు విరుచుకుపడ్డాయి. అక్కడ ఉన్న విమానాలన్నింటినీ ధ్వంసం



చేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ ప్రకటించారు. ఈ సందర్భంగా స్పందించిన ఆయన.. సనా ఎయిర్ పోర్టులో హూతీ ఉగ్రవాదులే లక్ష్యంగా తమ ఎయిర్ ఫోర్స్ జెట్లు దాడులు చేశాయని.. వారికి ఉన్న చివరి విమానాన్ని కూడా ధ్వంసం చేశాయని.. ఇది వారికి స్పష్టమైన సందేశంతోపాటు.. మా పాలసీ ఏమాత్రం మారలేదనే విషయాన్ని స్పష్టం చేస్తోందని.. ఇజ్రాయెల్ పై ఎవరు దాడి చేసినవారు భారీ మూల్యం చెల్లించాల్సిందేనని అన్నారు. వాస్తవానికి ఈ ఏడాది మే నెలలో హూతీ రెబల్స్ ప్రయోగించిన క్షిపణులు ఇజ్రాయెల్ లోని బెన్ గురియన్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కు సమీపంలో పడ్డాయి. దీంతో.. నాడు కొన్ని విమాన సర్వీసులు రద్దయ్యాయి.

ఫలితంగా... సనా ఎయిర్ పోర్టులో హూతీ ఉగ్రవాదులే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఎయిర్ ఫోర్స్ జెట్లు దాడులు చేశాయి.. వారికి ఉన్న చివరి విమానాన్ని కూడా ధ్వంసం చేశాయి. దీనికి తోడు ఎర్ర సముద్రంలో నౌకలను లక్ష్యంగా హూతీ రెబల్స్ దాడులు చేస్తున్నారు. దీంతో.. వీరిపై అమెరికా సంకీర్ణ దళాలు దాడులు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే గత నెల చివర్లో యెమెన్ కారాగారంపై అమెరికా జరిపిన దాడిలో 68 మరణించగా.. 47 మంది గాయపడ్డారు.

# చురకలు

## సంపాదకీయం

## విదేశీ విద్యపై భారతీయుల ఖర్చు.. దేశానికి నష్టమేనా?

ఈ రోజుల్లో భారతీయ యువతకు విదేశీ విద్య ఒక గొప్ప ఆకర్షణగా మారింది. 2025 నాటికి సుమారు 18 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతారని అంచనా. వీరిలో ఎక్కువగా అమెరికా (3.3 లక్షల మంది), కెనడా (1.3 లక్షల మంది), యూకే (దాదాపు 1 లక్ష), జర్మనీ (50,000 మందికి పైగా) వంటి దేశాలను ఎంచుకుంటున్నారు. ఒక విద్యార్థి సగటున సంవత్సరానికి సుమారు రూ. 50 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారని అంచనా. దీని వల్ల దేశం ప్రతి సంవత్సరం దాదాపు రూ. 3 లక్షల కోట్ల మేర నష్టాన్ని చవిచూస్తోంది. ఇది నిజంగా ఆశ్చర్యకరమైన, ఆలోచించాల్సిన విషయం. ఈ భారీ మొత్తంతో భారతదేశంలో వందల సంఖ్యలో ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలను నిర్మించవచ్చు. మెరుగైన తరగతి గదులు, ఆధునిక ప్రయోగశాలలు, నిపుణులైన అధ్యాపకులు, పరిశోధనా సౌకర్యాలు.. ఇవన్నీ దేశంలోనే అందుబాటులోకి వస్తాయి.

**-దేశీయ విద్యను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలు...** భారతదేశంలోనే నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి. ఐఐటీ, ఐఐఎం స్థాయికి పరిమితం కాకుండా, అన్ని రంగాలలోనూ నాణ్యమైన విద్యను అందించే విశ్వవిద్యాలయాలను స్థాపించడం ముఖ్యం. ఇది విద్యార్థులకు దేశీయంగానే ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందుబాటులోకి తెస్తుంది. విదేశాల్లో చదువుకోవడానికే కాకుండా, దేశీయంగా చదువుకునే విద్యార్థులకు కూడా విద్యా రుణాల విషయంలో ప్రాధాన్యత ఇవ్వాలి. దీనివల్ల ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు కూడా దేశంలోనే ఉన్నత విద్యను అభ్యసించ గలరు. పరిశోధనలు, పేటెంట్లు, కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్ స్థానాన్ని మెరుగుపరచాలి. ఇది దేశీయంగా పరిశోధనా వాతావరణాన్ని బలోపేతం చేస్తుంది. ప్రైవేట్ సంస్థలు నాణ్యమైన విద్యాసంస్థలను స్థాపించడానికి సరళమైన విధానాలు, సుంకాల్లో రాయితీలు ఇవ్వాలి. ప్రైవేట్ రంగ భాగస్వామ్యం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదు.

**– భారతదేశంలోనే విదేశీ విశ్వవిద్యాలయాల స్థాపనకు చర్యలు...** విదేశీ విద్య కోసం మన విద్యార్థులు ఇతర దేశాలకు వెళ్లకుండా, ఆయా యూనివర్సిటీలు మన దేశంలోనే క్యాంపస్‌లను స్థాపించేలా ప్రోత్సహించాలి. యూజీసీ, ఏఐసీటీఈ ద్వారా ఫుల్ క్యాంపస్‌లతో విదేశీ యూనివర్సిటీలు భారతదేశంలో స్థాపించేందుకు స్పష్టమైన విధానాలను రూపొందించాలి. ఇది వారికి ఒక స్పష్టమైన మార్గాన్ని చూపుతుంది. విదేశీ విద్యా సంస్థల కోసం ప్రత్యేక విద్యా జోన్‌లను ఏర్పాటు చేయడం వల్ల స్థలం, మౌలిక వసతుల సమస్యలు తొలగిపోతాయి. ఇది వారికి పెట్టుబడులు పెట్టడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. విదేశీ సంస్థలకు తక్కువ పన్ను శాతం లేదా ప్రారంభ దశలో పన్ను మినహాయింపు ఇవ్వడం ద్వారా వారిని ఆకర్షించవచ్చు. ఆర్థిక ప్రోత్సాహకాలు వారికి ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహాన్ని ఇస్తాయి. భారత ప్రభుత్వ విద్యా సంస్థలు, పరిశోధనా కేంద్రాలు విదేశీ యూనివర్సిటీలతో కలిసి సంయుక్త కోర్సులు, డబుల్ డిగ్రీలు అందించవచ్చు. ఇది రెండు దేశాల విద్యా వ్యవస్థల మధ్య సహకారాన్ని పెంచుతుంది. విదేశీ అధ్యాపకులు భారత్‌లో బోధన చేయడానికి వీలుగా ప్రత్యేక వీసా విధానం, నివాస నిబంధనల సడలింపు అవసరం. నాణ్యమైన విదేశీ అధ్యాపకుల ద్వారా మన విద్యార్థులు ప్రపంచ స్థాయి జ్ఞానాన్ని పొందగలరు. విద్య అనేది ఒక దేశ భవిష్యత్తుకు మూలం. మన యువత విదేశాల్లో చదివి ఉద్యోగాలు పొందితే వారి వ్యక్తిగత భవిష్యత్తు పరిరక్షించబడవచ్చు. కానీ అదే విద్య మన దేశంలోనే అందుబాటులోకి వస్తే, అది దేశానికి కూడా ఒక పెట్టుబడి అవుతుంది. దేశీయ విద్యా వ్యవస్థను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడానికి ప్రభుత్వ నిర్ణయాలు, ప్రైవేట్ పెట్టుబడులు, సామాజిక అవగాహన కలగలిసినప్పుడు భారతదేశం ఒక శక్తివంతమైన విద్యా కేంద్రంగా ఎదగగలదు. విదేశీ విద్యపై వెచ్చించే రూ. 3 లక్షల కోట్లను దేశీయ విద్యలో పెట్టుబడిగా మార్చడం ద్వారా మన దేశ విద్యా రంగంలో సరికొత్త శిఖరాలను చేరుకోవచ్చు.

## తెలుగు చిత్రసీమలో దాసరిది నూతన ఒరవడి - మే 30.. దర్శక రత్న దాసరి నారాయణ రావు వర్ధంతి

తెలుగు సినిమా రంగంలో ఆయన ఒక ట్రెండ్ సెట్టర్. చిత్ర నిర్మాణంలో ఏ విభాగంలో నైనా ఆయనది ప్రత్యేక శైలి. అయన ప్రత్యేక గుర్తింపు పొందిన సినిమా దర్శకులు, విలక్షణ నటులు, గీత, సంభాషణ రచయిత, చిత్ర నిర్మాత. అత్యధిక చిత్రాల దర్శకునిగా తెలుగు, హిందీ భాషల్లో 151 సినిమాలకు దర్శకత్వం వహించడం ద్వారా 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'ల్లోకి ఎక్కారు. గిన్నిస్ బుక్ లో స్థానం పొందారు. 53 సినిమాలు స్వయంగా నిర్మించారు. 250 పైగా చిత్రాలలో సంభాషణ రచయితగా లేదా గీత రచయితగా పని చేశారు. తెలుగు, తమిళం , కన్నడ భాషా చిత్రాలలో నటించి, నటనకుగాను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ నటునిగా బహుమతి కూడా పొందారు. అంతేకాదు రాజకీయ నాయకులు, కేంద్ర మంత్రిగా సుపరిచితులు. ఆయనే బహుముఖ ప్రజ్ఞాశాలి దాసరి నారాయణరావు. దాసరి నారాయణరావు ( మే 4, 1947 - మే 30, 2017) కళాశాలలో చదివే రోజులలో బీ.ఏ డిగ్రీతో ఉత్తీర్ణులు కావడంతో పాటు దాసరి అనేక నాటక పోటీలలో కూడా పాల్గొనేవారు. అనతి కాలంలోనే ప్రతిభ గల రంగ స్థల నటుడిగా, నాటక రచయితగా చిత్ర దర్శకుడిగా గుర్తింపు పొందారు. మోహన్ బాబు, ఆర్. నారాయణమూర్తి, కోడి రామకృష్ణ, రేలంగి నరసింహారావు, రవిరాజా పినిశెట్టి తదితర నటులు, దర్శకులు, ఎందరో సాంకేతిక నిపుణులను దాసరి తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం చేశారు. సినీ రంగానికి పరిచయం చేసి ఎదిగేందుకు చేయూత అందించారు. ఒక సమయంలో ఆయన పేరిట తెలుగు నేలపై 18వందలకు పైగా దాసరి అభిమాన సంఘాలు ఉండేవంటే సామాన్యం కాదు. ఆదుర్తి సుబ్బారావు దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా, శిష్యరికం చేసి సినిమా దర్శకత్వంలో తనకంటూ ఓ ప్రత్యేకశైలిని అలవర్చుకున్నారు. తర్వాత భిన్నమైన చిత్రాలను రూపొందించారు. 1974లో తాతా మనవడు సినిమాతో సినీ ప్రస్థానం ప్రారంభించిన దాసరి తొలి సినిమాకే నంది అవార్డు అందుకొని సంచలనం సృష్టించారు. తాతా మనవడు, స్వర్గం నరకం, మేఘసందేశం, మామగారు అనేక అవార్డులు తెచ్చిపెట్టాయి. మేఘ సందేశం చిత్రాన్ని కేన్స్, షికాగో, మాస్కో అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించారు. దాసరి తిసిన బొబ్బిలి పులి , సర్దార్ పాపారాయుడు చిత్రాలు నందమూరి తారక రామారావు రాజకీయ ప్రవేశములో ప్రధానపాత్ర వహించాయి. మామగారు, సూరిగాడు, ఒసేయ్ రాములమ్మ చిత్రాలు దాసరి నటనా కౌశలానికి మచ్చు తునకలుగా మిగిలాయి. ఆ సినిమాలలో నటనకు దాసరి అనేక విమర్శకుల ప్రశంసలు , బహుమతులు అందుకున్నారు. 1947, మే 4న పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లులో జన్మించారు. ఆయన తండ్రి తరం వరకూ వారి కుటుంబంలో ఎవరూ చదువు కోలేదు. దాసరిని చదివించే క్రమంలో, ఆరో తరగతి కొచ్చేసరికి వారి ఆర్థిక పరిస్థితి బాగా దెబ్బతింది. స్కూలు ఫీజు మూడుం పావలా కట్టడానికి కూడా డబ్బులేక బడి మాని, ఒక వడ్రంగి దుకాణంలో నెలకు రూపాయికి పని చేయాల్సి వచ్చింది. అయితే ఒక మాస్టారు సాయంతో మళ్ళీ చదువు కొనసాగించారు. రామోజీ రావు వార్తాపత్రిక ఈనాడుకు ధీటుగా భావించి ఉదయం దినపత్రికను ఆయన ప్రారంభించి, కొత్త జర్నలిజానికి పురుడు పోశారు. ఎందరినో జర్నలిస్టులు తీర్చిదిద్దారు. రాజీవ్ గాంధీ పాలనా కాలములో, దాసరి కాంగ్రెస్ పార్టీ పక్షాన ఔత్సాహికులై ఎన్నికల ప్రచారము సాగించారు. రాజీవ్ హత్యానంతరం పార్టీకి కాస్త దూరంగా జరిగారు. 1990 దశకం చివరిలో ఆయన తెలుగు తల్లి పేరిట రాజకీయ పార్టీని ప్రారంభించారు. ఈ పార్టీకి కోస్తా ప్రాంతాలలోని కాపు వర్గాల నుండి మంచి స్పందన లభించింది. తర్వాత మాత్రం కాంగ్రెస్ పార్టీకి అనుకూలురై, కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభకు ఎన్నిక అయ్యారు. బొగ్గు, గనుల శాఖకు కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. సోనియా గాంధీకి సన్నిహితులుగా మెదిలారు. 1974లో తాతా మనవడు చిత్రానికి నంది అవార్డు, స్వర్గం నరకం సినిమాకు ఉత్తమ చిత్రంగా బంగారు నంది బహుమతి , 1983లో మేఘ సందేశం చిత్రానికి గాను ఉత్తమ దర్శకుడిగా నంది అవార్డు, 1992లో మామగారు చిత్రానికి గాను ఉత్తమ నటుడు నంది అవార్డు, 1986లో తెలుగు సంస్కృతి , తెలుగు చిత్ర రంగం నకు ఆయన చేసిన సేవలకు గాను ఆంధ్రా విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, ఫిల్మ్ ఫేర్ అవార్డు 6 సార్లు, మద్రాసు ఫిల్మ్ ఫాన్స్ అవార్డ్




5 సార్లు, సినీ హెరాల్డ్ అవార్డ్ 10 సంవత్సరాలు వరసగాను పొందారు. జ్యోతిచిత్ర నుండి సూపర్ డైరెక్టర్ అవార్డ్ కు 3 సార్లు, పాత కాలం నాటి ఆంధ్రపత్రిక నుండి ఉత్తమ దర్శకుడిగా 6 సార్లు ఎంపిక అయ్యారు. తెలుగు సినీ పరిశ్రమలో ఎన్టీఆర్, దాసరి నారాయణ రావు సూపర్ హిట్ కాంబినేషన్ కాగా... ఎన్టీఆర్ రాజకీయాల్లో ప్రవేశించిన సమయానికి దాసరి తెరకెక్కించిన చిత్రాలు ప్రధాన పాత్రలు పోషించాయి. ఎన్టీఆర్, దాసరి నారాయణ రావు కలయికలో మొదటి సారి 'మనుషులంతా ఒక్కటే' సినిమా రాగా, బాక్సాఫీస్ సూపర్ హిట్‌గా నిలిచింది. ఎన్టీఆర్, దాసరి నారాయణ రావు కలయికలో వచ్చిన రెండో చిత్రం 'సర్కస్ రాముడు'. మూడో చిత్రం 'సర్దార్ పాపారాయుడు'. నాలుగో చిత్రం 'విశ్వరూపం'. ఐదో చిత్రం 'బొబ్బిలి పులి' ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ సక్సెస్ అయింది. తెలుగు ప్రజల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన దాసరి నారాయణరావు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ 2017 మే 30న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## అపర శ్రీ శుకుడు రాజన్న శాస్త్రి - నేడు పరమ భాగవత తోత్తముని వర్ధంతి

కోటి రతనాల వీణ తెలంగాణ లోని కరీంనగర్ జిల్లా గోదావరి తీరం శ్రీలక్ష్మీనర సింహ దివ్య పుణ్యక్షేత్రం. ధర్మపురిలో వేద పురాణ జ్యోతిష, సంగీత, సాహిత్య కళా రంగాలకు చెందిన పండితులు, విద్వాంసులు, ఆధ్యాత్మిక వేత్తలు జన్మించి ఆఖండ కీర్తి ప్రతిష్టలు గడించారు. జీవితాంతం భాగవత చింతన తోనే గడుపుతూ 5 దశాబ్దాలుగా పలు వేదికలపై అద్భుత ప్రవచనాలు చేసిన మహానుభావుడు, కర్మ యోగి గుండి రాజన్న శాస్త్రి. ఆబాల గోపాలాన్ని పరవశింపజేసే శాస్త్రి ప్రవచనాలకు దేశవిదేశీయులు సైతం అభిమానులయ్యారు. అపరశుక, వాల్మీకి, వ్యాసునిగా ప్రసిద్ధిగాంచిన ఆయన పాలరాతి విగ్రహాన్ని ధర్మపురిలో నెలకొల్పారంటే శాస్త్రి గొప్పతనం అర్థం చేసుకోవచ్చు.

**జీవిత విశేషాలు...** గుండి లక్ష్మీనరసింహ ఘనాపాటీ, లక్ష్మీ నర్సమ్మ దంపతులకు 9,12.1898లో జన్మించిన శాస్త్రి గుండి పాపయ్యశర్మకు దత్త పుత్రుడయ్యాడు. ఉర్దూ మాధ్యమంలో ప్రాథమిక విద్య, సంస్కృతాంధ్ర భాషల్లో పాండిత్యం వొఝుల హన్మంతయ్య సిద్ధాంతి వద్ద లీలావతి గణితం, లౌకిక విద్యలు, తండ్రి వద్ద వేదాధ్యయనం మంథెన గట్టు కృష్ణమూర్తి వద్ద వేదాంగాలు, ఉపనిషత్తులు, ప్రస్తాన త్రయం, శాస్త్రాధ్యయనం, ఇతిహాస పురాణాదులలో శిక్షణ పొందారు. భార్య పేరు గుండమ్మ, ఆయనకు నలుగురు కుమారులు ఒక కుమార్తె కలిగారు. భాగవత, శ్రీవైష్ణవ సంప్రదాయానికనుగుణంగా ముకుందుడు, రఘురాముడు, అచ్యుతుడు, గోవిందుడు, హరిప్రియ అని నామకరణాలు చేశారు. మూర్తీభవించిన భాగవతంగా పేరొందిన నవయో గీంద్ర భిక్షుగీత, ఉద్ధవ బోధనలు, రుక్మిణీ కల్యాణం గోపికాగీతాలు, కుంతి, భీష్మ, ధృవ, ప్రహ్లాద, గజేంద్ర బ్రహ్మాస్తవరములు, ఇతిహాసాలు, మృదుమధురంగా ప్రవచించేవారు. ఇప్పటికీ ఆయనను అందరూ అవతార పురుషుడుగా, దైవాంశ సంభూతుడుగా, వ్యాసుడే భువిపైకి రాజన్న పేరుతో వచ్చాడని భావిస్తారు. ఆయన కులమతాలకతీతంగా కలిసిపోవడం, ధర్మపురిలో వారసంత నిర్వహణకు ప్రేరణ, బాలబాలికలను చేరదీసి సంస్కృతం మాట్లాడించడం, వితంతువులకు విద్య అవసరమని భావించి వారిని





చదివించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. భూస్వాములు, దొరలు వస్తే వారిని తన ప్రవచనాలతో దాతలుగా మార్చేవారు. భాగవతంలో 18వేల శ్లోకాలు కంఠతా చదువుతూ అర్థతాత్పర్యాదులను వివరించ గలిగే అసాధారణ ధారణ శక్తి కలవారు. శాస్త్రి పాలరాతి విగ్ర హాన్ని గోదావరి నది వద్ద శ్రీరామ ఆలయ సమీపంలో తాడూరి బాలకృష్ణ మహోపాధ్యాయుడు తన సొంత స్థలంలో ఆవిష్క రింప జేశారు. గుంటూరు వాసులు సంగా వెంకటనారాయ శర్మ ఆదిలక్ష్మీ దంపతులు, పెద్దపల్లి, కరీంనగర్ లో జరిగిన ప్రవచనాల్లో శాస్త్రి ప్రవచనాలను 2005లో శాస్త్రి కుమారుడు రామచంద్రుడు టేపులను సీడీలు, క్యాసెట్లుగా రూపొందించారు. ఇందులో ఉప్పుల రాధాకృష్ణ కృషి చాలా ఉంది. పలుమార్లు కాశీలో కూడా ప్రవచనం చేసిన శాస్త్రిచే కరీంనగర్ వీరాంజనేయ స్వామి దేవాలయంలో మంగళంపల్లి మురహరిశర్మ భాగవత సప్తాహం చేయించారు. శాస్త్రి ప్రవచనాలను 50 మంది లబ్ద ప్రతిష్టులు, శాస్త్రి బంధువులు రాసిన అభిప్రా యాలు, వ్యాసాలతో మనుమడు విష్ణుప్రసాద్ సతీమణి డాక్టర్ వారిజా రాణి సంపాదకురాలిగా, మరో మనుమడు గుండి విష్ణుప్రసాద్ ప్రేరణతో ఎం. శేషాచలం అండ్ కంపని "ఎమెస్కో" ఓ పుస్తకం ప్రచురించింది. ఇంకా ఎందరిదో కృషి ఫలితంగా ఈ మహానీయుని చరిత్ర వెలుగు చూసింది. 30 మే 1975లో 82వ యేట శాస్త్రి బ్రహ్మలీనులైనారు.

**శాస్త్రి ప్రతిభకు నిదర్శనాలు...** 1968లో జర్మనీ యువతి శాస్త్రిని సత్కరించి ప్రవచనాలను ఇంగ్లీషులో తర్జుమా చేయించుకొని సంస్కృతం నేర్చుకొంది. ఇంగ్లాండ్ ఎంపీ హ్యూస్ బ్రిటీష్ ప్రభుత్వ ప్రతినిధిగా వచ్చి ప్రవచనాన్ని విని భారత దేశ ధార్మిక ప్రవృత్తి గొప్పదని కొనియాడారు. ధర్మపురి సంస్కృతాంధ్ర కళాశాలకు శంకుస్థాపన చేయగా వేలాది ఉభయ భాషా పండితులకు కల్పతరువై విరాజిల్లుతోంది. ప్రాక్పశ్చిమ ఉత్తర దక్షిణ యాత్రలను సంపూర్ణంగా కాలినడకన పూర్తి చేశారు. జిల్లాకు ఒకప్పటి ముస్లిం కలెక్టర్‌కు ఉర్దూ పారశీక భాషల్లో భాగవత శ్లోకాలు అర్థతాత్పర్యాదులతో వివరించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, దివంగత మాజీ ముఖ్యమంత్రులు బూర్గుల రామృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి, దామోదరం సంజీవయ్య, కెవీ కేశవులు, కవిసామ్రాట్ విశ్వనాథ, జువ్వాడి గౌతంరావు, జువాడి చొక్కారావు, తెన్నేటి విశ్వనాథం, కాసుగంటి నారాయణరావు, దివాకర్ల వెంకటావధాని, జువ్వాడి రత్నాకర్ రావు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, వానమమాలై వరదాచార్యులు, మల్లాది, మార్కండేయశాస్త్రి, వేమూరి లక్ష్మీ నరహరి శాస్త్ర, వంటివారు ఆయన పురాణానికి శ్రోతలుగా పలు సందర్భాలలో శాస్త్రి స్వగృహానికి ఏతెంచి పురాణ శ్రవణం చేసి, పలు సందేహాలు నివృత్తి చేసుకున్నా రంటే గొప్పతనం కాక మరేమిటి. కరపాత్ర స్వామీజీ, శృంగేరీ, కంచి, కామకోటీ, పుష్పగిరి పీఠాధిపుతులు, మధ్వ పీఠాధిపతులు, తలపాక మహారాజు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి వంటి వారు ధర్మపురిని సందర్శించినపుడు శాస్త్రి ప్రవచనాలు విని అభినందించి సన్మానించారు. కరీంనగర్ కాంగ్రెస్ కురు వృద్ధులు మాజీ ఎంపీ, మాజీ మంత్రి జువ్వాడి చొక్కారావు ఇల్లు కట్టిస్తాననా్న, కాసుగంటి నారాయణరావు కొండగట్టు పై 200 ఎకరాల భూమిని రాసిస్తానన్నా, మానకొండూర్ సర్పంచ్ సదాశివరావు తన భూమినంతా దానం చేస్తానన్నా, నాయకులు రాష్ట్రపతి పురస్కార మిప్పిస్తా మన్నా సున్నితంగా తిరస్కరించిన ఉదాత్తుడు రాజన్న శాస్త్రి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## దైవ సమానులుగా గుడిలో నిత్య పూజలు అందుకుంటున్న గుండి రాజర్షి'' - మే 30... కర్మయోగి వర్ధంతి సందర్భంగా స్మృత్యంజలి

ఆయన కర్మయోగి. అష్టాదశ పురాణాలను ఔపోసన పట్టి, వేద వేదాంగ సకల శాస్త్రాలపై సాధికారికత కలిగి ఎలాంటి పౌరాణిక సందేహాన్ని అయినా నివృత్తి చేయగలిగిన అపర వేదవ్యాసుడు ఆయన. నిరంతర తపోనిష్టతో, నిత్య భాగవత పారాయణము మందే మునిగి తేలి, సిద్ధిపొందిన తాపసి ఆయన. దివంగత ప్రధాని పి.వి. నరసింహా రావు మొదలు గాగల అగ్ర నేతలు, కవిసామ్రాట్ విశ్వనాథ లాంటి సాంప్రదాయ కవులు, ప్రాచ్య పాశ్చాత్య విద్యావేత్తలు ఎందరి చేతనో పలుమార్లు దర్శింప బడి మహామహులచే పూజింప బడిన పరమ భాగవతోత్తముడు ఆయన. ఆయనే గుండి రాజర్షిగా పేరెన్నిక గన్న గుండి రాజన్న శాస్త్రి. ధర్మపురి క్షేత్ర గోదావరి తీరాన గుడి నిర్మించబడి, విగ్రహ ప్రతిష్ఠ జరిగి, నిత్య పూజలు అందుకుంటున్న దైవ సమానులు గుండి రాజర్షి. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యలకు నెలవై, హైందవ సనాతన సాంప్రదాయాలకు పట్టు కొమ్మయై, వేద సంస్కృతి సభ్యతలకు ఆలవాలమై, వరదాయినిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా తెలుగునేలపై వాసికెక్కిన, గోదావరి తీరస్త పవిత్ర తీర్థ రాజం ధర్మపురి క్షేత్ర కీర్తి ప్రతిష్టలను, దశదిశలా వ్యాపింప జేశారు, ఆపర వేదవ్యాసులుగా కీర్తించబడే గుండి రాజర్షి... వ్యాస, వాల్మీక, కాళిదాస, కాణాద, పైల, జెమిని, పరాశర ఆపస్తంభ అది మునులు ఋషులు, యోగులు, కర్మిష్ఠులు, పరివ్రాజకుల, ఆధ్యాత్మికుల వార సత్వాన్ని కొనసాగిస్తూ, దేవతా పూజలతో, ఆధ్యాత్మిక ఆది భౌతిక కార్యక్రమాలను, అక్షయ నిధులైన పురాణ ప్రవచనాలను, క్షేత్ర రాజం పరిరక్షిస్తూనే ఉంది. ఆ సంప్రదాయ ఆచరణ క్రమంలో "అపర వేదవ్యాసులు" గా పేరెన్నికగన్న రాజన్న శాస్త్రి తన స్వగృహంలో ప్రవచనాలను నిర్వహించగా, దివంగత భారత ప్రధాని పీవీ నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, ఆచార్య దివాకర్ల వెంకటావధాని, తెన్నేటి విశ్వనాథం, విశ్వనాథ సత్యనారాయణ లాంటి మహామహులు ఎందరో, ప్రత్యేకించి ఈ క్షేత్రానికి వచ్చి, రాజన్న శాస్త్రి, భాగవత ప్రవచనాలను విని, ఆధ్యాత్మిక లోకాలలో విహరించి, ఆయనకు ప్రణమిల్లిన సంఘటనలు, క్షేత్ర వాసులకు చర్విత చర్వణలే. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణచే "మ్రోయు తుమ్మెద" లో వర్ణించ బడినట్లుగా, గుండి రాజన్న శాస్త్రి అష్టాదశ పురాణాలను, నిరంతరం అధ్యయనం చేస్తుండగా పాశ్చాత్య పండితులెందరో, పౌరాణిక సందేహ నివృత్తికై శాస్త్రి వద్దకు వెళ్లిన సంఘటనలు, క్షేత్ర వాసులకు నిత్య జ్ఞాపకాలే. సాక్షాత్తు "వేదవ్యాస అవతారం"గా భావించబడే రాజన్న శాస్త్రి విగ్రహ ప్రతిష్ట చేసి, ఆలయం నిర్మించి, నిత్య పూజలు జరపడం విశేషం. ధర్మపురి క్షేత్రంలో గుండి లక్ష్మీ నరసింహ ఘనాపాఠి లక్ష్మీ నరసమ్మ దంపతులకు 1893 డిసెంబర్ 9న జన్మించిన శాస్త్రి, గుండి పాపయ్య కుటుంబానికి దత్తపుత్రులైనారు. బాల్యం నుండే ప్రహ్లాదాదుల వలె పరమాత్మ చింతనాపరులై, దివ్య ప్రబంధాదుల గానం చేస్తూ, ప్రాథమిక విద్య ఉర్దూ భాషలో జరిగినా, అష్ట వర్షములకే ఉపనయన సంస్కారులై, గాయత్రీ మంత్రోపాసకులై, వేదాధ్యయనాలు తండ్రి వద్ద చేసి, లీలావతి గణిత సాధన, మంథని చెందిన గట్టు కృష్ణశాస్త్రి వద్ద అమర భాష శాస్త్రాలను నేర్చుకున్నారు. అనంతరం వేద వేదాంగ, శాస్త్ర ఆగమ, ప్రస్థాన త్రయ, సాయణ భాష్య, శాంతి పాఠాలను రామాయణ, భారత, భాగవతాది పురాణాలు, ప్రధానంగా భాగవత బ్రహ్మసూత్రాలను కంఠోపాఠంగా చెప్పగలిగిన, అసాధారణ ధారణ శక్తి సంపన్నులైనారు. స్థానిక లక్ష్మీనరసింహ ఆలయంలో, కొంతకాలం నిరంతర భాగవత సప్తాహ యజ్ఞాలను నిర్వహించారు. ఉషః కాల మందే లేచి, నిత్య గోదావరి స్నానం, సంధ్యావందనం, ధ్యాన, ధారణ, పూజ, ఉపాసన, పారాయణ ఆది సత్కార్యా చరణలు నిత్య కృత్యాలుగా కలిగి ఉండేవారు. సమకాలీన సలక్షణ వేద ఘనాపాటిల సన్నిధిలో, వేదార్థ, ఉపనిషత్, భాష్య ప్రవచనం గావించేవారు. భక్త బృందం సమేతంగా, రాత్రి సత్సంగ, భక్తి మయ జాగరణలు, సంగీత సభలు, సాహితీ గోష్టులు, భజనలతో గడిపేవారు. ప్రధానంగా ధర్మపురి దేవస్థానంలో, వైకుంఠ ఏకాదశి, నరసింహ నవరాత్రులు, శివరాత్రులు, ఉగాది, ఆదిగా పర్వదిన వేడుకలను ప్రారంభించి ఆచరింప






చేశారు. పిత్ర స్వార్జితములను, దానధర్మాలకు సన్మానాలకు ధారపోసి, దాన గుణం సంపన్నులైనారు. బాలబాలికలచే, సంస్కృతం మాట్లాడింప చేస్తూ బాలురను శృతి, స్మృతి, పురాణ, కావ్య భక్తిరస ప్రధాన శ్లోకాలు, పద్యాలను కంఠస్తం చేయించేవారు. 1966 విజయదశమి నాడు క్షేత్ర రామలింగేశ్వరాలయంలో, సంస్కృతాంధ్ర డిగ్రీ ప్రాచ్య కళాశాల ప్రారంభించి, ప్రాణ ప్రతిష్ఠ గావించారు. నాటికీ, నేటికీ ఈ కళాశాల వేలాది మంది భాషా పండితుల తయారీ కేంద్రంగా భాసిల్లుతుండడానికి కారణ భూతు లైనారు . దేశ విదేశీయులు, శాస్త్రి దర్శనం చేసుకొని, పలు సందేహాలు నివృత్తి చేసుకునేవారు. శ్రీ శ్రీ శ్రీ శృంగేరి, కంచి కామకోటి, పుష్పగిరి, హంపి, పీఠాధిపతులు, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ పెద్ద జీయర్ స్వామి, తదితర జగద్గురు వులు క్షేత్రానికి విచ్చేసిన అన్ని సందర్భాలలోనూ, వారి సన్నిధిన అష్టాదశ పురాణ సందర్భాలను ప్రవచించి, వారిచే సన్మానితులు అయినారు. పి.వి. నరసింహా రావు, బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి, దామోదరం సంజీవయ్య తెన్నేటి విశ్వనాథం, విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వెంకటావధాని, బిరుదు రామరాజు, మార్కండేయ శాస్త్రి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, మల్లాది చంద్రశేఖర శాస్త్రి తదితరులు, పలుమార్లు రాజర్షి వద్దకు ఏతెంచి పునీతుల మైనా మని భావించి, అపర వేదవ్యాసులుగా కీర్తించిన సందర్భాలు అనేకానేకాలు. 84 సంవత్సరాలు జీవించి, ధర్మపురి వాసులను సన్మార్గమున నడిపి, 1975 మే 30న జీవన్ముక్తులై శివైక్యం పొందారు. శాస్త్రి మనమడు గుండి విష్ణు ప్రసాద్ చొరవతో, ఆయన సతీమణి ప్రొఫెసర్ వారిజా రాణి సంపాదకత్వంలో, లబ్ద ప్రతిష్టులైన వారి ప్రత్యేక వ్యాసాలతో అపూర్వ, అపురూప, అమూల్య పుస్తకం అచ్చు వేసి, రాజర్షి గురించి పలు అంశాలు పొందు పరచ గలిగారు. "భగవత్ సాన్నిహిత్య సాధనకు సాధువులే కానక్కరలేదని, కౌటింబిక జీవన విధానంలోనూ, భగవానుని భక్తితో కొలిస్తే, ముక్తి లభించగలదని", కొత్త సంప్రదాయానికి పురుడు పోసి, నిత్య నిరంతర పురాణ ప్రవచనాలు నిత్యానందంగా భావించి, సిద్ధి పొందిన తాపసి రాజ రుషికి గోదావరి తీరాన, రామమందిర సమీపాన, స్థిర విగ్రహ ప్రతిష్ట గావించి, గుడి కట్టి నిత్య పూజలు నిర్వహించడం, ధర్మపురి వాసులు చేసుకున్న పురాకృత సుకృతం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## రాయితీ యంత్రం వైపు..రైతు నేత్రం

నల్గొండ : రాయితీ వ్యవసాయ యంత్ర పరికరాల పథకానికి పలువురు దరఖాస్తు చేసినా.. నేటికీ అవి అందలేదు. ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 2.63 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. నల్గొండ జిల్లాలో ప్రచారం కొరవడటం, గడువు తక్కువగా ఉండటంతో అధిక సంఖ్యలో రైతులు అర్జీలు సమర్పించలేకపోయారు. త్వరలో వానాకాలం పంటలు మొదలుకానున్న నేపథ్యంలో అన్నదాతలు రాయితీ పరికరాల కోసం ఎదురు చూసున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి దరఖాస్తులకు అవకాశం కల్పించడటంతో పాటు గతేడాది మంజూరు చేసిన నిధులకు ఈ సంవత్సరం అదనంగా కేటాయిస్తే ఎక్కువ మంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

2024-25 సంవత్సరానికి సంబంధించి రాయితీ వ్యవసాయ పరికరాల కోసం నల్గొండ జిల్లాలో 820 యూనిట్లకు రూ.1.80 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటి మంజూరుకు అర్హులైన మహిళా రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలిచ్చింది. ఏఈవోల ద్వారా తీసుకున్నారు. అంతలోనే ఆర్థిక సంవత్సరం ముగియడంతో నిధులు వెనక్కివెళ్లాయి. గత ప్రభుత్వం హయాంలో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 50 శాతం రాయితీపై పరికరాలు అందేవి. నిధుల కొరత



వల్ల ఈ పథకం ఆగిపోయింది. యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని పునరుద్ధరించాలని ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించింది. రాయితీతో వ్యవసాయ సంబంధ యంత్రాలు, పరికరాలు అందించాలని భావించింది. కానీ నిధులు మంజూరు కాకపోవడంతో రైతులంతా వాటికోసం ఎదురు చూస్తున్నారు.

పవర్ స్ప్రేయర్లు, పవర్ టిల్లరు, డ్రోన్లు, రోటోవేటర్లు, పవర్ వీడర్స్, బ్రష్‌కట్టర్స్, ట్రాక్టర్లు, విత్తనాల, ఎరువుల వేసే యంత్రాలు, దమ్ము, బోదలు చేసే పరికరాలు, బ్యాటరీ స్ప్రేయర్ యంత్రాలను ప్రభుత్వం రాయితీపై అందించనుంది. యంత్ర పరికరాల కోసం మహిళా రైతుల నుంచి దరఖాస్తులు ఏఈవోల స్థాయిలో తీసుకున్నారు. ఆర్థిక సంవత్సరం ముగియడంతో దరఖాస్తులు వారి వద్దనే ఉన్నాయి. రైతులు మాత్రం యంత్రపరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. మంజూరు అయిన యంత్ర పరికరాలను డీలర్లు అప్పటికే తయారు చేసి పెట్టారు. జిల్లాలో సుమారు 1500 మంది మహిళా రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

**నిధులు రాగానే..** మార్చిలో రాయితీ యంత్ర పరికరాల కోసం మహిళ రైతుల నుంచి దరఖాస్తులు ఏఈవోల ద్వారా తీసుకున్నాం. వాటికి నిధులు రాగానే పంపిణీ చేస్తాం. పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

## ఆరా తీసి.. పేర్లు ఏరేసి

నల్గొండ : రాష్ట్రంలో రేషన్ దుకాణాల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో అనర్హులను గుర్తించి పేర్ల తొలగింపు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్డుదారులు పలువురు బియ్యం తీసుకోవడానికి ముందుకు రావడం లేదని గుర్తించింది. గత ఆరు నెలల నుంచి బియ్యం తీసుకోనివారి లెక్కలు తీసింది. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించగా చాలా మంది అనర్హులు, పెళ్లి అయి వెళ్లిన వారు, చనిపోయిన వారు, మరికొంత మంది స్థానికంగా లేకున్నా కార్డులు ఉండటాన్ని గుర్తించారు. వాటిని గుర్తించి ఏరివేత చేపట్టారు. జూన్‌లో మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించడంతో కోటా విషయంలో లెక్కలు తప్పరాదన్న ఉద్దేశంతో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా ఆరా తీసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా మండలాల్లో తహసీల్దార్లతో క్షేత్రస్థాయి విచారణ చేయిస్తోంది. లబ్ధిదారులు సదరు చిరునామాలో ఉంటున్నారా? లేదా మరణించారా? అని పరిశీలిస్తున్నారు. మరోవైపు వందేళ్ల వయసు పైబడి చనిపోయినవారు రేషన్ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. మరికొందరికి రెండేసి కార్డుల్లో పేర్లు ఉన్నట్లు సమాచారం. జిల్లాలో 991 రేషన్ దుకాణాల పరిధిలో 4,66,061 రేషన్ కార్డులున్నాయి. జూన్‌లో మూడు నెలలకు సంబంధించి ఆగస్టు వరకు చేపట్టనున్న బియ్యం పంపిణీలో తొలగించిన పేర్లను పరిగణనలోకి తీసుకొని కోటాను సరఫరా చేయనున్నారు.

**5,092 అనుమానాస్పద కార్డులు**

జిల్లాలో చేపట్టిన సర్వే ఆధారంగా 5,092 అనుమానాస్పద రేషన్ కార్డులు, 7,862 మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్డుల విచారణ పూర్తి అయితే జిల్లాలో రద్దు అయ్యే కార్డుల అనర్హుల జాబితా తేలనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అనేక పథకాలకు రేషన్‌కార్డే అర్హత కావడంతో భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. అదే సమయంలో ఇప్పటికే ఉన్న లబ్ధిదారుల్లో అనేక మంది అనర్హులున్నారు.

## రైతు వేదిక.. నిర్వహణ సులువిక

కొత్తగూడెం: నిర్వహణ భారంగా మారుతోన్న రైతు వేదికలకు మంచి రోజులు రానున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని రైతు వేదికలపై సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసి తద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఒక్కో దానిపై 5కిలోవాట్ల సౌర పలకలు అమర్చాలని నిర్ణయించింది. వీటి ద్వారా ఆయా రైతు వేదికల విద్యుత్తు అవసరాలు పోనూ ఒక్కోదాని నుంచి సుమారు రూ.25వేల వార్షికాదాయం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఉభయ జిల్లాల్లోని ఐదు వేదికలను పరిశీలించిన రెడ్కో అధికారులు వాటిపై సౌర పలకలు బిగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**మార్కెట్ యార్డులు, రైతు బజార్లలోనూ..** రైతు వేదికలతో పాటు మార్కెట్ యార్డులు, రైతు బజార్లలోనూ సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు నిర్ణయించాయి. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న పీఎం కుసుమ్ పథకం కింద సౌర ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని మార్కెట్ యార్డులు, రైతు బజార్లలోనూ సౌర విద్యుదుత్పత్తికి బాటలు పడనున్నాయి. అయితే వీటికి సంబంధించిన విధివిధానాలు జిల్లాస్థాయి రెడ్కో అధికారులకు అందాల్సి ఉంది. ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు అందితే సౌర ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని రెడ్కో అధికారులు చెబుతున్నారు.

**నిర్మించారు.. నిర్వహణ మరిచారు..** రైతులను సమావేశపరిచి శాస్త్రవేత్తల ద్వారా శిక్షణ, సలహాలు, సూచనలు అందించేందుకు.. ఎరువులు, విత్తనాల పంపిణీకి 5వేల ఎకరాలకు ఒక్కటి చొప్పున ఖమ్మం జిల్లాలో 129, భద్రాద్రి జిల్లాలో 67 రైతు వేదికలు నిర్మించారు. కొన్నేళ్లుగా నిర్వహణ నిధులు అందకపోవటంతో వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓలు) వాటిని గాలికొదిలేస్తున్నారు. సొంత ఆదాయం లేకపోవటం, ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో రైతు వేదికల లక్ష్యం నీరుగారిపోతోంది. సౌర పలకల ఏర్పాటుతో ఆదాయం సృష్టించాలనే ప్రభుత్వ తాజా నిర్ణయంతోనైనా వాటి నిర్వహణ సక్రమంగా సాగాలని అన్నదాతలు ఆకాంక్షిస్తున్నారు. **ఆదాయం ఇలా..** ఒక్కో రైతు వేదికపై 5కిలోవాట్ల సౌర పలకలు బిగిస్తే.. నెలకు 600 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని రెడ్కో అధికారులు చెబుతున్నారు.

# మూడు నెలలవి ముందుగానే..



తాండూరు: ఆహార భద్రత కార్డుల లబ్ధిదారులకు మూడు నెలల రేషన్ బియ్యం జూన్‌లోనే ఇవ్వనున్నారు. రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఆహార ధాన్యాల నిల్వ, రవాణాలో ఇబ్బందులు వస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మూడు నెలల రేషన్ కోటాను లబ్ధిదారులకు ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కోటాను జూన్ 1 నుంచి లబ్ధిదారులకు అందజేస్తారు. ఉగాది నుంచి పేదలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ నిర్ణయంతో మూడు నెలల బియ్యం ఒకేసారి అందనున్నాయి.

**16,500 మెట్రిక్ టన్నులు అవసరం..**

లబ్ధిదారులకు ప్రతినెలా 5,500 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. మూడు నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేయాలంటే 16,500 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతాయి. జిల్లాకు కావలసిన సన్నబియ్యం వనపర్తి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి సరఫరా అవుతాయి. మూడు నెలల కోటా సరఫరా చేసేందుకు కావాల్సిన బియ్యాన్ని జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరవేస్తున్నారు. అక్కడి నుంచి గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. జూన్ మొదటి నుంచే పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు ఇప్పటికే డీలర్లకు సమాచారం ఇచ్చారు. ఆహార భద్రత కార్డులోని ఒక్కో లబ్ధిదారునికి 6 కిలోల చొప్పున 18 కిలోలు, అంత్యోదయ కార్డు ఉన్న వారికి 35 కిలోల చొప్పున 105 కిలోలు, అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోల చొప్పున 30 కిలోల బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తారు.

**నిల్వపై డీలర్ల సందిగ్ధం..**

గ్రామాల్లోని రేషన్ దుకాణాలు అద్దె ఇళ్లలో నిర్వహిస్తుంటారు. చిన్నగా ఉండే వీటిలో ఒక నెల స్టాక్ నిల్వ చేసుకునేందుకు మాత్రమే స్థలం ఉంటుంది. ఇప్పుడు మూడు నెలలవి ఒకేసారి వస్తే ఎలా నిల్వ చేసుకోవాలని డీలర్లు సందిగ్ధంలో ఉన్నారు.

**ఆదేశాలు వచ్చాయి - మోహన్‌బాబు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి**

మూడు నెలల బియ్యం కోటాను లబ్ధిదారులకు ఒకేసారి పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. జూన్, జులై, ఆగస్టు నెలల కోటాను 1 నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పంపిణీకి చివరి తేదీ అంటూ ఏమీ లేదు. జూన్ మొత్తం అందిస్తాం.

జిల్లాలో ఇదీ లెక్క

చౌక ధరల దుకాణాలు: 588

ఆహార భద్రత కార్డులు: 2,15,229

అంత్యోదయ కార్డులు: 26,657

అన్నపూర్ణ కార్డులు: 36

లబ్ధిదారులు: 8,18,118

# పూడికతీత.. సజావుగా సాగేనా?



కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన వరద, అంతర్గత కాలువలను శుభ్రం చేసేందుకు సోమపూడికతీత.. సజావుగా సాగేనా?వారం నుంచి పనులు ప్రారంభించారు. ముందస్తుగా వర్షాకాలం ముంచుకొస్తుండటంతో ఆలోపు కాలువల్లోని మట్టి, వ్యర్థాలు, పూడికతీత పనులు చేసేలా అధికార యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. నగర వ్యాప్తంగా 11 పనులు చేపట్టడానికి రూ.49.03 లక్షలతో టెండర్లు పిలిచి ఆ పనులు అప్పగించారు. వారం రోజుల్లో పూడికతీత పనులు పూర్తి చేసేలా అధికారులు కార్యాచరణ తీసుకున్నారు. గతంలో మాదిరిగా పైపైనే శుభ్రం చేయకుండా ఈసారి క్యూబిక్ మీటర్ల లెక్కన పొడవు, వెడల్పు, లోతును పరిగణనలోకి తీసుకుంటున్నారు. మంకమ్మతోట రెండో పోలీసుస్టేషన్ పక్కన ఉన్న కాలువల్లోంచి నాలుగైదు ఫీట్ల లోతుల్లోంచి పూడిక తొలగించాలని నిర్ణయించారు.

**అధ్వానంగా అంతర్గత కాలువలు**

అంతర్గత వీధుల్లోని కాలువల్లో మట్టి పేరుకుపోయింది. ఎక్కడ పడితే అక్కడ కట్టలు కట్టి వదిలేశారు. శివారు ప్రాంతాల్లోని డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయింది. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేయకుండా వదిలేయడంతో అవి మూసుకుపోయేలా తయారయ్యాయి. ఈసారి పారిశుద్ధ్య పనుల నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. కొద్ది నెలల పాటు పర్యవేక్షణ లేకపోవడం సమస్యలకు కారణంగా మారింది.

**మూసుకుపోయిన పైపుల రంధ్రాలు**

కొత్తగా రహదారులు నిర్మించిన చోట ఓపెన్ డ్రైనేజీలు కనిపించడం లేదు. వాటిని పైపులైనుతో నిర్మించారు. ప్రతి వంద మీటర్లకు ఒక ఛాంబర్ ఇస్తుండగా దాని పక్కనే పైపులతో రంధ్రాలు వదిలేశారు. వర్షం నీరంతా ఇందుల్లోంచే వెళ్లాల్సి ఉండగా అవి మూసుకుపోయాయి. డివిజన్ల వారీగా వీటన్నింటిని పరిశీలించి చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేయిస్తే నీరంతా డ్రైనేజీల్లోకి వెళ్లే అవకాశముంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**పనులు ఇక్కడే..**

సాయిబాబా ఆలయం నుంచి బొమ్మ వెంకన్న చౌరస్తా వరకు

శ్రీదేవి ఆసుపత్రి నుంచి శ్రీకృష్ణమందిర్ నుంచి బొమ్మ వెంకన్న వయా వరహస్వామి టెంపుల్ కల్యాణి గార్డెన్

డివిజన్ నంబర్లు 6,7,8,9,10,30,31,32

గౌతమినగర్, సాయికృష్ణ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు

36వ డివిజన్ జయరాం ఆసుపత్రి నుంచి పవన్ ట్రేడర్స్ ఆర్అండ్‌బీ కల్వర్టు37వ డివిజన్ వాసర ఆసుపత్రి నుంచి మార్క్‌ఫెడ్ ఎదురుగా, చేపల మార్కెట్ రోడ్డు, సిద్ధార్థ స్కూల్ రోడ్డు, పారమిత స్కూల్ రోడ్డు వాణినికేతన్ స్కూల్ వెనుకాల నుంచి టు టౌన్ పోలీసుస్టేషన్, ఆర్అండ్‌బీ క్రాస్ కల్వర్టు

మల్కాపూర్ చౌరస్తా నుంచి సెంట్ అల్ఫోన్స్ జ్యోతినగర్ వరకు

ఇందిరానగర్ జంక్షన్ నుంచి మంచిర్యాల చౌరస్తా వరకు

22వ డివిజన్‌లోని ఇం.నం. 10-4-220/ఎ/2 మహాలక్ష్మి లేడీస్ టేలర్ నుంచి తేజ స్కూల్ రోడ్డు వరకు

40వ డివిజన్ గుండు హనుమాన్ టెంపుల్ నుంచి ఎస్టీ కాలనీ తేజ స్కూల్ వరకు.

# ఆర్భాటంగా ఆరంభం.. నిలిచిన నిర్మాణం



జగిత్యాల: జగిత్యాల వైద్య కళాశాల భవన నిర్మాణాలు నిధుల్లేక అర్ధంతరంగా నిలిచిపోతున్నాయి. కళాశాల ప్రారంభించి మూడేళ్లు పూర్తి కాగా 450 మంది విద్యార్థులున్నారు. ప్రారంభానికి ముందే రూ.14 కోట్లతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. కళాశాల కోసం 27.08 ఎకరాల భూమి కేటాయించగా అన్ని భవనాల నిర్మాణాల కోసం రూ.510 కోట్లు మంజూరిచ్చారు. వైద్య కళాశాల, వసతి గృహాల నిర్మాణం కోసం రూ.172.50 కోట్లతో అంచనాలు రూపొందించగా రూ.60.03 కోట్ల విలువైన పనులు జరగడంతో రూ.51 కోట్లు చెల్లించారు. మిగతా పనులకు సంబంధించి నిర్మాణ సంస్థకు రూ.44.18 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది.

**నిధుల జాడేదీ?** వైద్య కళాశాలలో ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ భవనంతోపాటు మూడు అంతస్థుల్లో కళాశాల భవనం, ఆరు అంతస్థుల్లో బాలుర, ఏడు అంతస్థుల్లో బాలికల వసతి గృహం నిర్మాణాల పనులు జరిగినా గోడలు నిర్మించి మిగతా పనులను నిలిపేశారు. మరో 4 అంతస్థుల్లో ఆసుపత్రి భవనం ప్రతిపాదించినా పనులు ప్రారంభించలేదు. 2022 డిసెంబర్ 7న నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పనులకు శంకుస్థాపన చేశారు. 18 నెలల్లో పూర్తి కావాల్సి ఉండగా నిధుల లేమితో జరగకపోగా గత డిసెంబర్ 31 వరకు పొడిగించారు. అయినప్పటికీ పనులు జరగకపోవటంతో మరోసారి గడువు పొడగించేందుకు ప్రతిపాదనలు పంపించారు.

ప్రస్తుతం బాలికల వసతి గృహం నర్సింగ్ కళాశాలలో ఉండగా బాలుర వసతి గృహం అద్దె భవనంలో ఉంది. ఈ సంవత్సరం మరో 150 మంది విద్యార్థులు రానుండగా వసతికి ఇబ్బందులు ఏర్పడనున్నాయి. వైద్య కళాశాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవలే కలెక్టరేట్‌లో సమీక్ష జరిపినప్పటికీ ఇప్పటికీ నిధులు జాడ లేకపోవడంతో పనులు ముందుకు సాగటం లేదు.

పనుల పూర్తికి చర్యలువైద్య కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తికి చర్యలు తీసుకుంటాం. ఇటీవలే మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్షించారు. అవసరమైన నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బిల్లులు చెల్లించి పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేసేలా నిర్మాణ సంస్థకు నోటీసులు జారీ చేయాలని రహదారి భవనాల శాఖ అధికారులను ఆదేశించాం.

బి.సత్యప్రసాద్, కలెక్టర్

# రేషన్‌కార్డుదారులకు మరో తీపికబురు

ఖమ్మం : రేషన్‌కార్డుదారులకు దొడ్డుబియ్యం బదులు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వం.. వర్షాకాలం దృష్ట్యా లబ్ధిదారులకు మరో తీపి కబురు అందించింది. జూన్, జులై, ఆగస్టు మాసాలకు సంబంధించి సన్నబియ్యం ఒకేసారి రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించింది. మూడు నెలల సన్నబియ్యం పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 1 నుంచి 30 వరకు రేషన్ దుకాణాల్లో బియ్యం అందజేస్తారు. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తున్నందున కార్డుదారులు డీలర్ వద్ద ఈపాస్ యంత్రంలో మూడుసార్లు బయోమెట్రిక్ లేక ఐరిష్ గుర్తింపు ఇవ్వాల్సి ఉంటుందని ఖమ్మం డీఎస్ఓ చందన్‌కుమార్ తెలిపారు. గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం రవాణా ప్రారంభించినట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత తెలిపారు. ఖమ్మంలో కొన్ని రేషన్ దుకాణాలను డీఎస్ఓ తనిఖీ చేశారు.

## ఏఐ.. చదువులిక హాయ్..!

నల్గొండ : వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పాఠాలను బోధించనున్నారు. ఈ మేరకు గణితంలో ఒక సబ్జెక్టులో పెట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. ఉపాధ్యాయ శిక్షణలో ఏఐపై శిక్షణ సైతం ఇస్తున్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో 3-5 తరగతులకు ప్రయోగాత్మకంగా అమలు చేశారు. జిల్లాలో 6-10 తరగతులకు ఒక యూనిట్ కింద కృత్రిమ మేధ పొందుపరచనున్నారు. గత సంవత్సరం ఏప్రిల్ నెలలో జిల్లాలోని 15 పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా తరగతులు నిర్వహించారు. ఉన్నత పాఠశాలకు అనుబంధంగా ఉన్న బడుల్లో చేపట్టిన ఈ ప్రాజెక్టు మంచి ఫలితాలు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

3,4,5 తరగతుల పిల్లలకు కంప్యూటర్‌లో ఏఐ ద్వారా అక్షరాలు గుర్తుపట్టి చదవడం నేర్పించారు. అక్షరాలు గుర్తుపట్టడం రాని వారు, అంకెలు గుర్తుపట్టి చదవడం రాని వారికి బోధన చేపట్టారు. ప్రయోగాత్మక ప్రాజెక్టులో ఐదు కంప్యూటర్‌లు, ఇంటర్నెట్ వినియోగం, హెడ్ ఫోన్‌లు, 50 ఎంబీపీఎస్ స్పీడ్ ఇంటర్నెట్ వాడారు. ఇంటర్‌నెట్



లో ఇచ్చిన లింకు ద్వారా పిల్లలకు ఏం వచ్చింది అనేది ఏఐ గుర్తిస్తుంది. కంప్యూటర్‌లో చెప్పిన విషయాలకు అనుగుణంగా విద్యార్థులు ప్రతిస్పందిస్తే తరువాత పేజీకి వెళ్తోంది. ఇలా కంప్యూటర్‌లో గణితానికి సంబంధించి లెక్కలు, గుణింతాలు చేసేందుకు పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. ఏఐలో పిల్లలు ఎక్కడైతే ఇబ్బంది పడుతున్నారో వాటికి సంబంధించినవే ఎక్కువ వస్తుంటాయి. విద్యార్థులను కంప్యూటర్ గైడ్ చేస్తుంటుంది. దానిని సాధన చేస్తే అసైన్‌మెంట్ ఇస్తుంది. ఒక దశలో ఇచ్చిన దానిని సాధన చేస్తే మరో దశకు వెళ్తోంది. ఇలా చేయడం వల్ల విద్యార్థి పనితీరు మెరుగుపడటంతో పాటు జ్ఞానం పెంపొందుతుందని అధికారులు చెబుతున్నారు. రానున్న విద్యాసంవత్సరంలో సాధ్యమైనంత వరకు అన్ని పాఠశాలల్లో దీనిని అమలు చేసే దిశగా ప్రయత్నం చేస్తున్నారు. ఏఐ ప్రస్తుతం అత్యవసరం అని చర్చనీయాంశం అవుతుండటంతో పాఠశాల విద్యలో దానిని భాగస్వామ్యం చేస్తున్నారు. దీనిపై అకడమిక్ మానిటరింగ్ క్వాలిటీ కంట్రోల్ కో-ఆర్డినేటర్ రామచంద్రయ్య వివరణ ఇస్తూ.. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌పై ప్రాథమిక పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన శిక్షణ మంచి ఫలితాలు ఇచ్చిందని, ఉన్నత పాఠశాలల్లోనూ కొత్త విద్యాసంవత్సరంలో గణితంలో ఏఐ తరగతులు ఉంటాయని తెలిపారు.

## ఆక్రమణల చెరవు

ఆత్మకూర్ : ఆయకట్టుకు ఆయువుపట్టుగా ఉండి భూగర్భజలాలు పెంపొందిస్తున్న చెరువులు, కుంటలు అక్రమార్కుల హస్తగతం అవుతున్నాయి. శిఖం భూములను పంటపొలాలుగా మారుస్తుండడంతో ఏటేటా కుచించుకుపోతున్నాయి. ఫలితంగా చెరువుల విస్తీర్ణం తగ్గి నీటినిల్వ సామర్థ్యం పడిపోతుంది. ఇలాగే కొనసాగితే రాబోయే పదేళ్లలో చెరువులు సగానికి, కుంటలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రం సర్వేనంబరు 802లోని పెద్దచెరువు 262 ఎకరాలకుపైగా విస్తీర్ణం కలిగి ఉంది. ఎన్నో జీవజాతులకు నిలయంగా మారిన ఈ జలాశయం నేడు 100 ఎకరాలకుపైగా ఆక్రమణకు గురైనట్లు తెలుస్తుంది. చెరువు పూర్తి సామర్థ్యం పరిధి (ఎఫ్‌టీఎల్) నుంచి చుట్టూ శిఖం భూమిలో కట్టలు పోసి పొలాలుగా మారుస్తున్నారు. ప్రధానంగా పెద్దగుట్ట దరిన ఉన్న చెరువు భూమిని పెద్దఎత్తున ఆక్రమించి పొలాలు చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.



నెమ్మికల్‌లోని చౌటచెరువు పూర్తి విస్తీర్ణం 84ఎకరాలుగా ఉంటుంది. 484 సర్వే నంబరులో విస్తరించిన ఈ చెరువును బఫర్‌జోన్ పరిధి నుంచి ఏటేటా లోపలికి చొచ్చుకొస్తూ ఆక్రమిస్తున్నారు. రెండేళ్ల కిందట మండల సర్వేయర్ స్థానికుల మత్స్యకారుల ఫిర్యాదు మేరకు చెరువును సర్వే చేయగా దాదాపుగా 25ఎకరాలు ఆక్రమించుకొని పొలాలు సేద్యం చేస్తున్నట్లు గుర్తించారు. ఆక్రమించిన వారిలో పాతసూర్యాపేట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి కుటుంబం ఉన్నట్లు నిర్ధారించారు. అయినా శిఖం భూములను స్వాధీనం చేసుకోలేదు.

ఇంకా మండలంలో పాతర్లపహాడ్, నశీంపేట, తుమ్మలపెన్‌పహాడ్, కందగట్ల చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి శిఖం భూములను ఆక్రమణ బారినుంచి కాపాడాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**శిఖం భూములను కాపాడతాం**

చెరువులు, కుంటలను ఆక్రమించినట్లు ఫిర్యాదు అందిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం. సర్వేయర్ సహకారంతో వాటి హద్దులు నిర్ణయించి శిఖం భూములను కాపాడుతాం. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిలో ఆక్రమిస్తే కేసులు నమోదు చేయిస్తాం. హరికిశోర్ శర్మ, తహసీల్దార్

# సమస్యలు అధిగమించి.. ఆగ్రస్థానంలో నిలిచి!

ధర్మపురి: ప్రభుత్వ బడుల్లో పీఎం పోషణ్ (మధ్యాహ్న భోజన) పథకం అమలులో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఓ వైపు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, మరోవైపు పెండింగ్ బిల్లులతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చిత్తశుద్ధితో జరిగేది కాదు. కానీ జిల్లాలో ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణతో పాటు, నిరంతర పర్యవేక్షణ, పెండింగ్ బిల్లుల చెల్లింపుతో ఈ సమస్యను అధిగమించారు. అధికారులు సమావేశాలు నిర్వహించటం, ప్రత్యేక యాప్‌లో విద్యార్థుల సంఖ్య నమోదు చేయించటం, వెంటవెంటనే బిల్లుల చెల్లింపులు చేపట్టారు. ఫలితంగా జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం అమలులో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. కలెక్టర్ సత్యప్రసాద్, డీఈవో రామునాయక్‌లు బిల్లుల చెల్లింపులలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మండల స్థాయి రెవెన్యూ, నోడల్ అధికారులతో పథకం అమలు తీరుపై నిఘా పెట్టారు. దీంతో జగిత్యాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో పీఎం పోషణ్ అమలు



సమర్థవంతంగా పూర్తవటంతో పాటు కేంద్ర ప్రభుత్వం అధికారుల బృందం సర్వేలో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. ధర్మపురి, మగ్గిడి ఆదర్శ పాఠశాలలను కేంద్ర బృందం పరిశీలించింది.

మధ్యాహ్న భోజనం మెనూ

సోమవారం : కిచిడీ, కూరగాయలు, గుడ్డు

మంగళవారం : అన్నం, కూరగాయలు, సాంబార్

బుధవారం : అన్నం, కూరగాయలు, ఆకుకూర పప్పు, గుడ్డు

గురువారం : వెజిటెబుల్ బిర్యాని, కూరగాయలు

శుక్రవారం : అన్నం, కూరగాయలు, సాంబార్, గుడ్డు

శనివారం : అన్నం, కూరగాయలు, ఆకుకూర పప్పు.

గతేడాది నుంచి సమస్యలు పరిష్కారం

గతంలో నెలల తరబడి మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉండేవి. గత ఏడాది నుంచి సమస్యలు పరిష్కారమయ్యాయి. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం పాఠశాలల్లో భోజనం పెడుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. కొన్నిచోట్ల వంటగదులు, సిలిండర్లు ప్రభుత్వం కేటాయించాలి. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింప జేయాలి. గంగాధర్, మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు

# బస్వాపురం.. స్వాహాపర్వం

నల్గొండ : కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన నరసింహ(బస్వాపురం) రిజర్వాయర్ నిర్మాణ సంస్థ అక్రమా లకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టి సారించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పది మండలాల్లో 1.88 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే బస్వాపురం రిజర్వాయర్ కాళేశ్వరం ప్రాజెక్టు-16వ ప్యాకేజీలో భాగంగా నిర్మిస్తున్నారు. 11.38 టీఎంసీల సామర్థ్యంతో మొత్తం రూ.1,610 కోట్ల అంచనా వ్యయంతో రూపుదిద్దుకున్న ఈ జలాశయం డ్యాం నిర్మాణం 85 శాతం పూర్తికాగా ఇంకా 15 శాతం పనులు మిగిలి ఉన్నాయి. చివరి దశలో ఉన్న పనులు పూర్తయితే ప్రాజెక్టుకు ఎగువ ఉన్న కొండపోచమ్మసాగర్ నుంచి 8 టీఎంసీల వరకు నీటిని నింపి కాల్వలకు నీరందించేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు.

60 కిలోమీటర్ల మేర పొడవున నిర్మిస్తున్న కాల్వల నిర్మాణంలో ఇప్పటికే 40 కిలోమీటర్ల మేర తవ్వి లైనింగ్ పనులు పూర్తి చేశారు. మరో 20 కిలోమీటర్ల మేర కాల్వలను తవ్వాల్సి ఉంది. ఈ రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో గుత్తేదారు సంస్థ అక్రమాలకు పాల్పడినట్లు పేర్కొంటూ 30 రకాల సమాచారాన్ని నీటిపారుదల శాఖ నుంచి సంబంధిత విభాగాధికారులు కోరారు. గుత్తేదారు సంస్థ నుంచి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్), నిర్వాసితులకు భూ పరిహారం, నీటిలభ్యత అనుమతి, ఆమోదించిన డిజైన్లు, ఒప్పందం వివరాలు, ఎంబీ రికార్డులు, నోట్ ఫైల్స్, నాణ్యత ధ్రువీకరణ(క్యూసీ)పత్రాలు, రిజర్వాయర్, కాల్వల డిజైన్లు,



గతంలో వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు వంటి వివరాల ను సైతం వివరంగా సమర్పించాలని నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులను ఎన్‌ఫోర్స్‌మెంట్ కోరింది.

జలాశయ నిర్మాణ సమయం నుంచి బిల్లుల మంజూరు వరకు కొన్ని అక్రమాలు జరిగినట్లు విజి'లెన్స్' ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో ఇవీ నిజమని తేలితే ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టనుంది. **పరిహారం పంపిణీలో...** 8,601 ఎకరాల భూ సేకరణ అవసరముండగా 4,758 ఎకరాలు ప్యాకేజీ-16 కింద సేకరించి ఆ భూముల్లో పనులు పూర్తి చేశారు. గతంలో ఈ జలాశయంలో 40 చెరువుల ద్వారా నీళ్లు నింపి దిగువ ప్రాంతాలకు 0.5 టీఎంసీల మేర విడుదల చేశారు. రిజర్వాయర్‌లో ఒకటిన్నర టీఎంసీల నీళ్లు నింపితే బీఎన్ తిమ్మాపురం గ్రామం మొత్తం ముంపుకు గురై మునిగిపోతుంది. ఇందుకోసం పరిహారం ఇచ్చేందుకు గత ప్రభుత్వం అంగీకరించింది. 14 కిలోమీటర్ల మేర పొడవైన కట్ట పనులు పూర్తయినప్పటికీ పునరావాస సమస్యలు, అనర్హులకు పరిహారం పంపిణీ చేయడం, ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

బీఎన్ తిమ్మాపూర్, తుర్కపల్లి మండలం లప్పునాయక్ తండా, చోక్లా తండా ముంపునకు గురవుతున్నాయి. రూ.500 కోట్లతో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించగా ఇందులోనూ పదుల సంఖ్యలో అనర్హులైన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించినట్లు గతంలో అధికారులకు ఫిర్యాదులు వచ్చినప్పటికి ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోకపో వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గరిష్ఠంగా రూ.1,200 కోట్ల వరకు ఖర్చులు చూపెడుతున్న అధికారులు వీటికి సంబంధించిన అన్ని 'లెక్కలు' విజి'లెన్స్'కు సమర్పించాల్సి ఉంటుంది. 'లెక్కలు' సరిగా లేకపోవడంతో సంబంధిత అధికారులు 'నీళ్లు' నములుతున్నారు.

# ఠాణాల్లో వసూళ్ల పర్వం.. మేమింతే..! మా రేటు అంతే!



హైదరాబాద్ : కేసు నుంచి తప్పించేందుకు రూ.2.22లక్షల లంచం డిమాండ్ చేసి, రూ.2లక్షలు నొక్కేసిన శామీర్‌పేట ఎస్సై పరశురామ్ మిగిలిన రూ.22వేలు తీసుకుంటూ ఏసీబీకి దొరికాడు. సీజ్ చేసిన డీజే బ్యాండ్, వాహనాన్ని తిరిగి ఇచ్చేందుకు రూ.15 వేలు డిమాండ్ చేసి అనిశా అధికారులకు చిక్కాడు జగద్గిరిగుట్ట ఎస్సై శంకర్. ః సౌత్‌వెస్ట్‌జోన్‌లోని ఒక ఠాణాలో కేసు నుంచి పేరు తొలగించేందుకు భారీ మొత్తం డిమాండ్ చేసిన ఇన్‌స్పెక్టర్ అనిశాకు చిక్కాడు. గ్రేటర్ పరిధిలోని మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలోని ఠాణాలపై అవినీతి నిరోధక శాఖ (అనిశా) వరుస దాడులు చర్చనీయాంశంగా మారాయి. కొందరి తీరు పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు తీసుకొస్తోంది. అక్రమాలను కట్టడి చేయాల్సిన ఉన్నతాధికారుల్లోనూ కొందరు రియల్ దందాలు చేస్తున్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఎన్ని వ్యవస్థలు ఉన్నా..**

ఫిర్యాదులు, కేసుల నమోదు, బాధితులతో పోలీసులు వ్యహరిస్తున్న తీరును తెలుసుకోవడానికి ప్రభుత్వం ప్రతి ఠాణాలో క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంచింది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. ఇదే సమయంలో అవినీతి ఆరోపణలు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంతో ఎంతోమంది సస్పెన్షన్‌కు గురవుతున్నారు. అయినా అవినీతికి అడ్డుకట్టపడటం లేదు.

**ఎన్నో విమర్శలు..**

నగరానికి చెందిన ఓ అదనపు డీసీపీ రౌడీషీటర్లను కౌన్సెలింగ్‌కు రప్పించకుండా కాపాడటం, తనకున్న పాత పరిచయాలతో సివిల్ వివాదాల్లో తలదూర్చి పెద్ద ఎత్తున వసూళ్లు చేస్తుంటాడనే విమర్శలు ఉన్నాయి. డీసీపీ వద్దకు ఎవరు వెళ్లాలన్నా ఈయన అనుమతి కావాలని ఆ జోన్‌లోని కానిస్టేబుళ్లు వాపోతున్నారు.

ఓ ఏసీపీ వ్యవహారశైలితో ఇన్‌స్పెక్టర్లు ఒత్తిడికి గురవుతున్నారు. ప్రతి నెలా నిర్దేశించిన సమయానికి సెక్టార్ ఎస్సైలు కప్పం కట్టాల్సిందేనని సతాయిస్తారు.

సౌత్‌వెస్ట్‌జోన్‌లో ఓ ఇన్‌స్పెక్టర్ మహిళా కానిస్టేబుల్ పట్ల ఇబ్బందికరంగా ప్రవరిస్తున్నాడనే ఆరోపణలతో మరో ఠాణాకు బదిలీ చేశారు. అక్కడా మరో మహిళా కానిస్టేబుల్‌ని ఇబ్బంది పెట్టడంతో ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఈయన ఫిర్యాదు తీవ్రతను బట్టి కమీషన్ నిర్ణయించాకే కేసు నమోదు చేస్తాడని, ఒక్కో సీఆర్‌పీసీ నోటీసుకు రూ.2-10వేల వరకు వసూలు చేస్తుంటాడని చెబుతున్నారు. ఇటీవల సైబరాబాద్ పరిధిలో నలుగురు ఎస్సైలు తమ వ్యక్తిగత ఖాతాల్లో లంచం డబ్బు జమ చేయించుకోవటంతో ఉన్నతాధికారులు మందలించారు.

**స్థిరాస్తి వ్యవహారాల్లో ఉన్నతాధికారులు**

నగర శివారు ప్రాంతానికి చెందిన ఓ డీసీపీ వివాదం ఉన్న భూములను తక్కువ ధరకు సొంతం చేసుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. మరో డీసీపీతో కలిసి రియల్ వెంచర్ చేపట్టినట్టు సమాచారం. పలుకుబడితో కీలక జోన్‌లో బాధ్యతలు చేపట్టిన అధికారి రాజకీయ నేతలతో కలిసి పబ్‌ల్లో సెటిల్‌మెంట్లు చేస్తున్నట్టు తెలిసింది. విదేశాల్లోనూ ఆస్తులు కూడబెట్టారనే చర్చ జరుగుతోంది. మూడు కమిషరేట్ల పరిధిలో ముగ్గురు డీసీపీలపై అంతర్గత విచారణ జరుగుతోంది.

# ఆపరేటర్ల ఆగడాలకు అడ్డుకట్ట



హైదరాబాద్: జలమండలి నీటి సరఫరాలో కీలకంగా వ్యవహరించే పంపు ఆపరేటర్ల ఆగడాలకు అడ్డుకట్ట పడనుంది. కొందరు నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తుండటంతో ఒకే ప్రాంతంలో ఎక్కువ నీటి సరఫరా జరుగుతోందని గుర్తించారు. దీనిపై ఫిర్యాదులు వస్తున్నా.. ఎలా ముందుకు వెళ్లాలనేదానిపై యంత్రాంగం తర్జనభర్జన పడి చివరికి అడుగు ముందుకేసింది. ఆపరేటింగ్ వాల్వ్‌ల్లో ఆపరేటర్ల విచక్షణకు అవకాశం ఉండటంతో నీటి సరఫరాలో తేడాలు ఉన్నట్లు గుర్తించింది.

**క్షేత్రస్థాయి పరిశీలనతో వెలుగులోకి**

ఈ ఏడాది వేసవిలో నీటి సరఫరాపై ప్రభావం పడకుండా కనెక్షన్ల వారీగా విశ్లేషించింది. సుమారు 500 కనెక్షన్లను పరిశీలించారు. ఒక నెలలో సరఫరా ఎలా జరిగిందని గమనించగా.. వాల్వ్ ఆపరేటర్ల నిర్వాకం ఆధారాలతో సహా వెలుగు చూసింది. నీటి సరఫరా వేళల్లో అక్రమాలకు పాల్పడటంతో కొందరికి నిర్దేశించిన పరిమాణం కంటే రెట్టింపు, మరికొన్ని నివాసాలకు తక్కువ నీరు సరఫరా అయినట్లు తేలింది.

**పక్కా విధానం దిశగా...**

వాల్వ్ ఆపరేటర్లు నిబంధనల ప్రకారం వ్యవహరించేలా పక్కా విధానం అమలు చేసే దిశగా జలమండలి దృష్టిసారిస్తోంది. నీటి సరఫరా వేళలు, పరిమాణం, ప్రెషర్‌ను పక్కాగా నమోదు చేయనున్నారు. వాల్వ్‌ల వారీగా రికార్డులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రస్తుతం జలమండలి పరిధిలో రోజుకు 550 ఎంజీడీల నీరు సరఫరా అవుతోంది. నగరంలో రెండు రోజులకోసారి నీటి సరఫరా జరుగుతుండగా శివారు ప్రాంతాల్లో రెండు, మూడు రోజులకోసారి ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో పక్కా లెక్కలు ఉండాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి జనరల్ మేనేజర్లు, ఇతర జలమండలి అధికారులకు స్పష్టం చేశారు.

**వాల్వ్‌ల మ్యాపింగ్**

నీటిని సరఫరా చేసే వాల్వ్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయనేది ఆపరేటర్లు చెప్పాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆపరేటింగ్ వాల్వ్‌లు, కంట్రోల్ వాల్వ్‌లను మ్యాపింగ్ చేసి నీరు ఎక్కడెక్కడికి సరఫరా అవుతుందో నమోదు చేయనున్నారు. కొందరు ఒక ప్రాంతంలో ఉంటూ మరోచోట విధులు నిర్వహిస్తున్నారు. ఇంకొందరు పది కిలోమీటర్లు అంతకంటే ఎక్కువ దూరంలో ఉండటంతో దాని ప్రభావం సరఫరాపై పడుతోందా? అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. జూన్ మొదటి వారం నుంచి వాల్వ్‌లు, పంపు ఆపరేటర్ల విధానంలో సంస్కరణలు తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

# నిక్షేపం.. అక్రమార్కుల పరం!

తాండూరు : సర్కారు భూముల్లోని నిక్షేపాలు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. ప్రభుత్వ భూముల్లోని సహజ సంపదను యథేచ్ఛగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల అడపాదడపా చర్యలతో తాత్కాలికంగా నిలువరిస్తున్నారు. అనంతరం అటువైపు వెళ్లకపోవడంతో పరిస్థితి యథాతథంగా మారుతోంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

జిల్లాలోని ఇరవై మండలాల్లో 5,993 ఎకరాల్లో ఖనిజ సంపద నేలలు విస్తరించి ఉన్నాయి. ప్రధానంగా నాపరాయి, సుద్ద, ఇసుక, ఎర్రమట్టి, సన్నకంకర, పలుగురాళ్లు, నల్లరాయి, తెల్లరాయి వంటి నిక్షేపాలున్నాయి. ప్రభుత్వ, పట్టా భూముల్లోని ఖనిజాలను తవ్వకాలతో వెలికి తీసేందుకు గనులు, రెవెన్యూ, పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి, నీటి పారుదల, అటవీ, వ్యవసాయ శాఖల ద్వారా అనుమతి పొందాల్సి ఉంది. వీటి ద్వారా నిరభ్యంతర పత్రాలను పొంది గనుల శాఖ నిర్దేశించిన రుసుం, సుంకాన్ని ప్రభుత్వానికి జమ చేయాలి. అయితే క్షేత్రస్థాయిలో కొంతమంది అనుమతి పొందకుండా నేరుగా ప్రభుత్వ భూముల్లో, పట్టా భూములను ఆనుకుని ఉన్న సర్కారు భూముల్లో నాపరాయి నిక్షేపాల తవ్వకాలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా తాండూరు మండలం ఓగీపూర్, కరణ్‌కోట, మల్కాపూర్‌లో ఈ పరిస్థితి నెలకొంది. ఇక్కడ నాపరాయి నిక్షేపాలతో ఎకరం రూ.80 లక్షలు పలుకుతోంది. ఇదే అదునుగా అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లో పాగా వేసి దర్జాగా ఖనిజ సంపదను తవ్వుకుపోతున్నారు. ఏడాదిలో ఎకరంలో తవ్వకాలు, విక్రయంతో రూ.కోటి ఆర్జిస్తున్నారు.

**విద్యుత్ సరఫరా నిలిపివేసి..:** ఫిర్యాదులు వస్తే గనులు భూగర్భ శాఖ ఏడీ సత్యనారాయణ, ఆర్ఐ నిర్మల ఆధ్వర్యంలో సిబ్బంది, ట్రాన్స్‌కో లైన్‌మెన్‌లు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తున్నారు. అక్రమమని నిర్ధరించాక విద్యుత్తు కనెక్షన్ తొలగించడంతో సరిపెడుతున్నారు.



వాస్తవానికి నిబంధనల ప్రకారం తవ్వకాలు జరిపిన ప్రదేశంలో కొలతలు వేసి తరలించిన నిక్షేపాల లెక్కతేల్చి దానికి పదింతల అపరాధ రుసుం విధించాల్సి ఉన్నా, వసూలు చేయడం లేదు. నెలకిందట కరణ్‌కోట సర్వే సంఖ్య 2లో కొందరు అక్రమంగా గనుల తవ్వకాలు జరపగా విద్యుత్తు కనెక్షన్ తొలగించి వదిలేశారు. శుక్రవారం ఓగీపూర్‌లో నాలుగు గనులు అక్రమంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించిన ఏడీ బృందం కనెక్షన్ తొలగించి వెనుదిరిగారు. కొన్నాళ్లు గడిచాక ట్రాన్స్‌కో సిబ్బందికి నచ్చజెప్పి తిరిగి కనెక్షన్ పొంది అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. కఠిన చర్యలు తీసుకుంటేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**రాజకీయ ముసుగులో..**

చాలావరకు రాజకీయ పార్టీల్లో కొనసాగుతున్న వారే అక్రమ తవ్వకాలకు తెరలేపుతున్నారు. రూ.లక్షల్లో ఆదాయం ఆర్జిస్తూ రాజకీయ నాయకులుగా చెలామణి అవుతున్నారు. నియోజకవర్గ స్థాయి నేతల అండదండలతో అక్రమంగా గనుల నిర్వహణ చేపడుతున్నారు. స్థానికులు ఫిర్యాదు చేస్తే అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

# ఆమెకు అక్షర వెలుగు

సూర్యాపేట : అతివల్లో అక్షరాస్యత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఏటా నిరక్షరాస్యుల గుర్తింపునకు సన్నద్ధమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో చదవడం, రాయడం రాని వారిని గుర్తించి వారికి పాఠాలు చెప్పించడమే ప్రధాన లక్ష్యం. కాగా ఈసారి ప్రధానంగా మహిళా సంఘాల సభ్యులపై దృష్టి సారించింది. 18 ఏళ్లు నిండిన వారిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా నిర్దేశించారు. ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పేరిట ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మహిళా స్వయం సహాయక సంఘాల్లో(ఎస్ హెచ్‌జీ) నిరక్షరాస్యులను గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. జిల్లా విద్యాశాఖ, డీఆర్డీవో అధికారులు ఈ ఉల్లాస్‌ను సంయుక్తంగా చేపడుతున్నారు.

**27,158 మంది నిరక్షరాస్యుల గుర్తింపు**

జిల్లాలోని స్వయం సహాయ సంఘాల్లో 27,158 మంది నిరక్షరాస్యు



లను గుర్తించారు. వారి వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. సర్వే వివరాలను, వారు చదివిన తరగతుల వారీగా పొందుపర్చారు. పదో తరగతి లోపు మానేసిన వారిని సార్వత్రిక పది, పదో తరగతితో ఆపేస్తే సార్వత్రిక ఇంటర్ చేసేలా ప్రోత్సహిస్తారు. ఇంటర్ ఉత్తీర్ణత ఉంటే డిగ్రీ చేయించాలని నిర్ణయించారు. పూర్తిగా నిరక్షరాస్యులు ఉంటే సంఘంలోనే చదువు వచ్చిన వారిని వాలంటీరుగా నియమించి అక్షరాలు నేర్పిస్తారు. ఒకవేళ సంఘాల్లో ఎవరూ చదువుకోకుంటే పిల్లలతో ఈ ప్రక్రియను కొనసాగించాలని నిర్ణయించారు. తద్వారా మహిళా సంఘాల సభ్యులు పూర్తిగా అక్షరాస్యత పెరిగి భవిష్యత్తులో ఉపాధి పొందొచ్చు

**'ఉల్లాస్'లో తీర్చిదిద్దేందుకు కృషి**

జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమాన్ని డీఆర్డీవో, విద్యాశాఖల సమన్వయంతో పకడ్బందీగా చేపట్టాం. నిరక్షరాస్యుల సంఖ్యను తగ్గించేందుకు కేంద్రం ఈసారి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోంది. తొలుత మహిళా సంఘాల సభ్యుల నుంచే మొదలుపెట్టింది. కాగా ఇప్పటికే నిరక్షరాస్యులను గుర్తించి ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌లో పొందుపరిచాం. త్వరలో వారు ఓపెన్ స్కూల్, కళాశాలలో చేర్పించేలా చర్యలు తీసుకుంటాం. అప్పారావు, డీఆర్డీవో, సూర్యాపేట

# వేగంగా కొనుగోళ్లు

గరిడేపల్లి : యాసంగి ధాన్యం కొనుగోళ్లకు మరో వారం పట్టవచ్చని అధికారుల అంచనా. ఇప్పటికే 95 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ధాన్యం ఈ వారం రోజుల్లో పూర్తి చేయాలని సంకల్పించారు. వర్షాల వల్ల తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేస్తుండటంతో పాటు రవాణాలో కొంత జాప్యం ఏర్పడటంతో ఈనెల 25లోగా పూర్తికాలేదు. గతేడాది కంటే ఈసారి ఎక్కువ కొనుగోలు చేసిన అధికారులు అందుకు అనుగుణంగా ముందుగానే కొనుగోళు పూర్తి చేస్తున్నారు. ఇప్పటి వరకు 3,04,721 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. వీటిలో 49,735 మెట్రిక్ టన్నులు సన్న ధాన్యమే. 336 కేంద్రాలకుగానూ 221 కేంద్రాలలో కొనుగోళ్లు పూర్తయ్యాయి. 115 కేంద్రాలలో సుమారు 15 వేల మెట్రిక్ టన్నులు మిగిలి ఉన్నాయి. ఇందులో సైతం 10 వేల మెట్రిక్ టన్నులు కాంటాలు వేసి రవాణా జరుగుతుంది. మరో 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



**యాసంగిలో అదనంగా..**

ఈ ఏడాది యాసంగిలో అదనంగా కొనుగోళ్లు జరిగాయి. గత యాసంగిలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఈసారి తక్కువ సమయంలో 3.04 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు గత ఏడాది కంటే 64 వేల మెట్రిక్ టన్నులు అదనంగా కొనుగోలు చేసినట్లు పేర్కొంటున్నారు.

**సమస్యలివీ..** ధాన్యం కాంటా వేసినందుకు హమాలీ ఖర్చు ముందుగా రైతులు భరిస్తున్నారు. నిధులు వచ్చిన తర్వాత రైతులకు వీటిని తిరిగి చెల్లిస్తారు. ముందుగా రైతులపై భారం పడుతుంది. దాంతో పాటు రవాణా సమయంలో వాహనం(లారీ, ట్రాక్టర్)కు ఏదైనా అయితే పూర్తి బాధ్యత నిర్వాహకులదే. అయినా చాలా చోట్ల లారీ నుంచి మరో లారీ లేదా ట్రాక్టర్లలోకి మార్చినందుకు హమాలీ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యం తూకంలో అదనంగా తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. రోజుల తరబడి ఎండ, వానలో ఉండి అమ్ముకుంటే ఈ ఖర్చులన్నీ భరించడం భారమేనని పేర్కొంటున్నారు.

**తరుగు తీయరు**

ధాన్యం మిల్లుకు చేరిన తర్వాత తరుగు తీయరు. తడిసిన ధాన్యం వెళ్తే కాంటా వేసిన సమయంలో కంటే అదనంగా (తడిసిన బరువు) బరువు ఉంటే అంతమేరకే తీసేస్తారు. రైతుకు నష్టం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కలెక్టర్ నిత్యం పర్యవేక్షిస్తూ ఈసారి వేగంగా కొనుగోళ్లు పూర్తి చేయిస్తున్నారు. లారీలలో బస్తాల మార్పిడి బాధ్యత నిర్వాహకులదే. ప్రసాద్, డీఎం, సివిల్ సప్లయ్

చురకలు



# పెద్దాసుపత్రికి నూతన హంగులు

జగిత్యాల : ఎన్నో ఏళ్లుగా ఆధునికీకరణకు నోచుకోకపోయిన జనరల్ ఆసుపత్రి ఎట్టకేలకు నూతన హంగులు సంతరించుకుంది. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని రూ.29 లక్షలతో ఆధునికీకరించారు. మూడు నెలలుగా ఆసుపత్రిలో చేపట్టిన పనులు ముగింపు దశకు చేరాయి. జిల్లా ఆవిర్భావం తరువాత ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కేంద్ర ఆసుపత్రిగా.. ఆ తరువాత ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో అనుబంధంగా సాధారణ ఆసుపత్రిగా హెూదాలు మారినా సదుపాయాలు విస్తరించలేకపోయారు. కలెక్టర్ సత్యప్రసాద్ ఆసుపత్రి వైద్యులతో సమీక్ష నిర్వహించి రూ. 1.50 లక్షలు మంజూరు చేశారు. ఆసుపత్రి నిధులు రూ.29 లక్షలు వెచ్చించి ఆధునికీకరణ పనులు చేపట్టారు.

**అత్యాధునిక సేవలు..**

ఆసుపత్రిలో కొన్నేళ్లుగా ఆక్సిజన్ ప్లాంటు నిర్వహణ లేక పనిచేయడం లేదు. సాంకేతిక నిపుణులతో మరమ్మతు చేపట్టడంతో పూర్తిస్థాయిలో రోగులకు ఆక్సిజన్ కొరత తీర్చడమే కాకుండా ప్రతినెలా కొనుగోలు వ్యయం రూ.లక్ష ఆదా అవుతోంది. ఆసుపత్రిలో 9 వెంటిలేటర్లున్నప్పటికీ తరచూ సాంకేతిక సమస్యలుండేవి వాటిని సైతం పూర్తిస్థాయిలో బాగు చేయించారు. రెండు జనరేటర్లలో ఒకటి మరమ్మతుకు గురికాగా ఆధునిక సాంకేతిక వినియోగించి రెండింటిని సరిచేసి రోగులకు నిరంతర విద్యుత్తు అందజేస్తున్నారు. కొత్తగా 7 వీల్‌చైర్లు, 5 స్ట్రెచర్లు కొనుగోలు చేశారు. ఆసుపత్రి భవనంలోపల వెలుపల రంగులు వేశారు. వరండాల్లో స్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారగా మరమ్మతు చేశారు. గదులు, వార్డుల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపీ)తో తీర్చిదిద్దారు.



ఆసుపత్రిలో ప్రధాన సమస్య పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోగా ప్రత్యేక మురుగుకాల్వలు నిర్మించారు. మూత్రశాలల పైపులైనుకు మరమ్మతు చేశారు. రోగులకు తాగునీరందించే శుద్ధజల యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చారు.

**90 శాతం పూర్తి: డాక్టర్ సుమన్‌రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్**

మూడు నెలలుగా ఆసుపత్రిలో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. 90 శాతం మేరకు పూర్తయ్యాయి. కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపడంతో పాటు ఆసుపత్రి నిధులు వెచ్చించి మరమ్మతు పనులు చేపట్టాం. అన్ని విభాగాల్లోనూ వైద్యులున్నారు. వైద్య కళాశాలలో 50 పడకల ఆసుపత్రి పూర్తయితే సేవలు అక్కడికి తరలించే అవకాశం ఉంది.

**సేవలు వినియోగించుకోవాలి: డాక్టర్ విజయ్, ఆసుపత్రి ఆర్ఎంవో**

ఆధునికీకరణ తరువాత రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వచ్చాయి. సాధారణ వైద్యం, శస్త్రచికిత్సలు, ఫిజియోథెరపీ అన్నింట్లోనూ సేవలందిస్తున్నాం. క్యాజువాలిటీలో ఇన్‌ఫెక్షన్లు రాకుండా అధునాతన యంత్రం ఏర్పాటు చేశాం. వేసవి తీవ్రత దృష్ట్యా ఇబ్బందులు లేకుండా ఫ్యాన్లు, కూలర్లు సైతం అందుబాటులో ఉంచాం.

# లీకేజీల 'పురం' పర

సూర్యాపేట : పురపాలికల్లో ఇంటింటికీ శుద్ధజలం అందిస్తామని మిషన్ భగీరథ పైపులైన్లు వేసి నల్లా కనెక్షన్లు ఇచ్చారు. వచ్చేదే తక్కువ.. దానికి తోడు లీకేజీలతో నీరంతా వృథా అవుతోంది. వెరసి పట్టణవాసులు నీటిపాట్లు పడుతున్నారు. ఇక శివారు కాలనీల బాధలు చెప్పలేకుండా ఉన్నాయిజిల్లాలోని పురపాలికల్లో పరిశీలించింది..

**డిమాండ్ మేరకు సరఫరా లేక**

హుజూర్‌నగర్ పురపాలిక పరిధిలో పలు కాలనీలకు 20 రోజులకోసారి నీరు రాని పరిస్థితి. పట్టణానికి 50 ఎంఎల్‌డీలు అవసరం కాగా 30 ఎంఎల్‌డీ మాత్రమే గ్రిడ్ నుంచి సరఫరా జరుగుతోంది. లీకేజీలతో అన్ని ప్రాంతాలకు సరిపోవటం లేదు. హుజూర్‌నగర్ పురపాలికలో 7,350 నల్లా కనెక్షన్లున్నాయి. ఇతర వనరులతో మరో 2,627 కనెక్షన్లకు నీరు అందజేస్తున్నారు. సీతారాంనగర్, అంబేడ్కర్ కాలనీ ఇంకా పలు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారానైనా నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

**అల్లాడుతున్న శివారు కాలనీలు**

సూర్యాపేట పట్టణంలోని బాషానాయక్‌తండాలో ఐదేళ్ల కిందట పైపులైన్ నిర్మించినా నేటికీ నీటి సరఫరా జరగటం లేదు. స్థానికంగా బోరునీటిని వినియోగించుకుంటున్నారు. తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. మానసనగర్, అంజనాపురి కాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్ తదితర శివారు కాలనీకు నీటి సరఫరా సరిగా జరగటం లేదు. మిషన్ భగీరథ అధికారులు నిత్యం 19 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నారు. బాషానాయక్‌తండాలో కనెక్షన్ అనుసంధానం చేయించి సరఫరా చేయిస్తామని పుర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

**పైపులైన్లు దెబ్బతిని..**

నేరేడుచర్ల పురపాలికలో విలీన గ్రామాలైన రామగిరి, నర్సయ్యగూడెంలకు నీటి సరఫరా జరగడం లేదు. రామగిరి వద్ద పైప్‌లైన్‌లు దెబ్బతిన్నాయి. వాటిని పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తేనే నీటి సరఫరా జరిగే అవకాశం లేదు. పైప్‌లైన్ పగిలిపోవడంతో నర్సయ్యగూడెంకి చాలాకాలం మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో బోరు నీటితో ట్యాంకు నింపి నీరు సరఫరా చేస్తున్నారు. నర్సయ్యగూడెం పైప్‌లైన్ మరమ్మతులు చేస్తామని భగీరథ ఏఈ శ్రీనాథ్, పురకమిషనర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

**కోదాడలో రోజు విడిచి రోజు**

పట్టణంలో రోజు విడిచి రోజు నీటిని ఇంటింటికి ఇస్తున్నారు. పట్టణానికి మొత్తం 12.55 ఎంఎల్‌డీ నీరు డిమాండ్ ఉన్నప్పటికీ కేవలం 6.5 ఎంఎల్‌డీ మాత్రమే వస్తోంది. నీరు సరిపోక బోరు నీటిని కూడా అధికారులు ఇంటింటికి ఇస్తున్నారు. అవి భగీరథ, బోరు, బావుల నీరా అర్థం కావట్లేదని జనం వాపోతున్నారు.

**నీటి లీకేజీలతో తిప్పలు**

తిరుమలగిరి పురపాలికకు మిషన్‌భగీరథ రావాల్సిన నీటి కంటే తక్కువగా వస్తున్నాయి. లీకేజీలు, పైపులైన్ పగుళ్లతో సుందరయ్యకాలనీ, అనంతారంలోని జంగాలకాలనీ, బీసీకాలనీలకు తరచూ నీటి సమస్యలు తలెత్తున్నాయి. వలిగొండ–తొర్రూరు రోడ్డువెడల్పు పనులతో పైపులైన్లు పగిలి బీసీకాలనీకి నీరు రావడం లేదు. దీంతో ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. మార్కెట్ యార్డు ఎదుట, మల్లీశ్వరి థియేటర్, తహసీల్దార్ కార్యాలయం వెళ్లేదారుల్లో లీకేజీలతో నీరు వృథాగా పోతుంది. మిషన్ భగీరథ సిబ్బందితో త్వరలో లీకేజీలు సరిచేస్తామని పురకమిషనర్ బి.యాదగిరి చెప్పారు.

# చెత్తే కదా అని పారబోస్తే..



కరీంనగర్ : కరీంనగర్ నగరానికి చెత్త సవాల్‌గా మారింది. ట్రాక్టర్ల కొద్ది వస్తున్న చెత్తను నిల్వ చేసేందుకు చోటు దొరకడం లేదు. ఏకైక డంపింగ్ యార్డు పూర్తిగా నిండింది. చెత్త మీద చెత్త పేర్చుకుంటూ పోవడం తప్ప ప్రత్యామ్నాయం లేకుండా పోతోంది. స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా 34 నెలల కిందట రూ. 16.50 కోట్లతో ప్రారంభించిన బయోమైనింగ్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ప్రస్తుతం ఆ పనులు కూడా నిలిపివేశారు. ఒకవైపు శుద్ధీకరణ లేకపోగా, మరోవైపు డంపింగ్ యార్డు కోసం స్థలాలు చూసినా స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంకేముంది చెత్త పెరగడం తప్ప, తగ్గకపోవడంతో అధికారులకు సవాల్‌గా మారింది.

**మండుతున్న డంపింగ్ యార్డు**

చెత్త నిల్వలు డంపింగ్ యార్డులో భారీగా పేరుకుపోగా ఆ చెత్త మండుతోంది. నాలుగైదు రోజులుగా పొగ విపరీతంగా వస్తుండటంతో రాకపోకలు సాగించే ప్రజలు, సమీప దుకాణ యజమానులు, కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గాలి ఏ వైపు వీస్తే ఆ వైపు దుర్వాసన, పొగ వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూడా మంటలు చెలరేగడంతో ఫైరింజన్ రప్పించి మంటలు ఆర్పించారు. జెట్టింగ్ మిషన్‌తో నీటిని పట్టిస్తున్నారు.

**ఏ ట్రాక్టర్‌లోనైనా చెట్ల కొమ్మలే**

విద్యుత్తు శాఖ అధికారులు చెట్ల కొమ్మలను కొట్టి రోడ్ల మీద పడేస్తున్నారు. వీటిని పారిశుద్ధ్య కార్మికులు తీసుకొచ్చి డంపింగ్ యార్డులో పడేస్తున్నారు. ఏ ట్రాక్టర్‌లో చూసినా ఈ చెట్ల కొమ్మలే ఉన్నాయి. ఆకులు ఎండిపోయి చెత్త కాలుతోంది.

**నిలుస్తున్న వాహనాలు**

రోజూ డివిజన్ల వారీగా వస్తున్న ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలు డంపింగ్‌యార్డు దగ్గర గంటల తరబడి క్యూలో ఉంటున్నాయి. ఒక్కో ట్రాక్టర్ చెత్త గుట్టను ఎక్కి తిరిగి వచ్చే సరికి అధిక సమయం పడుతోంది. రెండు ట్రిప్పులు చేయాల్సిన ట్రాక్టర్ ఒక ట్రిప్పు చేసే సరికే మధ్యాహ్నం దాటుతోంది. స్వచ్ఛ ఆటోల పరిస్థితి అలాగే ఉండటంతో రెండు రోజులుగా చెత్తను షెడ్డులో పోయిస్తున్నారు. వారం రోజులుగా చెత్తను పక్కకు జరిపే జేసీబీ యంత్రం పాడైంది. దాంతో కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. దీని ప్రభావం డివిజన్‌లలో చెత్త సేకరణపై పడుతోంది.

**ఆలోచనలు.. ప్రతిపాదనలు**

డంపింగ్ యార్డులో చెత్తను తగ్గించేందుకు, సమస్యను నివారించేందుకు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రత్యామ్నాయం వైపు ఆలోచన చేస్తూ ముందుకెళ్తున్నారు. మంటలు రాకుండా, పొగ వ్యాపించకుండా ఉండేందుకు నాలుగు వైపులా నాలుగు బోర్లు వేసి ఎప్పటికి నీటి తడి ఉంచేందుకు ప్రతిపాదనలు చేశారు. సిమెంట్ కంపెనీతో మాట్లాడి కొంతమేర చెత్తను ఇక్కడి నుంచి తరలించేలా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అగ్నిమాపక శాఖ అధికారులు నిరంతరంగా నీటిని పట్టేందుకు చొరవ చూపాలని ఆదేశాలు ఇచ్చారు.

# లారీకి ఇంత.. తరుగు పేరిట కోత



గంగాధర: ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల రైతులను మిల్లర్లు దోచుకుంటున్నారు. రోజుల తరబడి ధాన్యం అమ్ముకునేందుకు నిరీక్షించిన అన్నదాతలను కొనుగోలు చేసే సమయంలో ఎక్కువ తూకం వేసి తర్వాత, మిల్లుల్లో దింపే సమయంలోనే తరుగు పేరిట కోత విధిస్తున్నారు. వాస్తవానికి సంచి బరువు 600 గ్రాములు ఉండగా, సంచి బరువుపోగా 40.600 కిలోల తూకం వేయాలి. కానీ.. ధాన్యం శుభ్రం చేయడంలేదని జిల్లా అంతటా బస్తాకు 42.200 చొప్పున తూకం వేస్తున్నారు. ఇందుకు రైతులు కూడా చేసేదేమిలేక మిన్నకుంటున్నారు.

గంగాధరలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం ఈనెల 23న లారీలో 814 బస్తాలు లోడింగు చేసి మిల్లుకు పంపించారు. మిల్లులో ధాన్యం దింపాక తరుగు పేరుతో ట్రక్‌షీట్‌లో కొట్టివేసి 13 బస్తాలు తగ్గించి రాశారు. అంటే 5.20 క్వింటాళ్ల ధాన్యం కోత విధించారు. ఈ లెక్కన రైతులకు రూ.12,064 నష్టం జరిగింది. తరుగు పేరుతో దోపిడీకి పాల్పడ్డారని గంగాధరకు చెందిన రైతు చిరుత కిషన్ ఆందోళన వ్యక్తం చేశారు.

మిల్లుకు పంపించాక అదనంగా తరుగు, ఇతర కారణాలతో లారీకి ఇన్ని బస్తాల చొప్పున అంటూ కోత విధిస్తున్నారు. క్వింటాలుకు తక్కువలో తక్కువ 4 నుంచి 6 కిలోలు అదనంగా దోచుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16.10 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు అధికారులు నిర్ణయించగా, ఎంత పెద్ద మొత్తంలో దోపిడీ జరుగుతుందో ఊహించుకోవచ్చు. కొన్ని చోట్ల కామన్ కింద ధాన్యం దింపుకొని క్వింటాలుకు రూ.20 తక్కువ చెల్లిస్తున్నారు. విచిత్రమేమిటంటే మిల్లుల్లో కోత పెట్టిన ధాన్యం బస్తాలకు కొనుగోలు కేంద్రాల్లో హమాలీలకు రైతుల నుంచి ఖర్చులు మాత్రం వసూలు చేయడం కొసమెరుపు.

నమోదులో జాప్యం.. పైకానికి పాట్లు

ధాన్యం అమ్ముకోవడంలో అపసోపాలు పడ్డ రైతులు పైకానికి రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. మిల్లులో దింపాక రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఆయా కేంద్రాల నిర్వాహకులు జాప్యం చేస్తున్నారు. ఫలితంగా అన్ని ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినా రైతులు రోజుల తరబడి ధాన్యం డబ్బులు జమకాక ఇబ్బందులకు గురవుతున్నారు. విక్రయించిన 48 గంటల్లోనే డబ్బులు జమ చేస్తామని పాలకులు, ఉన్నతాధికారులు చెబుతున్నా.. అందుకు విరుద్ధంగా జరుగుతోంది.

కరీంనగర్ జిల్లాలో 339 కేంద్రాల ద్వారా 3.60 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లిలో 329 కేంద్రాల ద్వారా 4.50 మె.ట, సిరిసిల్లలో 246 కేంద్రాల ద్వారా 3.00 మె. ట, జగిత్యాలలో 424 కేంద్రాల ద్వారా 5.00 మె.ట. ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 30 శాతం ధాన్యం సేకరించగా, వచ్చే నెల 15 వరకు కొనుగోళ్లు సాగనున్నట్లు తెలుస్తోంది. ధాన్యంలో కోతలు విధించకుండా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చూడాలని రైతులు కోరుతున్నారు.

# ఇంతి కోసం.. కొంత సమయం

చిట్యాల : వేసవి సెలవులను తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి సద్వినియోగం చేసుకుంటున్నారు ఉమ్మడి జిల్లా యువతులు, మహిళలు. నిత్యజీవితంతో కంప్యూటర్ వినియోగం సాధారణం కావడంతో ఆ పరిజ్ఞానాన్ని పెంచుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని యోచిస్తున్నారు. యువతులు కంప్యూటర్ శిక్షణ కేంద్రాలకు హాజరవుతుండగా, పిల్లలు, భర్త, ఇంట్లో పెద్దవాళ్లకోసం తమ సమయం అంతా బిజీబిజీగా గడిపిన యువ గృహిణులు వేసవి సెలవులు రావడంతో వారు కంప్యూటర్ విద్యను అభ్యసించడానికి శిక్షణ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

**ఉన్నత విద్యకు ప్రత్యామ్నాయంగా**

గట్టు ఉమ, బీఎస్సీ (వ్యవసాయం) పల్లివాడ, రామన్నపేట మండలం

బీఎస్సీ (వ్యవసాయం) పూర్తికాగానే ఉన్నత విద్యాభ్యాసం చేయడానికి ఆర్థిక స్థోమత లేక ఆగిపోవాల్సి వచ్చింది. కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉంటాయని తెలిసి కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్నాను. డాటాబేస్, డాటా ఎంట్రీ, ఎక్సెల్, కోడింగ్ వంటివి నేర్చుకుంటున్నాను.


**కుటుంబానికి చేదోడుగా ఉంటుందని**

జి.సంధ్య(గృహిణి), వెలిమినేడు, చిట్యాల మండలం

ఇంటర్ పూర్తికాగానే వివాహం అయ్యింది. మాకు ఇద్దరు పిల్లలు, వారికోసం కొంతకాలం ఖాళీగా ఉన్నాను. పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో పెట్టుకుని, కంప్యూటర్ విద్యను నేర్చుకుంటున్నాను. ఏదైనా ఉద్యోగ, ఉపాధి అవకాశం లభిస్తే కుటుంబానికి ఆర్థికంగా చేదోడుగా ఉంటుందని ఈ నిర్ణయం తీసుకున్నాను.

**రోజు 8 గంటలు సాధన చేస్తున్నాను**

నున్నగోపుల భవాని, బీఎస్సీ, శివన్నగూడెం, మర్రిగూడ మండలం, నల్గొండ జిల్లాప్రస్తుత కాలంలో ఏ రకమైన ఉద్యోగం కావాలన్నా, కంప్యూటర్ పరిజ్ఞానం ఉందా అని ప్రశ్నిస్తున్నారు. దీంతో తప్పనిసరి కావడంతో కంప్యూటర్ విద్యను అభ్యసిస్తున్నాను. రోజూ 8 గంటల పాటు సాధన చేస్తున్నాను. కనీస పరిజ్ఞానం ఉంటే కొత్తగా వచ్చే కోర్సులను సులభంగా నేర్చుకోవచ్చు.



**అవకాశాల్లో పోటీ పడాలని**

రాపోలు మౌనిక (గృహిణి), వెలిమినేడు, చిట్యాల మండలం

ఇంటర్ పూర్తికాగానే పెళ్లికావడంతో కొంతకాలం ఖాళీగా ఉన్నాను. ఇంటిపట్టును ఖాళీగా కూర్చోవడం ఇష్టంలేదు. మా గ్రామ పరిసరాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవాలంటే కంప్యూటర్ పరిజ్ఞానంతో పోటీ పడొచ్చని భావించి చిట్యాలలో శిక్షణ తీసుకుంటున్నాను.

వైద్యరంగంలో అవసరం అని

చాపల మౌనిక, మునిపంపుల, రామన్నపేట మండలం

బీఫార్మసీ పూర్తిచేసి, కొంతకాలం ప్రైవేటుగా ఫార్మాసిస్టుగా పనిచేశాను. పాప పుట్టడంతో ఉద్యోగాన్ని వదిలేయాల్సి వచ్చింది. ప్రస్తుతం వైద్యరంగంలో కంప్యూటర్ సాంకేతికత ఆధారంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నందున భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కంప్యూటర్ విద్యలో శిక్షణ పొందుతున్నాను.

# గూడు లేక.. గోడు..!

నల్గొండ : పేదలకు సొంతింటిని సమకూర్చాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పదేళ్లయినా పూర్తి కావడం లేదు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వీటిని నిర్మించాలని సంకల్పించి.. రెండు విడతలుగా ఇళ్లు మంజూరు చేసినా కొన్ని ఇళ్ల పనులు ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మాణం చేపట్టినవి పూర్తి కాలేదు. కొన్ని గ్రామాల్లో పూర్తయినా లబ్ధిదారులను ఎంపిక చేసి అప్పగించలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి.

జిల్లాలో 8,155 ఇళ్లు మంజూరు చేశారు. 2859 పూర్తైనా మౌలిక వసతులు కల్పించలేదు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5.30 లక్షలు మంజూరు చేసింది. రూ.75 వేలను మౌలిక వసతులకు కేటాయించింది. ఈ నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో పనులు జరగడం లేదు. రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించలేదు.

జిల్లాలో 2859 రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పూర్తైంది. ఇప్పటివరకు 908 మంది లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించారు. కొన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయి అయిదేళ్లు అయినా మౌలిక వసతులు కల్పించడం లేదు. దీంతో దర్వాజలు, కిటికీలు చెదలు పడుతున్నాయి. గృహాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ పరికరాలు తస్కరణకు గురవుతున్నాయి. దరఖాస్తులు అధికంగా రావడం, ఇళ్లు తక్కువగా ఉండటంతో ఎంపిక చేపడితే పేదల నుంచి సమస్య ఏర్పడుతుందని గత ప్రభుత్వం కాలయాపన చేసింది. ఈలోపు కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రెండుపడక గదుల ఇళ్ల వ్యవహారం పూర్తిగా మరుగునపడింది. నల్గొండ పట్టణంలోని గొల్లగూడలో 522(జీం2) గృహాలను నిర్మించారు. వీటిలో తాగునీటి వసతి కల్పించలేదు. రోడ్లు, మురుగుకాల్వలను నిర్మించలేదు. లబ్ధిదారులను ఏడాది క్రితం ఎంపిక చేసినా.. వారికి ఇళ్లు అప్పగించలేదు.

కనగల్ మండలం పొనుగోడులో 75, నల్గొండ మండలం అన్నారెడ్డిగూ



డెంలో 75 చొప్పున ఇళ్లను నిర్మించారు. వసతులు కల్పించినా.. లబ్ధిదారులకు అప్పగించడం లేదు. నల్గొండ మండలం దోమలపల్లిలో 70, తిపర్తిలో 100(జీం2), కనగల్ మండలం చర్లగౌరారంలో 70 ఇళ్ల నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు.

దేవరకొండ నియోజకవర్గంలో 13 గ్రామాల్లో 824 గృహాల నిర్మాణం పూర్తి కావడంతో లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి అప్పగించారు. కాలనీల్లో తాగునీరు, రోడ్లు, మురుగుకాలువల వసతి లేక వారు అనేక అవస్థలు పడుతున్నారు.

మిర్యాలగూడ నియోజకవర్గంలో గుమస్తా కాలనీలో 560 (జీం2) గృహాలు పూర్తి అయ్యాయి. లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి అప్పగించలేదు. నకిరేకల్ నియోజకవర్గంలో నార్కట్‌పల్లిలో 64(జీం2) గృహాలను పూర్తి చేశారు. బి.వెల్లెంలలో 150(జీం1), అవురవాణిలో 80(జీం1) ఇళ్లను నిర్మించారు. ఇంకా తాగునీరు, రోడ్లు, మురుగుకాల్వల పనులు పూర్తి చేయలేదు. చిట్యాలలో 180(జీం1) గృహాలు నిర్మించి వసతులు కల్పించలేదు. ఇనుప కిటికీలు, దర్వాజలు తస్కరణకు గురవుతున్నాయి. మునుగోడు నియోజకవర్గంలో నారాయణపురం మండలం సర్వేల్‌లో 20, చౌటుప్పల్ మండలం మల్కాపూర్‌లో 40 చొప్పున ఇళ్ల నిర్మాణం పూర్తిచేశారు.

# బీమాతోనే.. ధీమా

భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లాలో సింహభాగం వ్యవసాయాధారితమే. ఇక్కడ శాశ్వత జలవనరులూ తక్కువే. ఎక్కువ భాగం రైతులు వర్షాధారంతోపాటు బోర్లు, బావుల్లోని నీటి ద్వారానే ఆయా పంటలను సాగు చేస్తుంటారు. గత దశాబ్దకాలంగా ఈ జిల్లాలో ప్రతి సీజన్‌లో వడగళ్ల వాన రైతాంగాన్ని కుంగదీస్తుంది. ఫలితంగా ఏప్రిల్, మే నెలలు వచ్చాయంటే పంట చేతికి వస్తుందా..? లేదా..? ఆకాశం వంక బిక్కుబిక్కుమని చూస్తుండటం పరిపాటి అని చెప్పవచ్చు.

ఇటీవల బొమ్మలరామారం, తుర్కపల్లి, ఆలేరు, రాజపేట, గుండాల మండలాల్లోనూ వడగళ్ల వానతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం తాజాగా రానున్న సీజన్ నుంచి పంటల బీమా అమలు చేయనున్నట్లు ప్రకటించడం ఇక్కడి రైతులకు బహుళ ప్రయోజనకరమని చెప్పవచ్చు. జిల్లాలో గతంలో 2016 నుంచి 2020 వరకు ఫసల్‌బీమా పథకం అమలులో ఉండేది. అప్పుడు చాలా మంది రైతులు ప్రీమియం చెల్లించేవారు. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంటల బీమా అమలు చేస్తామని తెలిపినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. తాజాగా ప్రభుత్వ ప్రకటనతో జిల్లాలో వేలాది మందికి ప్రయోజనం చేకూరనుంది.

**సాగు సమయంలోనే మేలు..**

సాగు సమయంలోనే రైతులు వాటికి బీమా చేసుకుంటే.. వడగళ్లు కురిసినా, వర్షాలు లేక పంటలు ఎండిపోయినా ఉపయోగంగా ఉంటుంది. ఎకరాకు రూ.500 ప్రీమియం చెల్లిస్తే చాలు నష్టపోయిన సమయంలో రూ.వేలాదిగా డబ్బులు వస్తుండేవి. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న సమయంలో ప్రీమియం డబ్బులు తీసుకునేవారు. దీంతో ప్రత్యేకంగా రైతులు చెల్లించాల్సిన అవసరం లేదు. గతంలో బీమా కింద ఎకరాకు వరికి రూ.37,484, పత్తికి రూ.36,282, మొక్కజొన్నకు రూ.18,742 పరిహారం వచ్చేది. రానున్న రోజుల్లో పంట నష్టపోతే పరిహారం వచ్చి మేలు జరుగుతుంది.

**ఈసారి పక్కాగా నిర్వహణ..**

పంటల బీమా పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. సాంకేతికత ఆధారంగా దిగుబడి అంచనాల రూపకల్పన, నష్టపోయిన పంట విషయంలో బీమా కంపెనీలు సత్వరమే పరిహారం అందించేలా విధివిధానాలను రూపొందించనున్నారు. దిగుబడి ఆధారిత బీమా పథకం కింద వరి, మొక్కజొన్న, కంది, మినుము, సోయాబీన్, వేరుశనగ, నువ్వులు మొదలైన పంటలు, వాతావరణ ఆధారిత బీమా పథకం కింద పత్తి, మిరప, మామిడి, ఆయిల్‌పామ్, టమాట, బత్తాయి పంటలకు బీమా వర్తింపజేయాలని ప్రభుత్వ వర్గాలు యోచిస్తున్నాయి.

**జిల్లా సమాచారం..**

వ్యవసాయ క్లస్టర్లు: 91

సాధారణ సాగు: 4,38,534

రైతుల సంఖ్య: 1,97,206

# గోదాముల్లోనే నిధులు.. గాల్లోనే పనులు!

బొబ్బిలి : రైతులు ఖరీఫ్, రబీలో పండించిన పంటలకు అన్ని వేళలా గిట్టుబాటు ధర ఉండటం లేదు. ఒక్కోసారి నిల్వ ఉ ంచుకునే సౌకర్యం లేక దళారులు చెప్పిన ధరకే ఇచ్చేయాల్సి వస్తుంది. మరికొందరు చేసేది లేక కల్లాల్లో ఉంచుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా, ప్రాథమిక సహకార పరపతి సంఘాలను(పీఏసీఎస్) బలోపేతం చేసేందుకు తలపెట్టిన గోదాంల నిర్మాణం మూడేళ్లుగా నత్తనడకన సాగుతోంది. వీటి పూర్తికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని, అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆదిలోనే అలసత్వం గత వైకాపా ప్రభుత్వం**

గోదాముల నిర్మాణానికి స్థల సేకరణలో తొలుత జాప్యం చేసింది. ఆపై పనులు చేసిన గుత్తేదారులకు బిల్లులు చెల్లించక మధ్యలోనే ఆపేశారు. కొన్నిచోట్ల నిర్మాణం పూర్తయినా అధికారులకు అప్పగించలేదు. వాస్తవానికి 2024 ఖరీఫ్ నాటికి తొలి విడత పనులు పూర్తయితే మలి విడత చేయాల్సి ఉంది. కానీ ఆదిలోనే అలసత్వం జరగడంతో లక్ష్యం అటకెక్కింది. ఫలితంగా రైతు దళారుల వలలో పడుతున్నాడు.



**లక్ష్యం ఇదీ**

రైతుల నుంచి సేకరించిన పంటలను నిల్వ చేసుకోవడమే కాకుండా.. గోదాంలను అద్దెకు కేటాయించి.. పీఏసీఎస్‌లను బలోపేతం చేయాలన్నది లక్ష్యం. అందుకే సొసైటీలకు రుణం అందించి, వాటితో నిర్మాణాలు చేపట్టారు. మరికొన్ని నెలల్లో ఖరీఫ్ వరి పంట రైతు చేతికి రాబోతోంది. ఆ లోపు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

**మలివిడత ఎప్పటికో!**

రెండో విడతలో మరో 45 గోదాంలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి. ఆప్కాబ్, డీసీసీబీలు గోదాంల నిర్మాణానికి రుణ సాయం అందిస్తున్నాయి. నిర్మాణాలు పూర్తయితే అద్దెకు కేటాయించి, రుణ వాయిదాలు చెల్లించుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు రుణం చెల్లింపు తప్పకపోగా.. మరోవైపు సొసైటీల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు.

**పూర్తికి చర్యలు..** ప్రస్తుతం జిల్లాలో సగానికి పైగా గోదాములు పూర్తి చేశాం. కొన్నిరోజుల్లో మిగిలినవి పూర్తి చేయిస్తాం. ఆపై కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేటు వ్యక్తులకైనా అద్దెకు కేటాయిస్తాం. ఇప్పటికే పనులు పూర్తి చేయాలని గుత్తేదార్లను కోరాం. డి.రమేష్, జిల్లా సహకార అధికారి, విజయనగరం

# సర్కారీ కార్యాలయాలకు 'సౌర వెలుగులు'

విజయనగరం : ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక సౌర వెలుగులు ప్రసరించనున్నాయి. పాలన కార్యకలాపాలకు అధిక విద్యుత్తు వినియోగం అవుతోంది. ఛార్జీల భారం తడిసి మోపెడవుతోంది. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీఈపీడీసీఎల్)కు సకాలంలో బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంటోంది. బడ్జెట్ నిధులు చాలక దాదాపు అన్ని కార్యాలయాలు పెద్ద మొత్తంలో బకాయిపడుతున్నాయి. ఈ భారాన్ని తగ్గించుకునేందుకు సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అధిక ఉత్పత్తి చేస్తే డిస్కమ్‌కు తిరిగి విక్రయించుకోవచ్చు. ఈ మేరకు రెండు జిల్లాల్లోని కార్యాలయాల భవనాలపై వీటి ఏర్పాటుకు సంబంధించి సర్వే చేపట్టారు.

**భారం తగ్గించేలా.. ఆదా చేసేలా..**

ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగించే విద్యుత్తు యూనిట్‌కు రూ.6 నుంచి రూ.8 వరకు చెల్లించాల్సి వస్తోంది. చాలా కార్యాలయాల్లో వృథా అవుతోంది. సిబ్బంది లేకపోయినా పంకాలు, లైట్లు పనిచేస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. అదే సొంతంగా సౌర ఫలకలు ఏర్పాటు చేసుకుని విద్యుదుత్పత్తి చేసుకుని వినియోగిస్తే భారం సగానికి తగ్గుతుందని అంచనా. ఇప్పటికే ఈ ప్రాజెక్టు అమలుకు



ప్రభుత్వ రంగ విద్యుత్తు సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. దీని వల్ల యూనిట్ విద్యుత్తు సుమారు రూ.4 లోపే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో విద్యుత్తు ఆదాతోపాటు, సెలవురోజుల్లో ఉత్పత్తిని సర్దుబాటు చేసే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

మన్యం జిల్లాలోని మొత్తం కార్యాలయాలు: 8,423
ప్రస్తుత విద్యుత్తు కనెక్షన్లు ఉన్నవి: 7,917
ప్రభుత్వ కార్యాలయాల కనెక్షన్లు: 4,610
స్థానిక సంస్థల భవనాల కనెక్షన్లు: 3,804
సౌర ఫలకల ఏర్పాటుకు అవకాశం లేనివి: 4598
3825 భవనాలపై ఏర్పాటుకు అవకాశమున్న విస్తీర్ణం: 32,37,571 చ.అ

**ప్రభుత్వానికి నివేదిస్తాం..** ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు సర్వే చేపట్టాం. డిస్కమ్ ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తాం. అందుబాటులో ఉన్న కార్యాలయాలపై సౌర ఫలకల ఏర్పాటుకు రూ.కోట్లలో వెచ్చించాల్సి వస్తోంది. లక్ష్మణరావు, చలపతిరావు, ఉభయ జిల్లాల డిస్కమ్ ఎస్ఈలు

# అడుగడుగునా తప్పులు.. భక్తులకు తిప్పలు



విశాఖపట్నం: గత నెల 30న చందనోత్సవం రోజు సింహాచలంలో గోడ కూలిన ఘటనలో ఏడుగురు భక్తులు మృతిచెందారు. ఈ నిర్మాణాన్ని ఏ స్థాయిలోనూ అధికారులు పట్టించుకోలేదు. తనిఖీలు చేయాల్సిన ఇంజినీరింగ్ విభాగం గాలికొదిలేసింది. పర్యవేక్షించాల్సిన ఈవో చూసీచూడనట్లు వదిలేశారు. పనులు చేయించిన ఇంజినీర్లు అది ఎంతవరకు నిలుస్తుందో ఆరా తీయలేదు. ఫలితంగా ఏడుగురి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఆ తర్వాత బాధ్యులను కూటమి ప్రభుత్వం సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేసింది. అంతకు ముందు.. 2023 చందనోత్సవం నిర్వహణలోనూ అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. నాటి ప్రభుత్వం విచారణకు ఆదేశించగా దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విచారణాధికారి సిఫార్సు చేస్తే దాన్ని అప్పటి ప్రభుత్వం తొక్కిపెట్టింది. ఆ రోజే క్రమశిక్షణచర్యలు తీసుకొని ఉండుంటే ఈ ఏడాది దుర్ఘటన జరిగి ఉండేది కాదంటున్నారు. తప్పులు జరిగినా ఎవరూ పట్టించుకోరు, తప్పించుకోవచ్చన్న ధోరణే ఇంతటి ప్రమాదానికి కారణమైంది. నాటి విచారణ నివేదిక తాజాగా బయటపడగా అందులోని వివరాలిలా ఉ న్నాయి. 2023 చందనోత్సవం సమయంలో సింహాచలం దేవస్థానం ఈవోగా త్రినాథరావు ఉన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో ఈఈగా శ్రీనివాసరాజు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులే కొనసాగుతున్నారు. నాడు చందనోత్సవం పూర్తిగా విఫలమవడంలో ఈవో పాత్ర ఉన్నట్లు విచారణలో తేల్చారు. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం ఉందని స్పష్టం చేశారు. అప్పుడే వారి మీద చర్యలకు సిఫార్సు చేసుంటే బాధ్యతగా పనిచేసేవారు. అప్పట్లో ఆ నివేదిక అమలు కాకుండా కీలక నేతలతో ఒత్తిడి చేయించి తొక్కిపెట్టినట్లు విమర్శలొస్తున్నాయి. ముఖ్య ఉత్సవాల నిర్వహణలో ఘోరంగా విఫలమైన అదే అధికారిని తిరిగి దేవస్థానం ఈవోగా నియమించడం గమనార్హం. అయితే..కీలక సమయంలో మూడు నెలల పాటు సెలవుపై వెళ్లిపోవడం విమర్శలకు దారి తీసింది. భక్తులకు తాగునీటి సౌకర్యం, మజ్జిగ పంపిణీ చేయించడం, క్యూలైన్ల నిర్వహణలో ఈఈ, ఈవో ఘోరంగా విఫలమయ్యారు. వీవీఐపీ లైన్లలోనూ వీటిని ఏర్పాటు చేయలేదు. ఎక్కువ సమయం నిరీక్షించేలా క్యూలైన్లు ఏర్పాటు చేయడం ప్రణాళిక లోపంగా గుర్తించారు.

**ఎన్నో తప్పిదాలు** ఉత్సవానికి అప్పట్లో సీఎఫ్‌వోగా వ్యవహరించిన చంద్రశేఖర్ ఆజాద్, ఈవోగా ఉన్న త్రినాథరావు, ఏఈవో ఆనందకుమార్, ఈఈలు శ్రీని వాసరావు, రాంబాబులు నాటి తప్పిదాలకు కారణమని విచారణ నివేది కలో పేర్కొన్నారు. అదనపు టికెట్ల మంజూరులో ఈవో, ఏఈవోలు జిల్లా కలెక్టరు అనుమతి తీసుకోలేదు. పోలీసులు అదనంగా వాహనాల కు పాసులు తీసుకోవడాన్ని తప్పుబట్టారు. టికెట్ల తనిఖీ చేసి భక్తులను క్యూలైన్లలోకి పంపాలి. ఆ ప్రక్రియ ఎక్కడా సక్రమంగా జరగనట్లు గుర్తించారు. తనిఖీలకు ప్రత్యేకంగా దేవాదాయశాఖ సిబ్బందిని నియమించారు. చాలా మందిని పోలీసులు వారి పాయింట్లకు వెళ్లకుండా ఆపేశారు. వీవీఐపీ టికెట్ల తనిఖీకి ఉపయోగించిన స్కానర్ అరగంటకే మూలకు చేరింది. షిఫ్టు విధుల్లో పనిచేయాల్సిన ఉద్యోగులు వచ్చారా లేదా అనేది ఉన్నతాధికారులు తనిఖీ చేయాలి. అదెక్కడా పకడ్బందీగా జరగలేదు.

# పండగలా సరకుల పంపిణీ



నర్సీపట్నం : చౌక ధరల దుకాణాల ద్వారా పండగ వాతావరణంలో నిత్యావసర సరకుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా వీధి చివరో, రోడ్డు పక్కనో నిత్యావసర సరకులు పంపిణీ చేసేది. కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసి గతంలో మాదిరి చౌకధరల దుకాణాల ద్వారా జూన్ ఒకటి నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గోదాముల నుంచి దుకాణాలకు సరకులను చేరవేస్తున్నారు. ప్రస్తుతం బియ్యం, పంచదార నిల్వలను దుకాణాలకు తరలిస్తున్నారు.

**ఖర్చు తగ్గించుకునేలా మార్పు..** పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో పౌర సరఫరాల గోదాం ఉంది. ఇప్పటివరకు నర్సీపట్నం, గొలుగొండ మండలాల్లోని 84 దుకాణాలకు ఇక్కడి నుంచి సరకులు సరఫరా చేసేవారు. తాజాగా మాకవరపాలెం మండలంలో 20, రోలుగుంట మండలంలో 16, కోటవురట్ల మండలంలో రెండు దుకాణాలను ఈ గోదాము పరిధిలోకి తీసుకువచ్చారు. సమీప ప్రాంతాల్లోని డిపోలను పెదబొడ్డేపల్లి గోదాము పరిధిలోకి తీసుకురావడం వల్ల జిల్లా కేంద్రం నుంచి సరకు రవాణా ఖర్చులు ఆదా అవుతాయని చెబుతున్నారు. ఈ గోదాము పరిధిలో 59,057 రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ-పోస్, తూకం పరికరాలను సిద్ధం చేసుకోవాలని అధికారుల నుంచి డీలర్లకు ఆదేశాలొచ్చాయి. ధరలు, నిల్వల పట్టిక అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని, అధికారులను సంప్రదించేందుకు ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని సూచనలొచ్చాయి. దుకాణాలను శుభ్రంగా ఉంచాలని, జూన్ 1న పూలతో అలంకరించాలని, ప్రజా ప్రతినిధులు, వయోవృద్ధులను ప్రారంభ కార్యక్రమానికి ఆహ్వానించాలని పేర్కొన్నారు. తాగునీరు, కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయనున్నారు. 65 ఏళ్లు దాటిన వారు, దివ్యాంగులకు ఇళ్లకు ప్రతినెలా ఐదో తేదీలోగా సరకులు తీసుకువెళ్లి అందజేయాలన్నది మార్గదర్శకం. వీరందరినీ వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పాటు చేసి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నెల 29న ప్రయోగాత్మకంగా ట్రయల్ రన్ వేయనున్నారు. సాంకేతిక లోపాలుంటే వెంటనే సరిచేస్తారు. వినియోగదారులు సామాజిక దూరం పాటించేలా, మాస్కులు ధరించేలా చైతన్యం చేయాలని సూచనలొచ్చాయి. బియ్యం మినహా ఇతర సరకులకు నిర్ణీత నగదు యూపీఐ, డిజిటల్ విధానంలో చెల్లించేలా ప్రోత్సహించాల్సి ఉంటుంది.

**దివ్యాంగులకు, వృద్ధులకు ఇంటివద్దనే..**

కలెక్టరేట్: జూన్ 1 నుంచి రేషన్ డిపోల ద్వారా సరకులు పంపిణీ చేపడుతున్నామని జిల్లా పౌరసరఫరాల అధికారి కె.మూర్తి పేర్కొన్నారు. సోమవారం పౌరసరఫరాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహనాల ద్వారా ఇంటింటికీ సరకులు పంపిణీ వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జిల్లాలో 1,069 రేషన్ డిపోల ద్వారా ఇకపై ప్రతి నెల 1 నుంచి 15 వరకు సరకుల పంపిణీ ఉంటుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డిపోలు అందుబాటులో ఉంటాయన్నారు. 65 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటి వద్దకు సరకులు అందిస్తామన్నారు. లబ్ధిదారులు రాష్ట్రంలో ఏ చౌక దుకాణం వద్ద నుంచైనా సరకులు పొందవచ్చన్నారు. రేషన్ కార్డుల్లో 7 సేవలకు సంబంధించి 21 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు.


# ఇంటింటా యోగా సాధన

మామిడికుదురు : యోగాంధ్ర-2025 పేరుతో పదకొండో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అన్ని మండలాల్లోనూ ప్రణాళికాయుతంగా అమలు చేసేందుకు యంత్రాంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేద, హోమియో వైద్యులకు బాధ్యతలు అప్పగించారు ఆరంభమైన ఈ కార్యక్రమం జూన్ 21 వరకు నిరాటంకంగా జరిపేందుకు ఉపక్రమించారు. స్థానికంగా శిక్షకులు, సాధకులను సమాయత్తం చేసి వారితో ప్రతిరోజూ వివిధ విభాగాల్లో ఉన్నవారికి ఆసనాలు నేర్పిస్తారు.

**ఆసనాలు.. విభిన్న పోటీలు**

ప్రతిరోజూ అభ్యాసకులు, శిక్షకులు ఆసనాలు వేసేలా, వాటిని చూసి అంతా నేర్చుకునేలా అవగాహన కల్పిస్తారు. దీనిపై వ్యాసరచన, పాటలు, చిత్రలేఖనం, క్విజ్, ఛాయాచిత్రం, రంగోళి, చక్కని నినాదం, లఘు చిత్రాల పోటీలు ఉంటాయి. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి యోగాపై కరపత్రాలతో ప్రచారం చేయడం, ర్యాలీలతో చైతన్యం తీసుకొస్తారు. శిక్షకులు, సాధకులు విడివిడిగా ఆసనాలు వేయడంతో పాటు సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం తదితర వాటిపై వివరిస్తారు. మండలాల వారీగా నియమితులైన ఆయుష్ వైద్యాధికారులు స్థానికంగా అధికారులను కలిసి కార్యక్రమాల అమలుపై చర్చించి కార్యాచరణ దిశగా అడుగులు వేస్తున్నారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని సాధకులతో భారీగా నిర్వహిస్తారు. మే 26 నుంచి 30 వరకు గ్రామస్థాయి, జూన్ 2 నుంచి 7వరకు మండల స్థాయి, జూన్ 9 నుంచి 14వరకు జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు.

**ఇవీ కీలక కార్యక్రమాలు**



ఈనెల 27: మలికిపురం మండలం దిండిలో ఉన్న హరిత కోకోనట్ రిసార్ట్స్ వద్ద వశిష్ఠ గోదావరి నది ఒడ్డున ప్రశాంత వాతావరణంలో యోగా శిబిరం నిర్వహిస్తారు.

29: కోనసీమలోని రైతులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు.

జూన్ 3: సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలోని సముద్ర తీరంలో పర్యాటకులకు ఆసనాలపై అవగాహన.

9న: ద్రాక్షారామ భీమేశ్వరాలయం వద్ద స్థానికులు, పర్యాటకుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం.

16న: ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ సమీప లొల్ల లాకుల వద్ద ప్రత్యేక శిబిరాలు.

# అక్రమాలకు ఇక చెల్లు

బొబ్బిలి : పొదుపు సంఘాల సభ్యులు స్త్రీనిధి పథకంలో బ్యాంకు నుంచి తీసుకున్న రుణాల చెల్లింపుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిజిటల్ పద్ధతిలో చెల్లించేలా కొత్త యాప్‌ను రూపొందించింది. మూడు రోజుల కిందట మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో యాప్‌ను ప్రారంభించారు.

**వెంటనే సంక్షిప్త సమాచారం**

సభ్యులు తీసుకున్న రుణాలు బ్యాంకులకు తిరిగి చెల్లించడంలో చేతివాటం ప్రదర్శించడం, రుణాల మంజూరులోనూ అక్రమాలు జరగడంతో తొలుత వీవోఏలకు పేటీఎం యంత్రాలను ఇచ్చారు. అవి అందరికీ ఇవ్వడానికి సాధ్యం కాలేదు. మండలానికి పది యంత్రాలు మాత్రమే రావడంతో ఇబ్బందిగా మారింది. దీన్ని అధిగమిస్తూ



యాప్ ద్వారా నేరుగా చెల్లించుకునే వెసులుబాటు కల్పించారు. ఎంత చెల్లించారనేది చరవాణికి సంక్షిప్త సమాచారం వెంటనే వచ్చేస్తుంది. జిల్లాలోని 27 మండలాల్లో 40,396 పొదుపు సంఘాలున్నాయి. వాటిలో 4,39,212 మంది సభ్యులున్నారు. వారంతా బ్యాంకు లింకేజీ రుణాలతోపాటు స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకొని వివిధ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 21,220 మంది సభ్యులకు లక్ష్యానికి మించి రూ.167 కోట్లు రుణంగా ఇచ్చారు. రూ.పది వేలు నుంచి రూ.లక్ష వరకు ఒక్కో సభ్యురాలికి ఇస్తున్నారు. 2025-26లో 28,287 మంది సభ్యులకు రూ.282 కోట్లు రుణంగా ఇవ్వాలని లక్ష్యం విధించుకున్నారు. ఇప్పటివరకు రూ.5 కోట్లకుపైగా ఇచ్చారు. **అక్రమాలకు తావుండదు** కొత్తగా రూపొందించిన యాప్ అమల్లోకి వస్తే రుణాల చెల్లింపుల్లో అక్రమాలకు తావుండదు. సభ్యులు ఎవరికీ ఇవ్వకుండా యాప్ ద్వారా నేరుగా చెల్లించుకునే అవకాశముంటుంది. విధి విధానాలు వచ్చిన వెంటనే జిల్లాలో అమలు చేస్తాం. వై.చిట్టిబాబు, ఏజీఎం స్త్రీనిధి పథకం, విజయనగరం

# రెండడుగుల గొయ్యితో సరి..!

భీమవరం : ఈ చిత్రంలో కనిపిస్తున్న చోటే కార్గో పోర్టు నిర్మాణం చేస్తామంటూ రెండడుగుల గొయ్యి తవ్వి వైకాపా సర్కారు హడావుడిగా శంకుస్థాపన చేసింది. ప్రస్తుతం అక్కడ ఆ ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. మత్స్యకారుల జీవనోపాధికి ఉపయుక్తంగా ఉండే ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ప్రాజెక్టును వైకాపా సర్కారు నిర్వీర్యం చేసింది. మత్స్య ఉత్పత్తుల ఎగుమతులకు ఫిషింగ్ హార్బర్, కార్గో పోర్టు నిర్మాణం ఎంతగానో ఉపయోగపడతాయని మభ్యపెట్టింది. తీరా అటు హార్బర్ కాని, ఇటు కార్గో పోర్టుగాని నిర్మాణాలు పూర్తిచేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఫిష్ ల్యాండింగ్ కేంద్రం నిర్మాణంపై గంగపుత్రుల ఆశలు చిగురిస్తున్నాయి. నీ జిల్లాలో 19 కి.మీ. మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. వేలమంది మత్స్యకారులకు గోదావరితోపాటు సముద్రంలో వేటే జీవనాధారం. అయితే బోట్లు నిలిపేందుకు అనువైన స్థలం, మత్స్యసంపదను నిల్వ చేసుకునేందుకు గిడ్డంగులు, విశ్రాంతి సౌకర్యాలు లేక గంగపుత్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నరసాపురం మండలం బియ్యపుతిప్ప వద్ద ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ఏర్పాటుకు యోచించి, 2018లో మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఆరెకరాల స్థలం సేకరించి తొలి విడత నిధులు మంజూరు చేశారు. టెండర్లు పూర్తిచేసి స్థలాన్ని చదును చేసి సామగ్రి తీసుకొచ్చారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ప్రాజెక్టుని అటకెక్కించింది. ఆర్భాటంగా పోర్టుకు శంకుస్థాపన.. వాస్తవానికి ఈ ప్రాంతంలో హార్బర్ నిర్మించాలని తొలుత భావించారు. గోదావరి సముద్రంలో కలిసే సంగమ ప్రాంతం కావడంతో పూడిక ఏర్పడి పెద్ద పెద్ద ఓడలు నిలిపేందుకు కష్టమవుతుందని ఫిష్ ల్యాండింగ్ నిర్మాణానికి నిర్ణయించారు. తర్వాత వచ్చిన వైకాపా సర్కార్ ప్రజలను తప్పుదోవ పట్టించి హార్బర్ నిర్మిస్తామంటూ గొప్పలు చెప్పింది. చినమైనవానిలంక వద్ద సముద్రం ఒడ్డున కార్గో పోర్టు నిర్మిస్తామని అప్పటి సీఎం జగన్ ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. రెండడుగుల మేర చిన్నగొయ్యి తవ్వి వదిలేశారు. పూర్తయితే ఉపయుక్తం.. ప్రస్తుతం అంతర్వేదిలో ఉన్న ఫిష్ ల్యాండింగ్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. బియ్యపుతిప్పలో కేంద్రం పూర్తయితే దూరభారం తగ్గడంతోపాటు చేపలు ఎండబెట్టేందుకు ప్లాట్‌ఫాంలు, శీతల గిడ్డంగులు, ఐస్ తయారీ పరిశ్రమలు అందుబాటులోకి వచ్చేవి. ఏటా రూ.350 కోట్ల విలువైన మత్స్యసంపద ఇక్కడి నుంచి ఎగుమతి అయ్యేవి. ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ఏర్పాటుపై ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, త్వరలోనే ఆదేశాలొస్తాయని మత్స్యశాఖ జేడీ నాగలింగాచారి తెలిపారు.

# డ్వాక్రా సంఘాలకు సాంకేతిక ముడి

ఆచంట : భవిష్యత్తులో డ్వాక్రా మహిళల కార్యకలాపాలన్ని సాంకేతికతతో ముడిపడనున్నాయి. ఈ క్రమంలో జిల్లాలోని డ్వాక్రా బృందాల సభ్యులందరూ సూక్ష్మరుణ అవసరాలకు సంబంధించి, గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ(సెర్ప్) వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు నమోదు చేయించుకోవాల్సి ఉంది. దరఖాస్తు సమయంలో దళారుల ప్రమేయాన్ని నివారించడానికి డిగ్రీ, ఆపై చదివిన మహిళలను డిజిటల్ లక్ష్మిలుగా నియమించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఆలోచన కూడా చేస్తోంది.

**జిల్లాలో ఇలా..** మొత్తం 27 వేల మహిళా సంఘాలు ఉన్నాయి. 2.70 లక్షల సభ్యులు ఉండగా, ఇప్పటి వరకు 19,500 మంది డేటా నమోదు చేయించుకున్నారు. ఈ నెలాఖరుకు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. గడువు లోపు ఇది సాధ్యమయ్యేలా లేదు. క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి సభ్యురాలికి డిజిటల్ వేలిముద్ర, ముఖం, కళ్లు వంటి ఫొటోలు, గ్రూప్ సమావేశమయ్యే ప్రదేశం జియోట్యాగింగ్ వంటివి నమోదు చేయాలి. జిల్లాలో అనేక మంది మహిళలు ఉపాధి ఇతర అవసరాల కోసం దూర ప్రాంతాల్లో ఉ ంటున్నారు. కొందరు గల్ఫ్ దేశాల్లో ఉన్నారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయి సిబ్బంది వద్ద వేలి ముద్రలు తీసుకోవడానికి ఫింగర్ ప్రింట్ స్కానర్లు పూర్తిస్థాయిలో లేవు. జిల్లాలో అనేక గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్య వల్ల డేటా నమోదుకు గంటల సమయం పడుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డీఆర్డీఏ పీడీ వేణుగోపాల్‌ను సంప్రదించగా సచివాలయాల్లో పింఛన్ల పంపిణీకి సంబంధించిన డివైజ్‌లు వినియోగించుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. నిరంతర ప్రక్రియగా డేటా నమోదు గడువు పెంచే అవకాశం ఉందని చెప్పారు.

# దేనికైనా సిద్ధం.. పారిశ్రామిక పథం!

పుత్తూరు : చెన్నై శివారులోని అంబత్తూరు ప్రాంత పరిశ్రమలను బయట ప్రాంతాల్లో పెట్టాలని భావించారు. ఈ నేపథ్యం లో చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం విజయపురం మండలంలో కోసలనగరంలో 5,810 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో అధికంగా ప్రభుత్వ, డీకేటీ భూములే ఉన్నందున భూసేకరణకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు సైతం భావించారు. ఇప్పటికే ఏపీఐఐసీ పరిధిలో 2,042 ఎకరాల భూమి ఉంది.వైకాపా హయాంలో పారిశ్రామిక రంగం పూర్తిగా పడకేసింది.. నేతల వ్యవహార శైలితో పారిశ్రామికవేత్తలు పారిపోయారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతినిధుల చొరవతో పారిశ్రామికవేత్తలు మళ్లీ జిల్లా వైపు చూస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధమంటున్నారు. నగరి నియోజకవర్గంలోని కోసలనగరం పారిశ్రామికవాడ ప్రస్తుత పరిస్థితి చూస్తే ఇదే సన్నివేశం కన్పిస్తోంది.

**2014లోనే అడుగులు**

కోసలనగరం పారిశ్రామికవాడ ఏర్పాటుకు 2014లోనే దివంగత నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఏపీఐఐసీ ద్వారా 5,810 ఎకరాలు గుర్తించారు. రెండు విడతలుగా ఆపై 500 ఎకరాలు సేకరించారు. మలి దశలో 1,442 ఎకరాలు సేకరించారు. ఆపై వచ్చిన వైకాపా ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు నిధులు ఇవ్వకపోగా, పారిశ్రామిక ప్రగతి పట్టించుకోలేదు.

**వరుస చర్చలతో ఒప్పించి..**

అంబత్తూరుకు చెందిన పారిశ్రామికవేత్తలతో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



ఇప్పటికే మూడుసార్లు చర్చించడంతో వారు ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. భూములు ప్రభుత్వం అభివృద్ధి చేసినా, లేదా తమకు ఇచ్చినా అభివృద్ధి చేసుకుంటామని వారంటున్నారు. ఈ క్రమంలో వెంటనే 600 ఎకరాలు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పార్కుకు ప్రతిపాదించిన స్థలం: 5,810 ఎకరాలు

సేకరించిన భూమి: 2,042.13 ఎకరాలు

సేకరించాల్సిన భూమి: 1,600

ఉన్న అడ్డంకులు రెండే..: కోసలనగరం పారిశ్రామికవాడకు ఉన్న ప్రధాన అడ్డంకులు రెండే. అవి తాగునీరు, రహదారి సౌకర్యం. కోసలనగరం, ఇల్లత్తూరు పరిధిలోని కొండల మధ్యలో రెండు చెరువులను గుర్తించారు. వీటిలో 3 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేలా అభివృద్ధి చేయాలని నివేదించారు. ఇందుకు తెలుగుగంగ నుంచి తాగునీటిని తేవాలని గతంలోనే ప్రతిపాదించారు.

అంబత్తూరు నుంచి 60 కి.మీ. మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నది పారిశ్రామికవేత్తల కోరిక. ఈ రెండూ పూర్తయితే మరిన్ని పరిశ్రమలు తరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేస్తే కోసలనగరం పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తుంది.

పన్నూరు వద్ద కనెక్టివిటీ ఇస్తే వస్తామన్నారు..

కోసలనగరం పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుకు అంబత్తూరు పరిశ్రమల అసోసియేషన్ సిద్ధంగా ఉంది. చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ వే.. పారిశ్రామికవాడకు విజయపురం మండలం పన్నూరు సమీపంలో 15 కి.మీ. దూరంలో ఉంది. ఈ రోడ్డుకు కనెక్టవిటీ ఇప్పించాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి పరిశ్రమల ప్రతినిధులు తీసుకురాగా ఆయన.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. అనుమతి రాగానే సీ బ్లాక్‌లో 476 ఎకరాల డీకేటీ భూములకు నోటిఫికేషన్ ఇచ్చి పరిశ్రమలకు అప్పగిస్తాం.

సుబ్బారావు, జోనల్ మేనేజరు, ఏపీఐఐసీ, చిత్తూరు

# పేట.. పరిశ్రమల కోట

పాయకరావుపేట : పాయకరావుపేట నియోజకవర్గం పరిశ్రమల కోటగా మారనుంది. పలు కొత్త పరిశ్రమలు ఈ ప్రాంతంలో కొలువుదీరనున్నాయి. ఇప్పటికే నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ కర్మాగారం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. దీంతోపాటు మిత్తల్ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. తాజాగా పాయకరావుపేట మండలంలోని రాజవరంలో ఉన్న దక్కన్ పరిశ్రమ విస్తరణకు రంగం సిద్ధమైంది. దీనిని సుమారు 200 ఎకరాల్లో నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.

రాజవరం, కేశవరం మధ్య ఇప్పటికే దక్కన్ ఫైన్ కెమికల్స్ పరిశ్రమ నడుస్తోంది. దీనిలోనే పవర్‌ప్లాంట్ నిర్వహిస్తున్నారు. తాజాగా కుమారపురం వద్ద సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో 120 ఎకరాలు కొనుగోలు చేశారు. సోలార్ ప్లాంట్ ఆలోచన విరమించుకుని రూ. 1,560 కోట్లతో దక్కన్ పరిశ్రమను రెండో దశ విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికి ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చింది. ఇక్కడ ఉన్న మరో 70 ఎకరాల ప్రభుత్వ భూమి పరిశ్రమకు కేటాయించే అవకాశముంది. దీనిలో 1800 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. పరిశ్రమ ఏర్పాటుతో భూముల ధరలకు రెక్కలు రానున్నాయి. ఇప్పటికే కేశవరం, రాజవరం, వెంకటనగరం, శ్రీరాంపురం ప్రాంతాల్లో ఎకరా ధర కోట్లకు చేరింది. తాజాగా రెండో దశ విస్తరణ పనులు మొదలు పెడితే ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ వేలాది మంది ఉపాధి పొందే అవకాశముంది.

స్థానికులకు అవకాశం దక్కేనా?.. పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగాలు వస్తాయని ఆశిస్తున్న నిరుద్యోగులకు నిరాశే ఎదురవుతోంది. నక్కపల్లి మండలంలోని రాజయ్యపేటలోని హెటిరో పరిశ్రమ, రాజవరంలోని దక్కన్ పరిశ్రమలో స్థానికులకు అవకాశాలు ఇవ్వడం లేదు. అర్హత ఉన్నా వారిని పట్టించుకోవడం లేదు. ఈసారైనా ఇక్కడ వారికి పరిశ్రమల్లో కొలువులు వస్తాయని ఆశిస్తున్నారు.

ఉద్యోగ అవకాశాలు ఇవ్వాల్సిందే... స్థానికులకు పరిశ్రమల్లో ఉద్యోగాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపడం వాస్తవమే. దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం. ఇక్కడి అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను పరిశ్రమలే ఏర్పాటు చేసే విధంగా వారితో చర్చిస్తాం. ఆ తర్వాత నైపుణ్యాలకు అనుగుణంగా నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగాల్లో పెద్దపీట వేయిస్తాం.

వంగలపూడి అనిత, హోంమంత్రి

# కాస్త చొరవ.. కాదా శుద్ధి!



ధర్మవరం : పాఠశాలల్లో కల్పించాల్సిన మౌలిక వసతుల్లో తాగునీరు అత్యంత ప్రధానమైంది. సాధారణ నీరుతో విద్యార్థులు అతిసారం, కామెర్లు, గొంతునొప్పి...తదితరాలతో బాధపడుతున్నారనే ఉద్దేశంతో పాఠశాలల్లో శుద్ధి చేసి జలాలు అందించాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు ఆర్వో ప్లాంట్లను ప్రభుత్వం అందజేసింది. రాష్ట్ర స్థాయిలో ఒకే గుత్తేదారు సంస్థ ద్వారా యంత్రాలను సరఫరా చేసింది. సదరు సంస్థ వాటిని అమర్చాలి. ఏడాది పాటు యంత్రాలు పాడైనా మరమ్మతు చేయాలి. ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలల్లో ఇప్పటికీ యంత్రాలు అమర్చలేదు. కొన్ని చోట్ల అమర్చినా పని చేయడం లేదు. మరమ్మతులు చేయకుండా వదిలేశారు. వచ్చే నెలలోనే రోజుల్లో బడులు తెరుచుకోనున్నాయి. మరమ్మతులు త్వరగా చేపట్టి, పక్కన పెట్టిన యంత్రాలు అమర్చాలి లేదంటే విద్యార్థులకు శుద్ధమైన నీటి కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. గత 6 నెలలుగా యంత్రాల మరమ్మతులు చేపట్టడం లేదు.

**ఒక్కో పాఠశాలకు రూ.లక్షకు పైగానే..**

విద్యార్థుల సంఖ్య, ఆయా పాఠశాలల్లోని నీటిలో లవణాలు, ఫ్లోరైడ్ శాతాన్ని బట్టి యంత్రాలను సరఫరా చేశారు. విద్యార్థులు 200 మందిలోపు ఉంటే రూ.లక్ష విలువ చేసే యంత్రాన్ని అందించారు. రెండోశ్రేణిలో 300 విద్యార్థులు ఉంటే రూ.2లక్షలు.. మూడోశ్రేణిలో విద్యార్థులు 300కుపైగా ఉన్న పాఠశాలలను చేర్చారు. ఆ యంత్రాల విలువ కూడా ఎక్కువే. సుమారు రూ.3 నుంచి 4లక్షలు ఉంటాయి. నాలుగో శ్రేణిలో 800 నుంచి వెయ్యి మంది ఉండే బడులకు రూ.4.50 లక్షలు విలువ చేసే యంత్రాలు సమకూర్చారు.

**సమస్య పరిష్కరిస్తాం : శంకరయ్య, ఈఈ, సమగ్రశిక్షా విభాగం**

సంబంధిత ప్రధానోపాధ్యాయుల నుంచి ఫిర్యాదులు రావాల్సి ఉంది. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే యంత్రాలు బాగు చేయిస్తాం. విద్యార్థులకు రక్షిత నీరు అందించడానికి తగిన చర్యలు తీసుకుంటాం.

నల్లమాడ మండలం పెమనకుంటపల్లి తండా ప్రాథమిక పాఠశాలకు గతేడాది యంత్రాన్ని ఇచ్చారు. అప్పటి నుంచి దాన్ని ఏర్పాటు చేయకుండా అట్టపెట్టెకే పరిమితం చేశారు. తరగతులు జరుగుతున్నప్పుడు ఉపాధ్యాయులే శుద్ధి జలాన్ని రోజుకో క్యాన్‌ను బయట కొనుగోలు చేసి తెప్పించేవారు.

# పథకం పూర్తవ్వాలా.. గొంతులు తడవాలా!



గుంతకల్లు : గుంతకల్లు మండలంలోని గ్రామాలతో పాటు గుంతకల్లుకు తాగునీటిని అందించడానికి ఉద్దేశించిన రూ.30 కోట్లతో చేపట్టిన భారీ నీటి పథకం నిర్వీర్యమవుతోంది. గండికోట జలాశయం నుంచి పైపుల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నది పథకం ఉద్దేశం. పథకానికి జేసీ నాగిరెడ్డి నీటి పథకమని పేరుపెట్టారు. హడ్కో నిధుల ద్వారా పనులు చేపట్టారు. పామిడి నుంచి గుంతకల్లు వరకు పైప్‌లైన్ ఏర్పాటు పనులు చేపట్టారు. మొత్తం 33 కి.మీ.ల పొడవైన పైప్‌లైన్ పనుల్లో 30 కి.మీ.లు పూర్తి చేశారు. మిగిలిన 3 కి.మీ.ల పనులను గుత్తేదారు పూర్తి చేయలేదు. చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని ఆయన పనులు నిలిపివేశారు.

**దెబ్బతింటున్న నిర్మాణాలు**

నీటి పథకం ద్వారా కదిరిపల్లి, నాగసముద్రం, వెంకటాంపల్లి, నెలగొండ, దోనిముక్కల తదితర గ్రామాలతో పాటు గుంతకల్లుకు నీటిని అందించాల్సి ఉంది. గ్రామాల్లోనే కాకుండా దోనిముక్కల కాలనీలోనూ ఉపరితల ట్యాంకులు నిర్మించారు. పెద్దఎత్తున నీటిని నిల్వ ఉంచి పంపింగ్ చేయడానికి గుంతకల్లు, వెంకటాంపల్లిలో పెద్ద సంపులను నిర్మించారు. వెంకటాంపల్లిలో పంపింగ్ గదులతో పాటు సిబ్బందికి క్వార్టర్సు కట్టారు. ఆయా కట్టడాలన్నీ దెబ్బతింటున్నాయి. ఒక్క దోనిముక్కల ఇందిరమ్మ కాలనీలో మాత్రం నిర్మించిన రెండు ఉపరితల ట్యాంకులను వినియోగిస్తున్నారు. మిగిలిన నిర్మాణాలు, పైపులైన్లు శిథిలమవుతున్నాయి.

**ఇలా చేస్తే 60 వేల మందికి ప్రయోజనం**

గండికోట జలాశయం నుంచి ఇప్పట్లో నీరు వచ్చే పరిస్థితి లేదని, గుంతకల్లు గుండా వెళ్లే హంద్రీనీవా కాలువ నీటి సాయంతో పథకాన్ని వినియోగంలోకి తేవాలని పట్టణ ప్రజలతో పాటు వివిధ గ్రామాలవాసులు కోరుతున్నారు. మిగిలిన పైప్‌లైన్ పనులు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పూర్తిచేసి హంద్రీనీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను తమకు అందించాలని ప్రజలు కోరుతున్నారు. పథకాన్ని వినియోగంలోకి తెస్తే దాదాపు 60 వేల మందికి తాగునీటిని అందించడానికి అవకాశం ఉంటుంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

జేసీ నాగిరెడ్డి తాగునీటి పథకం మూలనపడిన విషయాన్ని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తాం. పథకాన్ని పూర్తి చేయడానికి, ప్రారంభించడానికి నిధులు అవసరం. ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది. నీటిని హంద్రీనీవా కాలువ నుంచి తీసుకోవడానికి ప్రభుత్వం అనుమతులివ్వాలి. ఆదిశగా ప్రయత్నాలు చేస్తాం.

లీలా కృష్ణప్రసాద్, మున్సిపల్ కార్యనిర్వాహక ఇంజినీరు

# పేరుకుపోతున్న నిర్లక్ష్యం!



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లాలోని పురపాలికల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రధానంగా శివారు కాలనీల్లో ఇంటింటా చెత్త సేకరణ ప్రహసనంగా మారింది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అడుగడుగునా నిర్లక్ష్యం వహించడమే ఇందుకు కారణం. పుర కమిషనర్లు సైతం ప్రధాన కాలనీల్లోనే పర్యటిస్తూ శివారు ప్రాంతాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా ఆయా కాలనీల్లో చెత్తాచెదారం కుప్పలుగా పేరుకుపోతోంది. దీనికితోడు కొన్నిచోట్ల కార్మికులే నిబంధనలకు విరుద్ధంగా చెత్తను కాల్చేస్తున్నారు. ఇది స్థానికుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇదిలా ఉండగా మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదు. ఓవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వచ్ఛ ఆంధ్ర పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నా.. క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

**పూర్తి అధికారాలు ఇచ్చినా..** కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్తపన్ను రద్దు చేయడంతో క్లాప్ వాహనాలను వెనక్కి వెళ్లిపోయాయి. స్థానికంగానే చెత్త సేకరణకు ట్రాక్టర్లు, ఆటోలు సమకూర్చుకోవాలని ప్రభుత్వం.. పూర్తి అధికారాలు ఇచ్చింది. అనంతపురం కార్పొరేషన్‌తో పాటు కొన్ని పురపాలికల్లో అద్దె ప్రతిపాదికన ట్రాక్టర్లు తీసుకుని సేకరణ చేస్తున్నారు. ఇంటింటా సేకరణకు ఈ-ఆటోలు, తోపుడుబండ్లు కొనుగోలు చేసి కార్మికులకు అందించారు. పారిశుద్ధ్య కార్మికులు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తుండటంతో సేకరణ ప్రక్రియ సరిగ్గా జరగడం లేదు. అనంతపురం, ధర్మవరం, కదిరి, గుంతకల్లు, హిందూపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం పురపాలికల్లోని శివారు కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ లేకపోవడంతో మురగుకూపాలుగా మారిపోతున్నాయి.

**అంతా ఇష్టారాజ్యంగా..**అనంతపురం కార్పొరేషన్‌లో అధికారుల నిర్లక్ష్యమే శాపంగా మారింది. ప్రస్తుతం 10 ట్రాక్టర్లు ఉండగా.. అద్దె ప్రతిపాదికన మరో 30 ట్రాక్టర్లు తీసుకున్నారు. ఒక్కో దానికి రోజుకు రూ.2100 చెల్లిస్తున్నారు. ఒక్కో వాహనం ద్వారా రోజుకు 1300 ఇళ్ల నుంచి చెత్త సేకరించాల్సి ఉన్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. సేకరణ సరిగా జరగకపోయినా బిల్లులు ఇచ్చేస్తున్నారు. శివారు కాలనీల్లో రెండు, మూడు రోజులైనా శుభ్రం చేయకపోవడంతో చెత్త పేరుకుపోతోంది. ట్రాక్టర్లు వెళ్లలేని ప్రాంతాల్లో తోపుడుబండ్ల ద్వారా సేకరించాల్సి ఉంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ లేకపోవడంతో పలు కాలనీల్లో పరిస్థితి అధ్వానంగా తయారైంది

**కుండీలు పాడైపోయి..**

కళ్యాణదుర్గం పురపాలికలో ఒక ట్రాక్టరు, ఒక కంపాక్టర్, 5 ఆటోలతో చెత్త సేకరణ చేస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శివారు కాలనీల్లోకి వెళ్లడం లేదు. కార్మికులకు విధులు కేటాయించడంలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారు. కుండీలు చాలాచోట్ల పాడయ్యాయి. కొత్తవి ఏర్పాటు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. కమిషనర్ పర్యవేక్షణ కొరవడింది. పురపాలిక పరిధిలోని ఆరు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది.

# మామిళ్లా.. మండీల్లో చోటులేదు

పాకాల : మామిడి రైతు పరిస్థితి ఈ ఏడాది దైన్యంగా మారింది. పక్వానికొచ్చిన దిగుబడులు అమ్ముకుందామంటే అడిగేవారు లేరు. మార్కెట్‌కు తీసుకొచ్చినా మండీల్లో స్థలం లేదంటూ యజమానులు చోటివ్వడం లేదు. ధర వచ్చేవరకు వేచి చూద్దామంటే పండిన కాయలు నిలువునా నేలరాలిపోతున్నాయి. ఎన్నడూ చూడని విచిత్ర పరిస్థితిని మామిడి రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో సుమారు 1.15 లక్షల హెక్టార్లలో మామిడి సాగవుతుండగా రెండు లక్షలకు పైగా కుటుంబాలు ఈ పంట నుంచి వచ్చే ఆదాయంపైనే ఆధారపడుతున్నారు. సాగు కోసం అప్పులపాలైన మామిడి రైతులు ఇప్పుడు పంటను ఒడిపి మార్కెట్‌కు తీసుకురావాలంటే మరింత అప్పుచేయక తప్పడం లేదు. తోతాపురి కాయలు టన్ను కేవలం రూ.6 వేలకే తెగనమ్ముకోవాల్సిన దుస్థితి కొనసాగుతోంది. జిల్లాలోని మామిడి రకాల్లో 60 శాతం పైగా ఇదేరకం సాగు



చేస్తున్నారు. పుల్లూరా రకం కాయలు సైతం రూ.7 వేలకు పడిపోయిన దారుణస్థితి రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. మిగతా రకాల పరిస్థితి సైతం రోజురోజుకూ దిగజారుతోంది. టన్ను తోతాపురి కాయలు కోసి, లోడింగ్ చేసి, రవాణా ఖర్చులతో మార్కెట్‌కు తీసుకొస్తే రూ.1700 ఖర్చవుతోంది. మండీల వద్ద కమిషన్లు పోను టన్నుపై కనీసం రూ.4 వేలు మిగలడం గగనమవుతోంది. ఇది చేసిన అప్పులకు వడ్డీలకు చాలడం లేదు.

**ప్రభుత్వం చొరవ చూపితేనే..**మే పూర్తి కావస్తున్నా జిల్లాలో పలు గుజ్జు పరిశ్రమలు ఇప్పటివరకు తోతాపురి కొనుగోళ్లు ప్రారంభించలేదు. ఇదేమని ప్రశ్నిస్తే గతేడాది గుజ్జు ఇప్పటివరకు అమ్ముడు కాలేదంటున్నారు. కొన్ని పరిశ్రమల యజమానులు లోపాయికారిగా విజయవాడ నుంచి కాయలు తెప్పించుకుంటున్నారు. జూన్ నుంచి ఇక్కడ కొనుగోళ్లు ఉంటాయని భావిస్తున్నా పరిమితంగానే ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు ఉద్యానశాఖ అధికారులు గుజ్జు పరిశ్రమలు, వ్యాపారులతో చర్చలు జరుపుతున్నా ఫలితం కనిపించడం లేదు. ప్రభుత్వం స్పందించి మామిడి రైతులను ఆదుకోవాలని, మార్కెట్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనుగోళ్లు ప్రారంభించాలని మొరపెట్టుకుంటున్నారు.

# హమ్మయ్యా.. ఎట్టకేలకు మోక్షం

పుత్తూరు : తిరుపతి-చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనులు కొన్నింటిని గతంలో అసంపూర్తిగా నిలిపేశారు.. ఈ హైవే 2012లో నిర్మించారు. పలుమార్లు ఈ సమస్యపై కథనాలు ప్రచురితం కావడంతో 2023లో ఎట్టకేలకు పనులు పూర్తి చేయడానికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు రూ.120 కోట్లు మంజూరు చేశారు.. ఈ మేరకు టెండర్లు పిలిచారు.. తదనుగణంగా నేడు పనులు జరుగుతున్నాయి.

పర్యవేక్షణ: ఎన్‌హెచ్ఏఐ

హైవే పరిధి: చంద్రగిరి సమీప కాలూరు క్రాస్ నుంచి పుత్తూరు శివారు మరాఠీ గేటు వరకు(42 కి.మీ.)

పనులివీ..: చంద్రగిరి సమీపంలోని కాలూరు క్రాస్ వద్ద వంతెన, కేవీఎం ఆస్పత్రి సమీపంలో వంతెన, పాదిరేడు, టోల్‌ప్లాజా వద్ద పుత్తూరుల వద్ద రోడ్డు, వంతెనలుబీ గాజులమండ్యం వద్ద రోడ్డు పనులు ప్రారంభించారు.

పురోగతి..: పాదిరేడు, పుత్తూరు వద్ద వంతెన, టోల్‌ప్లాజా, కాలూరు క్రాస్ వద్ద పనులు పూర్తి చేశారు.

కేవీఎం వంతెన వద్ద పనులు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలో ఈ వంతెనపై రాకపోకలు సాగించే అవకాశం ఉంది.

**గ్రామస్థులను ఒప్పించి..**

రెండు తాగునీటి ట్యాంకులు, కింద వంతెన నిర్మించాలని గాజులమండ్యం గ్రామస్థులు పట్టుపట్టడంతో వారిని ఒప్పించి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం వంతెన నిర్మాణం రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువ పనులు సాగుతున్నాయి. ఇవి పూర్తయితే కాలూరు క్రాస్ నుంచి పుత్తూరు మరారీ గేటు వరకు రోడ్డు పూర్తయినట్లే. 13 ఏళ్లుగా ఆగి పనులు పూర్తికావస్తుండటంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఊరట..నిత్యం కేవీఎం వంతెన వద్ద, గాజుల మండ్యం వద్ద ట్రాఫిక్‌తో ప్రజలు, వాహనచోదకులు, ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండూ పూర్తయితే ఇక ట్రాఫిక్ ఇబ్బందులు తీరినట్లే.

# గాజులదిన్నె 'కట్ట'కు కాట్లు

గోనెగండ్ల : పశ్చిమ ప్రాంత జీవనాడి గాజులదిన్నె జలాశయం ఆధునికీకరణ 'కట్ట'కథగా మారింది. గతంలో ఎంతో పటిష్ఠంగా నిర్మించిన డ్యాంను అభివృద్ధి పేరుతో గత వైకాపా పాలనలో విధ్వంసం చేశారు జలాశయంలో ప్రస్తుతం 4.5 టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి వీలుంది. అదనంగా మరో టీఎంసీ నీటిని నిల్వ చేయడానికి పనులు మొదలుపెట్టారు. హంద్రీనీవా నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకురావాలని ప్రణాళిక రూపొందించారు. ఇందుకు రూ.137 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్భాటం చేశారు. ఆనకట్ట మట్టి పనులు, బండింగ్, క్రస్టు గేట్ల ఆధునికీకరణ పనులు మొదలుపెట్టారు. సకాలంలో నిధులివ్వకుండా 'నీరు'గార్చారు. రెండేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించి పనులు ప్రారంభించాలని రైతులు విన్నవిస్తున్నారు.

**ఎక్కడికక్కడ తవ్వేసి వదిలేశారు**ఆరు గేట్ల వద్ద పనులు చేపట్టారు. ఒకటి, రెండు గేట్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. రెండో గేటుకు స్టాప్‌లాక్ గేట్లు అలాగే ఉన్నాయి. మొదటి గేటుకు రోప్ కనెక్షన్, గ్రూవ్స్ తదితర పనులు చేపట్టాల్సింది. నూతనంగా నిర్మాణాలు చేపట్టినా మిగిలిన నాలుగు గేట్ల నుంచి నీరు లీకేజీ అవుతుండటం విశేషం.ఆనకట్ట ఎత్తు పెంపకంలో భాగంగా బండింగ్ రాళ్లు పెకిలించారు. కట్ట పొడవునా ఎక్కడపడితే అక్కడ తవ్వి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయింది. భారీ వరద పోటెత్తితే ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉంది."జలాశయం పనులు నిలిచిపోయింది వాస్తవమే. వారం రోజుల్లో గుత్తేదారుడు పనులు ప్రారంభించేలా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చాయి. ఒకటి, రెండు గేట్లతోపాటు మిగిలిన క్రస్ట్ గేట్ల పనులు పూర్తి స్థాయిలో చేపడతామని" డీఈ విజయ్‌కుమార్ తెలిపారు.

# పోస్టుల భర్తీ ఎన్నడో?

చిత్తూరు : నగరపాలికలో వివిధ క్యాడర్లలో మొత్తం 419 పోస్టులు మంజూరు కాగా దాదాపు రెండు వందలకు పైగా పోస్టులు భర్తీకి నోచుకోలేదు. 2012 జులై 7న చిత్తూరు పురపాలక సంఘాన్ని నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమీప మండలాల్లోని 14 గ్రామ పంచాయతీలను నగరపాలక సంస్థలో విలీనం చేశారు. దీంతో నగరపాలక జనాభా 2.20 లక్షలకు చేరుకోగా.. 48 వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఆస్తి, నీటి పన్నుల రూపంలో నగర ప్రజల నుంచి ఏడాదికి రూ.15 కోట్ల వరకు వసూలు చేస్తుండగా వివిధ నిధులు రూ.60 కోట్ల వరకు నగరపాలక సంస్థకు వస్తున్నాయి. నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ అయినా ఇక్కడ పాలనకు సంబంధించి కీలకపాత్ర పోషించే అధికారులు, ఉద్యోగుల పోస్టులు భర్తీకి నోచుకోకపోవడంతో పాలన గాడితప్పింది. దీంతో ప్రభుత్వ ఫలాలను ప్రజలకు మరింత వేగంగా అందించడానికి అవసరమైన



సిబ్బంది అందుబాటులో లేని దుస్థితి నెలకొంది. ఖాళీలు భర్తీ చేయాలని 2012 నుంచి ఇప్పటివరకు దాదాపు పదేళ్ల పాటు నగరపాలక సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కాదు కదా.. అంతంతమాత్రమే ఉన్న పోస్టులకు సంబంధించి అధికారులు, సిబ్బందికి ఉద్యోగోన్నతి, బదిలీ అయితే వారి స్థానంలో కొత్తవారిని నియమించడంలోనూ జాప్యం చోటుచేసుకుంటోంది.

**ఖాళీలివే..**మేనేజర్ 1, రెవెన్యూ అధికారి 1, అకౌంటెంట్ 1, టీపీఎస్ 2, భవన ఇన్‌స్పెక్టర్లు 4, సహాయ ఇంజినీరు 1, ఉద్యాన అధికారి 1, జనన, మరణ సబ్ రిజిస్ట్రార్ 1, మలేరియా క్షేత్రాధికారి 1, పారిశుధ్య కార్మికులు 143, రికార్డు సహాయకులు 3, టైపిస్టులు 2, వాచ్‌మెన్లు 4, పీవో 1, అకౌంట్స్ అధికారి 1, సీనియర్ స్టెనో 1, సీనియర్ అకౌంటెంట్ 3, జూనియర్ అకౌంటెంట్ 2, సిస్టం మేనేజర్ 1, డీఈవో 1, టీపీ ట్రేసర్ 1, జీఐఎస్ ఆపరేటర్ 1, ఫిట్టర్ 1, టీబీ వాచ్‌మెన్లు 3, గ్యాంగ్ మజ్దూర్ 3, టర్న్‌కాక్ 4, క్లీనర్ 9, ఎలక్ట్రీషియన్లు 5, పంపుసెట్ క్లీనర్లు 3, పీహెచ్ మేస్త్రీ 4, ప్రసూతి సహాయకులు 5, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లు 2, ఆయాలు 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

# అక్రమార్కుల కలప దోపిడీ

తాళ్లూరు : జామాయిల్ వనాలు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. రాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా కొందరు ఈ చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. దొనకొండ నుంచి రుద్ర సముద్రం వెళ్లే దారిలోని కొండ పరిసర ప్రాంతాల్లో సుమారు యాభై ఎకరాల్లో ప్రభుత్వ భూములున్నాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మైలాడ్ సంస్థ ద్వారా దాదాపు పదిహేనేళ్ల క్రితం అక్కడ నేరేడు, గానుగ, వేప, జామాయిల్ మొక్కలు నాటారు. అవి బాగా పెరిగి పెద్దవయ్యాయి. ఆప్రాంతం మొన్నటి వరకూ పచ్చదనంతో కళకళలాడుతుండేది. గతంలో కొందరు అక్రమార్కులు వేప చెట్లను నరికి సొమ్ము చేసుకున్నారు. గత కొంతకాలంగా జామాయిల్ చెట్లను నరికివేస్తున్నారు. వీటికి మంచి ధర పలుకుతుండటంతో రెండు వారాలుగా కలప దొంగలు వందలాది చెట్లను నేలకూల్చారు. రాత్రి వేళ వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. పొగాకు పందిళ్ల ఏర్పాటు, ఇతరత్రా అవసరాలకు ఈ దుంగలు ఉపయోగిస్తున్నారు. ఇప్పటికి సుమారు రూ.లక్షల మేర సంపద తరలిపోయింది. ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి అక్రమ తరలింపులను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై దొనకొండ ఇన్‌ఛార్జి తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# ఎర్రకొండపై విధ్వంసం

ఒంగోలు : మట్టి దొంగలు సహజ వనరులను నంజుకుని తింటున్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు సాగిస్తూ ఇష్టారీతిన నమిలి మింగేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తూ ఇనప్పెట్టెలు నింపుకొంటున్నారు. ఈ క్రమంలో ప్రకృతి మాతకు మానని గాయాలెన్నో మిగిలిస్తున్నారు. భావితరాలకూ భద్రత లేకుండా చేస్తున్నారు. ప్రజల దాహార్తి తీరుస్తున్న రామతీర్థం జలాశయం చెంతనే ఉన్న ఎర్ర కొండలపై అక్రమార్కులు కన్నేశారు నిర్లక్ష్యంతో కొండలు, గుట్టలు కనుమరుగైపోతున్నాయి.

**నగరం.. పట్టణాలు.. గ్రామాలకు నీరు:** చీమకుర్తి మండలంలో ప్రవహించే నాగార్జున సాగర్ కాలువ నీరు ఆధారంగా.. చుట్టూ ఉన్న కొండల ఆసరాతో రామతీర్థం జలాశయం నిర్మితమైంది. ఇక్కడి నుంచి ఒంగోలు నగరపాలక సంస్థ, కందుకూరు, కనిగిరి, చీమకుర్తి పురపాలికలతో పాటు సుమారు 315 గ్రామాల ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుంటుంది. కొండలపై పెరిగిన చెట్లపై ఎన్నో పక్షులు గూళ్లు కట్టుకొని.. జలాశయంలోని చేపలను తింటూ జీవనం సాగిస్తున్నాయి. పచ్చిక బయళ్లలో కుందేళ్లు బతుకుతున్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం పక్షుల కిలకిలరావాలతో ఈ ప్రాంతం ఆహ్లాదంగా ఉంటుంది. పచ్చందాలతో తొణికిసలాడే ఎర్ర కొండలను కొందరు ఇప్పుడు తవ్వేస్తున్నారు. జలాశయానికి వంద మీటర్ల దూరంలోనే పొక్లెయిన్లతో చెట్లను తొలగిస్తూ.. మట్టి తోడేస్తున్నారు.

**ఖజానాకు సమకూరని రూ. కోట్లు:** చీమకుర్తి మండలం బూదవాడ పరిధిలోని ఎర్రకొండ, పల్లామల్లి కొండ, రామతీర్థం పరిసర ప్రాంతాల నుంచి అనుమతులు లేకుండానే రోజూ మట్టి తరలిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు సమకూరాల్సిన సీనరేజీ ఎగ్గొడుతున్నారు. రోజూ 150 టిప్పర్లలో మట్టి అక్రమంగా తరలుతుండగా.. ప్రభుత్వ ఆదాయానికి రూ. 1.01 లక్షల మేర గండి పడుతోంది.విలువ ఏడాదికి రూ.3.68 కోట్లుగా ఉంటుంది.

**ఇవిగివిగో అక్రమార్కుల ఆగడాలు**


బూదవాడ ఎర్ర కొండతో పాటు చీమకుర్తి, ఆర్‌ఎల్‌పురం పరిధిలోని పలు గ్రానైట్ డంప్‌ల నుంచీ ఒంగోలు, సంతనూతలపాడు, చీమకుర్తి తదితర ప్రాంతాలకు మట్టి రవాణా సాగుతోంది.

తాళ్లూరు మండలం వెలుగువారిపాలెం పరిధిలోని కొండల నుంచి ఇదే రీతిలో గ్రావెల్ తరలుతోంది.

పల్లామల్లిలో నాలుగు హెక్టార్లలో మాత్రమే తవ్వకాలకు అనుమతులు పొంది పక్క ప్రాంతాల్లోనూ మట్టిని తోడుతుండటంతో స్థానికులు అడ్డుకున్నారు. రెవెన్యూ, గనుల శాఖ అధికారులు సర్వే చేసి అక్రమ తవ్వకాలు నిర్ధారించారు. అమరావతి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు చేస్తున్న సంస్థ వారు రామతీర్థం జలాశయం వద్ద గల ఎర్రకొండ నుంచి గ్రావెల్ తరలిస్తున్నారు.

ఎవరికీ అనుమతుల్లేవుఅక్రమ తవ్వకాలపై భూగర్భ, గనుల శాఖ జిల్లా అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ.. 'రామతీర్థం జలాశయం చెంత గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి ఎవరికీ అనుమతులు ఇవ్వలేద'ని తెలిపారు. ఒంగోలు వైపు అక్రమంగా మట్టి రవాణా చేస్తుంటే ఒక టిప్పర్‌ను పట్టుకున్నామని చెప్పారు. అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామన్నారు.

# పల్లెల్లో విద్యుత్తు నియంత్రికల చోరీలు



పుత్తూరు : రైతులు పొలం పనులపై దృష్టి పెడుతున్న ప్రస్తుత తరుణంలో జిల్లాలోని పొలాల్లో విద్యుత్తు నియంత్రికలు చోరీకి గురవుతున్నాయి. రైతులు ఆందోళనకు గురవుతుండగా.. అధికారులకు కంటి మీద కునుకులేకుండాపోతోంది. కొత్త నియంత్రికలు ఏర్పాటు చేయడం తలకు మించిన భారమవుతోంది. చోరీల నియంత్రణపై ప్రత్యేక ఏర్పాట్లు చేసినా ప్రయోజనం ఉండడం లేదు.

పూతలపట్టు నియోజకవర్గంలోని ఐరాల మండలంలో రెండు నెలల వ్యవధిలో కొత్తూరు, గాజులపల్లె, జంగాపల్లె, ముదిగోళం గ్రామాల పరిధిలో నాలుగు విద్యుత్తు నియంత్రికలు పగలగొట్టి రాగి తీగలు చోరీ చేశారు.

జీడీనెల్లూరు నియోజకవర్గం పాలసముద్రం మండలంలోని ఆముదాల, శ్రీకావేరిరాజపురం గ్రామాల్లో ఇటీవల 10 రోజుల వ్యవధిలోనే రెండు నియంత్రికలు చోరీకి గురికావడంతో చెరకు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

నగరి నియోజకవర్గంలోని నగరి, విజయపురం, పుత్తూరు మండలంలోని పరమేశ్వరమంగళం పరిధిలోని నియంత్రికలు చోరీకి గురయ్యాయి.

**కొత్తది ఏర్పాటు చేయాలంటే..**

దొంగలు నియంత్రికలోని రాగి తీగను తీసుకుపోయి మిగిలిన భాగాలను అక్కడే వదిలేస్తున్నారు. ఒక్కసారి వీటిని బాగు చేయవచ్చు. ఒక్కోసారి కుదరదు. ఈ చోరీలకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేయాలి. వారు కేసు నమోదు చేయాలి. ఇవన్నీ జరగాలంటే కొన్ని రోజులు పడుతుంది. దీనికి తోడు ఎస్ఈ కార్యాలయంకు వెళితే వారు అనుమతి తీసుకుని జిల్లా కేంద్రంలోని విద్యుత్తు నియంత్రికల కేంద్రంలో డ్రా చేసి తీసుకొచ్చి ఏర్పాటు చేయాలి. దీనికి సుమారు రూ.2.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చవుతుంది.

**నిఘా పెంచాలి**

వేసవి కాలంలో రైతులు పొలాల వైపు వెళ్లరు. సాధారణంగా ఈ సమయంలోనే చోరీలు జరుగుతుంటాయి. ప్రధానంగా తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో చోరీలు ఎక్కువయ్యాయి. రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించే పోలీసులు కాస్త ఏమరుపాటుగా ఉంటున్నారు. దీంతో చోరీలు జరుగుతున్నాయి. పోలీసులు గస్తీ మరింత పెంచాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

# సహకారానికి అపకారం



అనకాపల్లి : నేతల దగ్గర పలుకుబడి ఉంటే చాలు. సహకారం మాటున రూ. కోట్లు కొల్లగొట్టేసినా పర్వాలేదు.. బినామీల పేరిట రుణ బాగోతాలు నడిపినా తప్పులేదు.. రికార్డులు తారుమారు చేసి అందినకాడికి బొక్కేసినా భయం లేదు. అక్రమాలు బయటపడకుండా చేసుకోవచ్చు. విచారణలు ముందుకు వెళ్లకుండా అడ్డుకోవచ్చు. రోలుగుంట మండలం జానకీరాంపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చోటుచేసుకున్న జంతర్ మంతర్ పరిణామాలే ఇందుకు నిదర్శనం. రైతులు ఫిర్యాదులను బుట్టదాఖలు చేసి తుది విచారణ జరగకుండా అడ్డుపుల్లలు వేసి అక్రమార్కులు సవాల్ విసురుతున్నారు. జానకీరాంపురం సొసైటీలో వైకాపా హయాంలో రూ. కోట్లల్లో అవకతవకలకు పాల్పడ్డారు. దీనిపై ఆధారాలతో సహా కలెక్టరుకు రైతులు ఫిర్యాదు చేశారు. డివిజనల్ సహకార అధికారి ప్రాథమిక విచారణలో అక్రమాలు జరిగినట్లు గుర్తించడంతో సహకార చట్టంలోని కీలకమైన 51 విచారణకు ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఆ విచారణ జరపడానికి వీల్లేదంటూ కూటమి నేతలే సిఫార్సు చేయడంతో ఈ విచారణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా నిలిచిపోయింది. అప్పులు తీసుకోకున్నా జప్తు నోటీసులు అందుకున్న బాధితుల గోడును గాలికి వదిలేసి అక్రమార్కులకు అండగా నేతలు నిలవడం గమనార్హం.

ఇలా మొదలుపెట్టి..అలా వెనక్కి.. తొలుత విచారణపై నేతలు ఒత్తిళ్లు తెచ్చినా 'అబ్బే మీ పని మీరు చేయండి, వారి సిఫార్సులతో పనిలేదు' అని సహకారశాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో గతనెలలో జానకీరాంపురం పీఏసీఎస్‌పై 51 విచారణాధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.శ్రీనివాసరావును నియమించారు. ఆయన వెంటనే రంగంలో దిగి బినామీ రుణాల బాగోతం వెలికితీస్తా అంటూ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) సీఈఓకే ముందుగా సమన్లు జారీచేశారు. గత 20 ఏళ్ల రికార్డులన్నీ పట్టుకుని తన ఎదుట హాజరవ్వాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడింది పీఏసీఎస్ సీఈవో అయితే డీసీసీబీ సీఈఓకి సమన్లు జారీ చేయడంపై సంబంధిత శాఖలో చర్చనీయాంశమైంది. ఇంతలోనే ఈ విచారణ జరగకుండా సహకారశాఖ కమిషనరేట్ నుంచే స్టే ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఎక్కడి దస్త్రాలు అక్కడే గప్‌చుప్ అంటూ పక్కనపెట్టేసి వెనక్కి వచ్చేశారు.

**వెలుగు చూసింది కొంతే.. కలుగులో ఉంది ఎంతో..**

గతేడాది మార్చిలో జానకీరాంపురం పీఏసీఎస్‌లో జరిగిన ఆడిట్‌లో రూ. 1.77 కోట్లకు లెక్కలు తేలలేదు. అప్పటికే ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) కృష్ణ బినామీ రుణాల పేరిట రూ.కోట్లలో మింగేశారనే ఫిర్యాదులున్నాయి. దీంతో ఈ సంఘంలో లావాదేవీలను పూర్తిస్థాయిలో విచారణ జరిపితే సీఈఓతోపాటు కలుగులో దాగిన వారంతా బయటకు వస్తారని భావించారు. ఇందుకోసం 51 విచారణకు ఆదేశించగా ఆ నియోజకవర్గ నేత 'అబ్బెబ్బే.. ఆ సీఈఓ మంచోడండీ, అలా చేయడు. విచారణ వద్దు, నిలిపేయండి' అంటూ సంబంధిత మంత్రికి సిఫార్సు లేఖ పంపించారు. ఇదే తడవుగా సహకారశాఖ అధికారులు కూడా విచారణపై మిన్నకుండిపోయారు.

# పల్లె వైద్యానికి 'తాళం'




కర్నూలు : " ఓర్వకల్లు మండలం శకునాలకు చెందిన వృద్ధుడు నాగన్న రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్నారు. ప్రతి నెలా ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)కు వెళ్లి ఔషధాలు తెచ్చుకొంటున్నారు. ఈనెల 26వ తేదీన అక్కడికి వెళ్లారు.. తాళం వేసి ఉంది.. సమీపంలోని సచివాలయంలోకి వెళ్లి ఆరా తీయగా సిబ్బంది సమ్మె చేస్తున్నారు.. ఓర్వకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు.. గ్రామానికి 10 కి.మీ. దూరంలో ఉన్న ఓర్వకల్లుకు వెళ్లలేక ఇతరులకు రూ.500 ఇచ్చి పది రోజులకు సరిపడా మాత్రలు తెప్పించుకొన్నారు."

ఇన్సెంటివ్ ఇవ్వడం లేదని, వేతనాలు పెంచాలని, పని ఒత్తిడి ఎక్కువైందని ఎంఎల్‌హెచ్‌పీలు ఈనెల 17వ తేదీ నుంచి ఆందోళన చేపట్టారు. అప్పటి నుంచి ఆరోగ్య మందిర్‌లకు తాళం పడింది. ఒక్కో కేంద్రంలో నిత్యం 25-30 ఓపీ ఉంటుంది. గ్రామాల్లో దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారు, వ్యాధినిరోధక టీకాలు, చిన్నపాటి జ్వరం బారినపడిన వారు సేవలు పొందుతున్నారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స చేసి అవసరమైతే సమీపంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు రెఫర్ చేస్తుంటారు. పల్లెల్లో వైద్య సేవలు ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. " తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని" ఏపీఎంసీపీ కార్యదర్శి గురుప్రసాద్ పేర్కొన్నారు.సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది సమ్మెలోకి వెళ్లడం.. కేంద్రాలు మూతపడటం.. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో పల్లె జనానికి వైద్య సేవలు దూరమయ్యాయి.

**797 కేంద్రాలు.. 14 రకాల సేవలు**

పల్లె ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడానికి గతంలో ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండేవి. వాటి స్థానంలో కేంద్రం నాలుగేళ్ల కిందట ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)లను తీసుకొచ్చింది. 3-4 వేల జనాభాకు ఒకటి చొప్పున ఉమ్మడి కర్నూలు జిల్లాలో 797 వరకు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో బీఎస్సీ నర్సింగ్ చదివిన వారిని మల్టీలెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)గా నియమించింది. వీరి సమక్షంలో ఒక్కో కేంద్రంలో 14 రకాల వైద్య సేవలు అందజేయాలి. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు వీరికి సహకారం అందిస్తుంటారు.

**ప్రత్యామ్నాయ ఏర్పాట్లు విఫలం**

ఎంఎల్‌హెచ్‌పీల ధర్నా నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా సచివాలయ ఏఎన్ఎంలు వారి స్థానంలో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశించింది. హెల్త్ క్లినిక్‌లలో ఎంఎల్‌హెచ్‌పీల స్థానంలో ఏఎన్ఎంలు పనిచేయాలి అంటున్నారు తప్ప ఇంతవరకు ఒక్క ఉత్తర్వు ఇవ్వలేదు. దీంతో సచివాలయ ఏఎన్ఎంలు విలేజ్‌హెల్త్ క్లినిక్‌లతో సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. దీన్ని జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందక పల్లె ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ చూపి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సినవసరం ఉంది. " సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని" డీపీఎంవోయూ డా.ఉమ తెలిపారు.

# వరి.. మిగిల్చింది వర్రీ

రుద్రవరం : ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిని సాగు చేసిన రైతులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నారు. అధిక వర్షాలతో పంట దిగుబడి తగ్గి మార్కెట్ ధర లేక ఇబ్బందుల పాలయ్యారు. దిగుబడులను అమ్మగా వచ్చిన సొమ్ము పెట్టిన పెట్టుబడులకే సరిపోగా చేసిన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కలేదు. కనీసం రెండో పంటైనా పండి తమ కష్టాలను తీరుస్తుందేమోనని ఆశగా రబీలోనూ వరి సాగు చేయగా అకాల వర్షాలతో పంట దెబ్బతింది. అదనపు ఖర్చులు భారంగా మారాయి.

**జిల్లాలో 37వేల హెక్టార్లలో వరిసాగు**

జిల్లాలో ఎక్కువగా కర్నూలు సోనా, నంద్యాల సోనా వరి రకాలు అధికంగా సాగైంది. ఖరీఫ్‌లో వరి పంట సాధారణ సాగు విస్తీర్ణం 65,787హెక్టార్లు కాగా 66,364హెక్టార్లలో సాగైంది. రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 27,908హెక్టార్లు కాగా.. 37వేల హెక్టార్లలో సాగైంది. రబీలో సాధారణం కంటే 10వేల హెక్టార్లు ఎక్కువగా సాగైంది.



**పెరిగిన పెట్టుబడి**

రబీలో వరి సాగుకు ఎకరాకు రూ.30వేల నుంచి రూ.35వేల వరకు పెట్టుబడి ఖర్చులు పెట్టారు. వానకారుతో పోలిస్తే ఎండకారులో ఎకరాకు అదనంగా రూ.5వేలు నుంచి రూ.6వేలు ఖర్చైంది. మూడుసార్లు ఎరువులు చల్లాల్సి వచ్చింది. అకాల వర్షాలకు పైరు నేలవాలుతుండటంతో కట్టలు కట్టి నిలబెట్టుకునేందుకు ఎకరాకు రూ.2వేలకు పైగా కూలీ ఖర్చులు అదనంగా పెట్టాల్సి వచ్చింది. యంత్రంతో పంట కోతకు ఎకరాకు గంటన్నర సమయానికి రూ.3వేలు కాగా నేలవాలిన పైరును యంత్రంతో కోత కోసేందుకు 3గంటల సమయం పడుతుండటంతో రూ.6వేలు కోత ఖర్చు వచ్చింది. నేలవాలిన పైరు వల్ల గింజ రాలిపోయి దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 30నుంచి 35బస్తాలే వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్ ధర బస్తా (77కిలోలు)రూ.1280నుంచి రూ.1300మాత్రమే ఉంది. ఖరీఫ్‌లో బస్తా రూ.1400ఉండగా రబీలో మరింత తగ్గింది. పెరిగిన పెట్టుబడి ఖర్చులు, అదనపు ఖర్చులతో ఇప్పుడు ఉన్న మార్కెట్ ధర ఏమాత్రం గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు.

**ఏమీ మిగల్లేదు- వెంకటేశ్వర్లు, రైతు, కోవెలకుంట్ల**

రబీలో సొంత పొలం ఐదెకరాలు, కౌలుకు మరో 15 ఎకరాలు తీసుకొని వరి సాగు చేశా. ఖరీఫ్‌లో వచ్చిన దిగుబడులు అమ్మితే పెట్టిన పెట్టుబడులకే సరిపోయింది. ఎండకారు పంటైనా ఆదుకుంటుందని అనుకుంటే పెట్టుబడి ఖర్చులు పెరిగి ఎకరాకు 30నుంచి 35బస్తాలు దిగుబడి వచ్చాయి. మార్కెట్‌లో ధరలు తగ్గడంతో ఇప్పుడు కూడా ఏమీ మిగలడం లేదు.


# యూనిట్ మూత.. రైతు నెత్తిన మోత

బొబ్బిలి : ఉమ్మడి జిల్లాలోని పాడి రైతులకు నాణ్యమైన పశుగ్రాస విత్తనాలు రాయితీపై ఇచ్చేందుకు రామభద్రపురంలో ఏర్పాటు చేసిన పశుగ్రాస విత్తన తయారీ యూనిట్ మూలకు చేరింది. ఫలితంగా రైతు నెత్తిన విత్తన భారం పడింది. మరోపక్క రూ.కోట్లు విలువైన స్థలానికి రక్షణ కరవైంది. భవనాలు, మోటార్లు, ఇతర సామగ్రి పాడైపోతున్నాయి. ఈ యూనిట్ను అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

**ప్రధాన ఉద్దేశం:** పాడి సంపదను ప్రోత్సహించేందుకు, ఉమ్మడి జిల్లాలోని పాడి రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలు ఇచ్చేందుకు రామభద్రపురం మండలం కొట్టక్కి వద్ద జాతీయ రహదారి పక్కన సుమారు నాలుగు ఎకరాల స్థలంలో విత్తనాభివృద్ధి క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ తయారు చేసిన నాణ్యమైన విత్తనాలను రాయితీపై తక్కువ ధరకు అందించేవారు.

**అదనపు బాదుడు:** జిల్లాలో పాడికి ప్రసిద్ధి రామభద్రపురం మండలం. సాలూరు, మక్కువ, బలిజిపేట, బాడంగి, రామభద్రపురం, బొబ్బిలి, తెర్లాం మండలాల్లో పాడి ఎక్కువగా ఉంది. చాలామంది రైతులు వీటిపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం కిలో గడ్డి విత్తనం ధర మార్కెట్లో రూ.200 ఉంది. అదే విత్తన తయారీ యూనిట్ ఉంటే సగం ధరకే అందేవి. అంతేకాకుండా నాణ్యమైనవి కావడంతో గడ్డి బాగా పెరిగి, పాల ఉత్పత్తి మెరుగుగా ఉండేది.

**ప్రస్తుత పరిస్థితి:** 15 ఏళ్ల క్రితం యూనిట్లోని మోటార్లు చిన్నపాటి మరమ్మతులకు గురికావడంతో మూసివేశారు. దీంతో భవనం శిథిలావస్థకు చేరింది. నేలబావులు, మోటార్లు పాడయ్యాయి. స్థలం చుట్టూ కంచె లేదు. దీంతో ఆక్రమణకు గురవుతోంది. మోటార్లు



ఎత్తుకుపోతున్నాయి. కొంతమంది చిన్న చిన్న షెడ్డులు ఏర్పాటు చేసుకుని, వ్యాపారాలు చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకున్న పరిస్థితి లేదు. సుమారు రూ.30 లక్షలు కేటాయిస్తే యూనిట్ తెరుచుకునే అవకాశం ఉంది.

**ధరలు పెరిగిపోయాయి:** పాడి రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేదు. విత్తనం నుంచి దాణా వరకు ధరలు పెరిగిపోయాయి. ముఖ్యంగా వేసవి కాలంలో పశుగ్రాసానికి ఇబ్బందులు వస్తున్నాయి. ప్రభుత్వం గతంలోలా నాణ్యమైన విత్తనాలు అందిస్తే బాగుంటుంది.వి.రామ్మూర్తి, రైతు, రామభద్రపురం

ప్రభుత్వం దృష్టికి: ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. కొత్త సామగ్రి కొనుగోలుకు నిధులు అవసరం. యూనిట్ తెరిస్తే పాడి రైతుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

విష్ణు, ఏడీ, పశుసంవర్ధకశాఖ, బొబ్బిల

చురకలు



# మా భూములకు రక్షణ ఏదీ?



ఆత్మకూరు : గత వైకాపా పాలనలో భూముల వివరాలను తమకు ఇష్టం వచ్చినట్లు అధికారులను బెదిరించి, ప్రలోభాలకు గురి చేసి మార్పులు చేశారు. కేవలం వైకాపాకు చెందిన వారికే భూ సమస్యలను పరిష్కారం చేశారు. ఎంతోమంది తెదేపా కార్యకర్తలు భూముల సమస్యలు ఉన్నప్పటికీ వాటిని సరిచేసుకోలేక నరకయాతన పడుతున్నామని బాధితులు వాపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చినా బాధలు తప్పలేదని బాధితులు వాపోతున్నారు.

**రికార్డుల్నే మార్చేస్తారా?**

ఆత్మకూరు మండలం వడ్డుపల్లి గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ నాగభూషణంతో రెండు రోజుల క్రితం వాగ్వాదానికి దిగారు. గ్రామానికి సంబంధం లేని వ్యక్తులకు తమ భూములు ఎలా చేయిస్తారంటూ మండిపడ్డారు. 20 సంవత్సరాల క్రితం తమకు రిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ తప్పుడు పత్రాలు సృష్టించిన వ్యక్తికి అనుకూలంగా రికార్డులు మార్చడం తగదన్నారు. కేవలం ఉన్నవారు ఇచ్చిన మామూళ్లకు పనులు చేస్తే పేద ప్రజలు ఎలా బతుకుతారు.. ఉన్న భూములు వదిలేసి వెళ్లాలా? అని ప్రశ్నించారు. కేవలం ఆర్‌ఐ తప్పిదంతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే స్థితికి వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కనీస సమాచారం ఇచ్చేదెవరు?**

వై.కొత్తపల్లికి చెందిన ఎల్లమ్మకు పి.యాలేరు రెవెన్యూ సర్వేనంబరు 180లో 5.02 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించారు. తరువాత ఆ భూమిని మరొకరు రిజిస్ట్రేషన్ చేయించారు. నాటి నుంచి డబుల్ రిజిస్ట్రేషన్ ఉందటూ అధికారులు ఆన్‌లైన్ చేయలేదు. రెండోసారి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తి పేరు మీదకు 2018లో ఆన్‌లైన్ చేశారు. నాటి నుంచి ఎల్లమ్మ తమ కుటుంబసభ్యులతో నిత్యం కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. చెవిలో ఉన్న కమ్మలు సైతం తాకట్టు పెట్టి తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# కరవుతో 'పాడి'పోయింది!



పుట్టపర్తి: కరవు.. శ్రీసత్యసాయి జిల్లాలో పాడిపరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపింది. పశుగ్రాసం కొరత ఫలితంగా పశుపోషణ తగ్గింది. ఫలితంగా గేదెలు, ఆవులు సంఖ్య తగ్గుముఖం పట్టింది. జిల్లాలో గత ఆరు నెలలుగా పశుసంవర్ధక శాఖ పశుగణన (సర్వే) నిర్వహించింది. ఈనెల 15న ముగిసిన సర్వేలో 5,34,979 కుటుంబాల నుంచి గేదెలు, ఆవులు, గొర్రెలు, కోళ్లు, పందులు, గుర్రాలు, పక్షులు సహా 16 రకాల పెంపుడు జంతువుల వివరాలు సేకరించి నమోదు చేశారు. 2019 పశు గణనతో పోలిస్తే పాడి పశువు సంఖ్య తగ్గినట్లు వెల్లడైంది.

**తగ్గుదల ఇలా..:** జిల్లాలో గేదెలు, ఆవులు సంఖ్య 8 శాతం తగ్గింది. ఫలితంగా పాల ఉత్పత్తి తగ్గి.. ధరలు పెరిగాయి. రూ.45 - 50 మధ్య ఉన్న లీటరు పాలు ప్రస్తుతం రూ.70కు పైగానే పలుకుతోంది.

**జీవాల పెంపకంపై ఆసక్తి**

గొర్రెలు, మేకల పెంపకంపై రైతులు, వ్యవసాయ కూలీలు ఆసక్తి కనబరిచారు. దీంతో వాటి పెరుగుదల 45 శాతంగా నమోదైంది. అదేవిధంగా కోళ్లు 11 శాతం పెరిగాయి.

**నిర్లక్ష్యం చేయడంతో..**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాడిపరిశ్రమకు చేయూత ఇవ్వలేదు. రాయితీతో పశుగ్రాసం విత్తనాలు, పెంపకానికి ఉపాధి నిధులివ్వలేదు. ఇది పాడిరైతులపై తీవ్ర ప్రభావం చూపింది. దీనికితోడు కరవు పరిస్థితులు తలెత్తి గడ్డి కొరత ఏర్పడింది. పశుబీమా పరిహారం కూడా మంజూరు చేయలేదు. గోకులం షెడ్ల నిర్మాణం చేపట్టిన వారికే బిల్లులు ఇవ్వలేదు. పాడిపశువులు విక్రయించి రైతులు కూలీ పనులకు వెళ్తున్నారు. ఫలితంగా పశు సంపద తగ్గుముఖం పట్టింది.

**రీసర్వేలో తప్పిదాలకు ఆస్కారం వద్దు**

ధర్మవరం: ఎలాంటి తప్పిదాలు జరగకుండా భూముల రీసర్వే నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ధర్మవరం ఆర్‌డీఓ కార్యాలయంలో రీసర్వేపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వే నిర్వహించేటప్పుడు స్థానికంగా తలెత్తే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్‌డీఓ మహేశ్, తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

**ఈవీఎం గోదాము తనిఖీ**

ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో ఉన్న ఈవీఎం గోదామును మంగళవారం జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ తనిఖీ చేశారు. గోదాముల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల గోడలు బీటలు ఏర్పడటంతో వాటిని మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షం నీరు గోదాములోకి రాకుండా సరైన చర్యలు చేపట్టాలన్నారు. మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న పౌరసరఫరాల గోదాము తనిఖీ చేశారు.

**ప్రభుత్వానికి నివేదించాం**

శుభదాస్, ఏడీ, పశుసంవర్ధకశాఖ, పుట్టపర్తి

జిల్లాలో అఖిల భారత పశు గణన సర్వే పూర్తయ్యింది. గణాంక వివరాలు ప్రభుత్వానికి నివేదించాం. జిల్లాలో పశుసంపద తగ్గినప్పటికీ గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం పెరిగింది. ఆదాయంపై పశుపోషకులు దృష్టి సారిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో పశు సంపద పెరిగే అవకాశం ఉంది.

# నిర్మించారు.. వదిలేశారు

పుత్తూరు: రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని శీతల గిడ్డంగి(కూలింగ్ ఛాంబర్) నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం 2015లో నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో పుత్తూరు, పాకాల, బంగారుపాళ్యం, వి.కోట, పలమనేరు, పుంగనూరు మార్కెట్ యార్డుల్లో కూలింగ్ ఛాంబర్లు నిర్మించారు. ఈ పనులను బెంగళూరు చెందిన గుత్తేదారుడు దక్కించుకున్నారు. అయితే అతని నుంచి అనంతపురానికి చెందిన వారు సబ్‌లీజు తీసుకుని నిర్మాణం చేపట్టారు. పుత్తూరు, బంగారుపాళ్యం మార్కెట్‌యార్డుల్లో నిర్మాణం చేపట్టిన నాటి నుంచి నిరుపయోగంగానే ఉన్నాయి. దీంతో ఇక్కడ పండ్లు మాగబెట్టేందుకు గానీ, ఆపిల్ పండ్లు నిల్వ చేసేందుకు వీలుకాని పరిస్థితి. దీంతో అద్దెకు తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వ ఆశయానికి గండిపడింది. ఒక్కో ఛాంబర్‌లో 20 టన్నుల వరకు నిల్వ చేసుకోవచ్చు. పండ్లు మాగబెట్టేలా వీటిని



నిర్మించారు. పుత్తూరు ఛాంబర్ రూ.40 లక్షలు, బంగారుపాళ్యం కూలింగ్ ఛాంబరుకు రూ.33 లక్షలు, పాకాల యార్డులో రూ.40 లక్షలతో నిర్మాణం చేపట్టారు. ఈ మూడు శీతల గిడ్డంగులు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. ఈ ఛాంబర్లలో ఇథలిన్ గ్యాస్‌తో మామిడి, అరటి, సపోటా మాగబెట్టుకోవచ్చు. కూలింగ్‌తో ఆపిల్ పండ్లు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. జిల్లాలో మిగిలిన చోట్ల నిర్మించిన కూలింగ్ ఛాంబర్లలో చింతపండు, టమాటాలు నిల్వ చేస్తున్నారు.

**ప్రజల ఆరోగ్యం కోసమే**

గతంలో కార్బైడ్ వినియోగించి పండ్లు మాగబెడుతున్నట్లు ఆకస్మిక దాడుల్లో గుర్తించారు. ఈ పండ్లు తిన్న ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నట్లు విచారణలో తేలింది. డాక్టర్లు, శాస్త్రవేత్తలు సైతం ఇథలిన్ గ్యాస్‌తో మాగబెట్టిన పండ్లు తినవచ్చని సూచించారు. ఈ నేపథ్యంలో కేంద్రం నిధులు మంజూరు చేసింది. వాటితో కూలింగ్ ఛాంబర్లు నిర్మించారు. అయితే ప్రభుత్వం శీతల గిడ్డంగులను స్థానిక మార్కెట్‌యార్డుల్లో నిర్మించి అద్దెకు ఇవ్వడం ద్వారా అటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు, ఇటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చునేది ప్రభుత్వ ఉద్దేశం. ప్రస్తుతం మామిడి సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వాటిని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

# గుత్తి జంక్షన్ శివారులో.. దడ!

గుత్తి: రైలు ప్రయాణికుల భద్రతను పోలీసులు గాలికి వదిలేస్తున్నారు. తరచూ దోపిడీలు జరుగుతున్నా నిలువరించే దిశగా గట్టి ప్రయత్నాలు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా రాత్రిళ్లు స్టేషన్ల శివారులో రైళ్లు ఆపినప్పుడు దుండగులు పక్కా వ్యూహంతో దోపిడీలకు తెగబడుతున్నారు. గుత్తి జంక్షన్ శివారులో సోమవారం అర్ధరాత్రి దాటక జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం. గుత్తి-పెండేకల్లు మార్గంలో ప్రయాణికులు హడలిపోతున్నారు.

నాలుగేళ్ల కిందట మూడుసార్లు ఒకే చోట దోపిడీలు జరిగాయి. తాజాగా నిజామాబాద్ నుంచి తిరుపతికి వెళుతున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో దుండగులు రెచ్చిపోయారు. ఐదేళ్లల్లో ఇప్పటి వరకు గుత్తి జంక్షన్ శివారులోని పెండేకల్లు మార్గంలో నాలుగుసార్లు దోపిడీకి పాల్పడ్డారు. ప్రయాణికులు గాఢనిద్రలోకి జారుకున్నప్పుడే బోగీల్లోకి చొరబడుతూ బంగారం, నగదును ఎత్తుకెళ్తున్నారు.



**రెండు ప్లాట్‌ఫాంలు అసంపూర్తిగా..**

ప్రధానంగా రాత్రిళ్లు గుత్తి-పెండేకల్లు మార్గంలో వెంకటాద్రి, ఎగ్మోర్, కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లతోపాటు వారాంతపు రైళ్లు తిరుగుతుంటాయి. గుత్తి జంక్షన్‌లో రెండు ప్లాట్‌ఫాంలు అందుబాటులో ఉన్నాయి. మరో రెండు అసంపూర్తిగా ఉన్నాయి. అర్ధరాత్రి దాటిన తరువాత గుత్తి-బెంగళూరు మధ్య ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తుంటాయి. రెండు లైన్లలో రైళ్లు ఉన్నప్పుడు ఆపరేటింగ్ అధికారులు శివారులో నిలుపుతున్నారు. ఇదే దోపిడీలకు ఆస్కారంగా మారింది. ఏడాది కిందట తురకపల్లి రైల్వేస్టేషన్ వద్ద దుండగులు సిగ్నళ్ల తీగలను కత్తిరించడంతో రైలు ఆగిపోయింది. తరువాత దోపిడీకి పాల్పడ్డారు. జక్కలచెరువు స్టేషన్ సమీపంలోనూ ఇలానే జరిగింది.

# 'కుట్టు'కథలు

చిత్తూరు : ప్రభుత్వం అవకాశమిచ్చినా ఎమ్మెల్యేల నిర్లక్ష్యం మహిళల జీవనోపాధి కల్పనకు అవరోధంగా మారింది. కొన్నిచోట్ల నామమాత్రంగా శిక్షణ కేంద్రాలు తెరుచుకున్నా, ఎంపిక చేసిన అన్ని కేంద్రాలు ఇంకా తెరుచుకోలేదు. శిక్షణ కేంద్రాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యేలు సమయం కేటాయించకపోవడంతో అధికారులు వారిని సంప్రదిస్తుండగా, రిజిస్ట్రేషన్ చేయించుకున్న మహిళలు నిరీక్షిస్తున్నారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల పరిధిలో 23 కేంద్రాలను గుర్తించి నెల రోజులు గడుస్తున్నా ఇంకా 10 చోట్ల శిక్షణ ప్రారంభం కాలేదు.

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 5555 మందికి మొదటి విడతలో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 23 కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో 13 కేంద్రాల్లో మాత్రమే శిక్షణ ప్రారంభించారు. మొత్తం 6781 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 2505 మంది వివరాలను మ్యాపింగ్ చేయగా, ఇంకా 4276 మంది మ్యాపింగ్ చేయలేదు.

**ప్రారంభం కాని కేంద్రాలివే..** పలమనేరు, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణిలో మూడు కేంద్రాలను కేటాయించారు. వీటిలో శిక్షణకు 618 మంది మహిళలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నా ప్రారంభించలేదు. జీడీ నెల్లూరు నియోజకవర్గంలో కార్వేటినగరం, పెనుమూరు, ఎస్.ఆర్.పురంలో శిక్షణ కేంద్రాలను ఎంపిక చేయగా, ఎస్.ఆర్.పురంలో మాత్రమే శిక్షణ ప్రారంభించారు. ఇలా జల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇంకా శిక్షణ కేంద్రాలను ప్రారంభిచాల్సి ఉంది.

**అన్నిచోట్లా త్వరలోనే ప్రారంభిస్తాం**

జిల్లాలో నియోజకవర్గాల వారీగా శిక్షణ కేంద్రాలను ఎంపిక చేశాం. 13 చోట్ల శిక్షణ ప్రారంభించాం. మిగిలిన చోట్ల స్థానిక ఎమ్మెల్యేలు తేదీలను ఖరారు చేస్తే త్వరలోనే శిక్షణ ప్రారంభిస్తాం.

శ్రీదేవి, ఈడీ, బీసీ కార్పొరేషన్

# సాగు రెట్టింపు.. దిగుబడులున్నా నిరాశే



పుంగనూరు : తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు టమాటా ఎగుమతుల్లో చిత్తూరు జిల్లా టాప్. అక్కడి పట్టణాల అవసరాలను 70 శాతం ఇక్కడి మార్కెట్లే తీరుస్తాయి. ఏటా ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు టమాటా సీజన్. ప్రస్తుతం నవంబరు, డిసెంబరు వరకు ఉంటుంది. అధిక మంది వేసవిలో దిగుబడులు వచ్చేలా సాగు చేస్తారు. అక్కడ పంట లేక ఇక్కడ మంచి ధరలు పలుకుతాయి. ఊహించని విధంగా ఈ ఏడాది అక్కడి మార్కెట్లకు స్థానిక టమాటా రావడంతో పశ్చిమ ప్రాంత మార్కెట్లు వెలవెలబోతున్నాయి.

వాతావరణం అనుకూలించడంతో రైతులు గతేడాది కంటే అధికంగా పంట సాగు చేశారు. 2024లో 1100 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ దఫా 2,250 ఎకరాలకు పెరిగింది. అకాల వర్షాలు లేకపోవడంతో దిగుబడి సైతం గణనీయం వచ్చింది.

**రూ.150 మించని బాక్స్ ధర..** గత సీజన్‌లో ఆయా మార్కెట్లలో టోకు ధర సరాసరి రూ.25-30తో 15 కిలోల బాక్స్ రూ.250-300 మధ్య కొనుగోలు చేశారు. ప్రస్తుతం తమిళనాడు, కర్ణాటక మార్కెట్లకు స్థానిక సరకు వస్తుండటంతో వ్యాపారులు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది గత నెల రోజులుగా మూడు మార్కెట్లలోనూ కిలో రూ.10 లోపే పలుకుతోంది. 15 కిలోల బాక్స్ రూ.150 మించలేదు.

మే చివరకు పరిస్థితి మారే అవకాశం.. మూడు మార్కెట్లకు రోజుకు 1,100 నుంచి 1,200 టన్నుల సరకు వస్తుంది. తమిళనాడు, కర్ణాటకతో పాటు కోల్‌కతా, దిల్లీ, విశాఖపట్నం, శ్రీకాకుళం, అనకాపల్లి ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. ఆయా ప్రాంతాల్లో కోతలు ఇప్పటికే చివరి దశకు వచ్చాయని, ఇక్కడ ప్రస్తుతం మొదటి దశలో ఉన్నాయని.. మే చివర, జూన్‌లో ధరలు పెరగొచ్చని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

ఇంట్లో వాళ్లమే కోస్తున్నాం: రామకృష్ణ, టమాట రైతు, కురపల్లె

రూ.7.50 లక్షలతో మూడు ఎకరాలు సాగు చేశా. ధర తక్కువగా ఉండటంతో కూలీలను పెట్టకుండా ఇంట్లో వాళ్లమే కోస్తున్నాం. ఇప్పటి వరకు మూడు కోతల్లో రూ.15 వేలు మిగిలింది. కూలీలను పెడితే ఖర్చులు కూడా దక్కే అవకాశం లేదు.

**తోటలో వదలలేక..: మోహన్ నూనెముద్దలపల్లె**

రూ.లక్షలు వెచ్చించి సాగు చేసిన తోటలో కోతలు పడ్డాయి. ధరలు లేవని వదల్లేక కోస్తున్నాం. నాలుగు ఎకరాలకు రూ.12 లక్షలు ఖర్చు చేశా. ఇప్పటి వరకు రూ.40వేలు వచ్చింది. రూ.10 లక్షలు నష్టపోయే పరిస్థితి.

# నాటుకోళ్ల పెంపకం.. నిశ్చింతగా ఆదాయం



పరిగి : పరిగికి చెందిన భరత్‌రెడ్డి బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం విధుల్లో ఉన్నాడు. ప్రత్యామ్నాయ ఆదాయంలో భాగంగా తల్లిదండ్రులు, తోటి మిత్రుల ప్రోత్సాహంతో తిరుమలదేవరపల్లి గ్రామ సమీపంలో ఉన్న తనకున్న ఫాం హౌస్‌లో నాటు కోళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టాడు. అనుకున్నదే తడువుగా కోళ్ల పెంపకానికి అనువైన షెడ్డును నిర్మించాడు. పట్టుపురుగులు పెంచే రేరింగ్ షెడ్డుకు ఆనుబంధంగా రూ.2 లక్షలతో రేకుల షెడ్డును ఏర్పాటు చేసుకున్నాడు.

**బరువుకు తగ్గ రాబడి** 250 గ్రాములున్న కోడిపిల్లను మూడునెలలు పాటు పెంచితే ఒక్కోటి ఒకటిన్నర కిలో నుంచి రెండు కిలోల వరకు బరువు తూగుతుం దన్నారు. రోగాలు, ఇతర కారణాలతో 100 కోళు చనిపోయినా మిగిలిన 400 వందల కోళ్లను కిలో రూ.350లతో విక్రయించి రూ.2.80 లక్షలు రాగా, దాణా ఖర్చులు రూ.50 వేలు పోతుంది. ఇదంతా కేవలం మూడు నెలల్లో వచ్చే ఆదాయం.

**తమిళనాడు నుంచి కోడిపిల్లలు**

తమిళనాడు రాష్ట్రం ధర్మపురి నుంచి 500 వరకు నాటు కోడిపిల్లలను ఒక్కోటి రూ.105లతో కొనుగోలు చేశారు. వీటిని షెడ్డులో ఉంచి గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. మొక్కజొన్న, తెల్లజొన్న, స్నేహ తదితర రకాల కోళ్ల దాణాతో పాటు, వృథాగా మిగిలిపోయిన టమోటా, ఆకు కూరలను తెచ్చి కోళ్లకు మేతగా వేస్తుంటారు.

**తక్కువ పెట్టుబడులతో..** నాటు కోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తోంది. మూడు నెలల పాటు నాటు కోళ్లను పెంచితే శ్రమకు తగ్గ ప్రతిఫలం లభిస్తుంది. నెలకు రూ.74వేలు చొప్పున ఆర్జించవచ్చు. ప్రతి యువ రైతులు నాటు కోళ్ల పెంచేందుకు చొరవ తీసుకుంటే లాభాలు గడించవచ్చు.

భరత్‌రెడ్డి, పరిగి

# నాణ్యతకు గోరీ.. నామమాత్రం రికవరీ

నంద్యాల : పల్లె పనుల్లో నాణ్యత తప్పింది.. నాణ్యతా విభాగం అధికారులు వందల కేసులు నమోదు చేశారు.. పనులు చేపట్టిన గుత్తేదారుల వద్ద డబ్బులు వసూలు చేయాలని ఆదేశించారు.. కానీ పంచాయతీ రాజ్ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన-3, నాబార్డు, ఈఏపీ, ఏఐబీ పనులు, ఉపాధి హామీ పథకం కింద అంతర్గత రహదారులు, పల్లె పండగలో భాగంగా సీసీ రోడ్లు, జడ్పీ జనరల్ ఫండ్స్, 15 శాతం ఎస్సీ ఈఎంఎఫ్, 23 శాతం జడ్పీ జనరల్ ఫండ్స్, పీఆర్ రోడ్ల పునర్నిర్మాణం, ఏపీఆర్ఆర్‌పీ, పీఎంజీఎస్‌వై నిధులతో వివిధ రకాల పనులు చేపట్టారు. వీటిలో తారు రహదారులు, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, భవనాలు, అంతర్గత రహదారులు, పంట కాల్వలు ఉన్నాయి. వాటిలో నాణ్యత లోపించినట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు.

**పట్టించుకోని ఏఈలు**

కర్నూలు, ఆదోని, పత్తికొండ, కోడుమూరు, ఆలూరు, ఎమ్మిగనూరు, నంద్యాల, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, బనగానపల్లిలో పంచాయతీరాజ్ నాణ్యతా నియంత్రణ విభాగం సబ్ డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రతి సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న పనులను ఏఈలు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. పనుల నమూనాలు సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలి. నాణ్యత లేనట్లు తేలితే ఆ పనులు చేసిన వారిపై కేసులు నమోదు చేసి డబ్బుల రికవరీకి ఆదేశించాలి.

రికవరీ చేసే బాధ్యత ఏఈలపై ఉండగా వారు పట్టించుకోవడం లేదు. పర్యవేక్షించాల్సిన డీఈలు శ్రద్ధపెట్టడం లేదు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4,594 కేసులు నమోదు చేస్తే ఇప్పటి వరకు 1323 కేసులకు సంబంధించి మాత్రమే రికవరీ జరిగింది. మరోవైపు ఆ పనులకు బిల్లులు చకాచకా చేస్తున్నారు. కేసులతో సరి పెట్టారు. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో గోస్పాడు,



నంద్యాల మండలాల్లో 32 కేసులు నమోదు చేశారు. రూ.2.25 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు రూ.25 వేలు వసూలైంది. మహానంది మండలం గోపవరం, అబ్బీపురం, మహానంది, గాజులపల్లెలో 12 పనులపై కేసులు నమోదు చేసినా రికవరీ జరగలేదు. గోస్పాడు మండలంలో ఆరు నెలల కిందట గ్రామ పంచాయతీల తీర్మానం లేకుండానే కొన్ని ఉపాధిహామీ పనులు ఏకపక్షంగా చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకుండానే ఈ పనులు జరిగిపోయాయి. ఇటీవల పనులు పరిశీలించిన నాణ్యతా విభాగం అధికారులు నాలుగు పనుల్లో అక్రమాలు జరిగినట్లు నివేదించారు. ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదు.

డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల మండలంలోని యంబాయి, రామళ్లకోట, రుద్రవరం, సిమెంట్ నగర్‌లో జరిగిన పనుల్లో మూడింటిపై కేసులు నమోదు చేశారు. రికవరీ చేసింది 10 శాతం లోపే. కొత్తపల్లి మండలంలో 12 కేసులకు 9, వెలుగోడులో 16కు 2, ఆత్మకూరు మండలంలో 14కు గాను 3 కేసుల్లో గత ఆర్థిక సంవత్సరంలో రికవరీ జరిగింది. మహానందిలో ఈ రోడ్డును నాసిరకంగా నిర్మించారని నాణ్యతా విభాగం అధికారులు తేల్చారు.

## జాక్ పిల్ల గ్లామర్ డోస్.. కెవ్వు కేక

తెలుగు యూట్యూబ్ ప్రపంచం నుంచి తెరపైకి వచ్చి, కాస్త ఆలస్యంగా అయినా తన కెరీర్‌ను స్టేడిగా సెట్ చేసుకుంటోంది నటి వైష్ణవి చైతన్య. తొలి అవకాశమే అల్లు అర్జున్ 'అల వైకుంఠపురములో' చిత్రంలో చిన్న పాత్రలో వచ్చింది కానీ అసలైన గుర్తింపు మాత్రం 'బేబి' సినిమా ద్వారా వచ్చింది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అవడంతో ఆమె నటన, ఎంపిక చేసిన కథలపై సినీ ఇండస్ట్రీ దృష్టి పడింది. నెక్ట్స్ ఆమె నటించిన జాక్ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. అలాగే పలు ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్న ఈ బ్యూటీ సోషల్ మీడియాలోనూ మంచి ఫాలోయింగ్ సంపాదించింది. ఇప్పుడు లేటెస్ట్ గా వైష్ణవి తన లేటెస్ట్ ఫోటోషూట్‌లో కనిపించిన స్టన్నింగ్ లుక్‌తో అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. నలుపు రంగు డిజైనర్ సిల్క్ డ్రెస్ లో మెరిసిపోయిన



వైష్ణవి.. తన మోడ్రన్ అవతారాన్ని స్టైలిష్‌గా ప్రదర్శించింది. మాచింగ్‌గా ట్రెండీ బ్లాక్ షర్ట్ బ్లౌజ్ ధరించి, హై ఫ్యాషన్ డ్రెస్‌కు ఓ డిఫరెంట్ టచ్ ఇచ్చింది. దీని వల్ల ఆమె లుక్ మరింత రిచ్‌గా అనిపించింది. ఈ ఫోటోల్లో వైష్ణవి వేసిన జ్యూయెలరీ, స్పెషల్ మెడ చైన్, సింపుల్ మేకప్, స్మోకీ ఐలైనర్ అన్నీ కలిపి ఆమెను కొత్తగా చూపించాయి. స్టైలిష్ హీల్ సాండల్స్, తక్కువ హెయిర్ బన్ స్టైల్ ఆమె లుక్‌ను మరో లెవెల్‌కు తీసుకెళ్లాయి. "ఇంత గ్లామర్ వైష్ణవి దగ్గర చూసి ఆశ్చర్యపోతున్నాం" అంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఒక యూత్‌ఫుల్ హీరోయిన్ నుంచి ఇలాంటి సీరియస్ క్లాస్ లుక్ రావడం అంత ఈజీ కాదు. ఫొటోగ్రఫీ కూడా సింపుల్ టోన్‌లో ఉండటంతో ఆమె డ్రెస్ ఎక్స్‌ప్రెషన్లు హైలైట్ అయ్యాయి. ఆమె స్థిరమైన గ్లామర్ గ్రోత్ చూసి, అభిమానులు సర్‌ప్రైజ్ అయ్యారు. ప్రస్తుతం వైష్ణవి చేసిన ఈ లుక్ ఇంటర్నెట్‌లో ట్రెండ్ అవుతోంది. అభిమానులు "బ్లాక్ మ్యాజిక్", "బేబీ క్యూట్ నుంచి స్టన్నింగ్ బ్యూటీగా మారిపోయావ్" అంటూ సోషల్ మీడియాలో రచ్చ చేస్తున్నారు. నటనతో పాటు స్టైల్‌లోనూ వైష్ణవి తనదైన ముద్ర వేసిందని అంటున్నారు.

## మైండ్ బ్లాక్ చేసిన ప్రగ్య బ్యాక్ లెస్ ఫోజ్

సౌత్‌లో పాపులర్రై, బాలీవుడ్ ని ఏలాలని కలలు గంది ప్రగ్య జైశ్వాల్. ఈ బ్యూటీ ఇటీవల కొంతకాలంగా ముంబైలో సెటిలైంది. అక్కడ తన స్నేహితురాళ్లు మంచు లక్ష్మీ ప్రసన్న, రకుల్ ప్రీత్ లతో కలిసి కెరీర్ వేటలో బిజీ బిజీగా ఉంది. ఇదే సమయంలో హైదరాబాద్ కనెక్షన్స్ ని ప్రగ్య విడిచిపెట్టడం లేదు. తెలుగు పరిశ్రమలో అంది వచ్చే ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. నటిగా తనను తాను నిరూపించుకునేందుకు ఈ భామ ఇప్పటికే చాలా దూరం ప్రయాణించింది. పోరాటం సాగించింది. దశాబ్ద కాలంగా అనుకున్నది సాధించడమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. టాలీవుడ్ లో తనదైన ముద్ర వేయాలని తపించిన ఈ భామ కొన్ని అరుదైన అవకాశాలను అందుకుంది. ఆరంభం కంచెలో నటనకు ఆస్కారం ఉన్న పాత్రను అందుకుంది. వరుణ్ తేజ్ డెబ్యూ మూవీకి ప్రగ్య ప్రధాన ఆకర్షణగా మారింది. కానీ ఆ తర్వాత దానిని మరో స్థాయికి తీసుకెళ్లాల్సి ఉండగా, అగ్ర హీరోల సినిమాల్లో గ్లామరస్ పాత్రలకు పరిమితమైంది.



ఎన్బీకే సరసన అఖండ, డాకు మహారాజ్ లాంటి భారీ చిత్రాలలో నటించిన ప్రగ్య జైశ్వాల్, సల్మాన్ తో కిసీ కా భాయ్... లాంటి పరిధి తక్కువ ఉన్న పాత్రల్లో మెరిసింది. బాలయ్యతో రెండు సినిమాలు కమర్షియల్ విజయాలు అందుకున్నా బోల్డ్ పెర్ఫామర్ గా తన గుర్తింపును పరిమితం చేసాయి. తన ఎంపికల గురించి నిజాయితీగా అంగీకరించే ప్రగ్య జైశ్వాల్ తదుపరి మరో పెద్ద అవకాశం కోసం ప్రయత్నిస్తోంది. ఈ గ్యాప్ లో అభిమానులకు సోషల్ మీడియాల ద్వారా టచ్ లో ఉంది. ప్రగ్య నిరంతర బోల్డ్ ఫోటోషూట్లు ఇన్ స్టాలో వైరల్ గా దూసుకెళుతున్నాయి. తాజాగా ఈ భామ బ్యాక్ లెస్ ఫోజ్ లో చెలరేగిపోయిన ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. ప్రగ్య ఖరీదైన బ్లేజర్ ధరించి, తనదైన స్టైల్ లో వీపందం ప్రదర్శించింది. చూపులు తిప్పుకోనివ్వని ఈ లుక్ కుర్రకారు గుండెల్ని మరిగిస్తోంది. అఖండ 2 , టైసన్ నాయుడు లాంటి భారీ చిత్రాల్లో ప్రగ్య నటిస్తోంది.




## అందాల నిధితో వీరమల్లు 'తార తార'




టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఇప్పుడు హరిహర వీరమల్లు మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను ప్రముఖ నిర్మాత ఏ ఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్నారు. సినిమాలో పవన్ కల్యాణ్ సరసన నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ తో పాటు సునీల్, సుబ్బరాజు, నోరా ఫతేహి, రఘుబాబు వంటి పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎం ఎం కీరవాణి.. స్వరాలు సమకూర్చారు. అయితే ఇప్పటికే మూవీపై మంచి అంచనాలు నెలకొన్నాయి. సినిమా కాస్త లేట్ అయినా.. ఆడియన్స్ వెయిట్ చేస్తున్నారు. భారీ హోప్స్ కూడా పెట్టుకున్నారు. దీంతో మేకర్స్ ప్రమోషన్స్ తో సందడి చేస్తున్నారు. వరుస అప్డేట్స్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు సినిమా నుంచి తార తార అంటూ సాగే పాటను విడుదల చేశారు. రీసెంట్ గా పోస్టర్ తో సాంగ్ పై మేకర్స్ పాజిటివ్ బజ్ క్రియేట్ చేయగా.. ఇప్పుడు సాంగ్ మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. తార తార నా కళ్ళు.. వెన్నెల పూత నా ఒళ్ళు.. అంటూ సాగుతున్న పాటలో నిధి అగర్వాల్ తన అందాలతో ఆకట్టుకున్నారు. గ్లామర్ పోజులతో మెప్పించారు. సాంగ్ కు స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. పవన్ కూడా తన ప్రెజెన్స్ తో అలరించారు. అయితే పాటకు శ్రీహర్ష లిరిక్స్ అందించగా.. లిప్సిక, ఆదిత్య అయ్యంగార్ కలిసి ఆలపించారు. అయితే స్క్రీన్ పై సాంగ్ ఇంకా అద్భుతంగా ఉంటుందని క్లియర్ గా అర్థమవుతుంది. దీంతో సాంగ్ కోసం ఎంతో ఈగర్ గా వెయిట్ చేస్తున్నామని అటు ఫ్యాన్స్.. ఇటు సినీ ప్రియులు చెబుతున్నారు. కాగా, జూన్ 12వ తేదీన సినిమా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పుడు మేకర్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ముంబైలో కూడా ఈవెంట్ ప్లాన్ చేసినట్టుగా సమాచారం. మరి మూవీతో ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.

## సీతా పయనం టీజర్ టాక్..!




40 ఏళ్ళ నుంచి నటుడిగా ప్రేక్షకులను అలరిస్తున్న అర్జున్ సర్జా దర్శకుడిగా మారి చేస్తున్న సినిమా సీతా పయనం. ఈ సినిమాలో తన కూతురు ఐశ్వర్య అర్జున్ హీరోయిన్ గా నటిస్తుంది. నిరంజన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నాడు. సీతా పయనం సినిమాకు సంబంధించిన టీజర్ లేటెస్ట్ గా రిలీజైంది. ఈ టీజర్ చూస్తే ఒక కారులో ప్రయాణం చేసే టైం లో పరిచయమయ్యే హీరో హీరోయిన్ ఆ తర్వాత వారి మధ్య ఏం జరిగింది అన్నది కథ. సినిమాలో హీరోయిన్ చాలా ప్రాక్టికల్ గా ఉంటుంది. ఆమెది చాలా పెద్ద ఫ్యామిలీ.. మరోపక్క హీరో కూడా ఫైట్లు గట్రా చేస్తూ కనిపించాడు. ఇద్దరు వారి ప్రయాణంలో ప్రేమలో పడతారు కానీ ప్రపోజల్స్ లాంటివి జరగవు. ఇంతకీ ఈ ఇద్దరి పయనం ఎలా జరిగింది.. ఎటు వెళ్లింది అన్నది సీతా పయనం కథ అనిపిస్తుంది. నటుడిగానే కాదు దర్శకుడిగా కూడా అర్జున్ తన పనితనం చూపించేలా టీజర్ ఉంది. ఇక ఐశ్వర్య అర్జున్ స్క్రీన్ ప్రెజన్స్ బాగుంది. నిరంజన్ అనే కొత్త హీరోని పరిచయం చేస్తున్నాడు అర్జున్ సర్జా. ఐతే ఈ సినిమా టీజర్ లో ధ్రువ్ సర్జా సర్ ప్రైజ్ ఇచ్చాడు. అతని క్యామియో సినిమాకు హైలెట్ కానుంది. అంతేకాదు డైరెక్టర్ అర్జున్ సర్జా కూడా ఈ సినిమాలో ఉన్నట్టు తెలుస్తుంది. మొత్తానికి టీజర్ ఆసక్తికరంగా మలిచారు. సీతా రామం తరహా లోనే సీతా పయనం టైటిల్ అనిపిస్తున్నా ఆ సినిమాకు ఈ సినిమాకు అసలేమాత్రం సంబంధం లేదని టీజర్ చూస్తే అర్ధమవుతుంది. అర్జున్ సర్జా డైరెక్టోరియల్ మూవీ ఎలా ఉండాలో దానికి ఏమాత్రం తగ్గకుండా ఉండేలా ఉంది ఈ సీతా పయనం. మరి ఈ సినిమా టీజర్ ఇంప్రెస్ చేయగా సినిమా ఏమేరకు ప్రేక్షకులను అలరిస్తుందో చూడాలి. ఈ సినిమాకు అనూప్ రూబెన్స్ అందిస్తున్న మ్యూజిక్ స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచేలా ఉంది. యూత్ ఫుల్ లవ్ స్టోరీస్ కి అనూప్ మెలోడీ మ్యూజిక్ అదిరిపోతుంది. సీతా పయనం లో కూడా అనూప్ వర్క్ ఆడియన్స్ ని ఇంప్రెస్ చేసేలా ఉందనిపిస్తుంది. అర్జున్ సర్జా దర్శకుడిగా చేస్తున్న ఈ సీతా పయనం మూవీ ప్రేక్షకులను ఎలాంటి పయనాన్ని కలిగిస్తుందో చూడాలి.

## ఫోటోటాక్ : నల్ల కలువ అవతార్‌లో త్రిప్తి


'యానిమల్' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన త్రిప్తి డిమ్రి గత ఏడాది బ్యాక్ టు బ్యాక్ మూడు సినిమాల్లో నటించింది. ముఖ్యంగా ఈమె నటించిన భూల్ భులయ్యా 3 సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అయితే యానిమల్ సినిమాలో ఓవర్ డోస్ శృంగార సన్నివేశాల్లో నటించి గుర్తింపు దక్కించుకోవడం వల్ల అన్ని సినిమాల్లోనూ అలాంటి పాత్రల్లో నటించే అవకాశాలు వస్తున్నాయట. దాంతో త్రిప్తి సినిమాల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుంది. ఇటీవల ఒక స్టార్ హీరో సినిమాలో త్రిప్తి హీరోయిన్‌గా ఎంపిక అయి, ఆమెకు ఉన్న ఇమేజ్ కారణంగా తప్పించారనే వార్తలు వస్తున్నాయి. త్రిప్తి ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తోంది. ధడక్ 2 సినిమాతో పాటు ఇంకా టైటిల్ ఖరారు కానీ మరో సినిమాలోనూ త్రిప్తి ప్రస్తుతం నటిస్తోంది. ఆ రెండు సినిమాలతో ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద సందడికి సిద్ధం అవుతున్న త్రిప్తి తనపై ఉన్న ఇమేజ్‌ను తొలగించుకునే ప్రయత్నాలు చేస్తుంది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు వస్తే తప్పకుండా మెప్పిస్తాను అనే నమ్మకంతో ఇటీవల



ఒక ఇంటర్వ్యూలో అవకాశాల కోసం ఎదురు చూస్తున్నట్లు చెప్పుకొచ్చింది. సినిమాల్లో అందాల తారగా కంటే ఉత్తమ నటిగా గుర్తింపు దక్కించుకోవడం కోసం ఎదురు చూస్తున్నట్లు త్రిప్తి చెప్పుకొచ్చింది. అంతే కాకుండా ఈమె సౌత్ సినిమాల్లోనూ నటించేందుకు రెడీ అంటూ ఒక ఇంటర్వ్యూలో ఓపెన్‌గానే చెప్పుకొచ్చింది. సినిమాల్లో బిజీ బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. తాజాగా మరోసారి త్రిప్తి బ్లాక్ డ్రెస్‌లో సర్‌ప్రైజ్ చేసింది. పెద్దగా స్కిన్ షో చేయకుండానే స్టైలిష్ లుక్‌లో త్రిప్తి ఆకట్టుకుంది. బ్లాక్ డ్రెస్‌లో చూపు తిప్పనివ్వడం లేదంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్‌లో అందంగా ఉన్న త్రిప్తిని వెండి తెరపై శృంగార తార పాత్రలో చూసేందుకు ఎక్కువ శాతం మంది ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు. ఫిల్మ్ మేకర్స్ సైతం అదే విధంగా ఆమెను చూపించాలని భావిస్తున్నారు. కానీ త్రిప్తి మాత్రం నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు చేసేందుకు ఎదురు చూస్తుంది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా బాలీవుడ్‌లోనే కాకుండా సౌత్‌లోనూ ఈ అమ్మడు సినిమాలు చేసే అవకాశాలు దక్కించుకుంటుంది అంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. యానిమల్ సినిమా విడుదలైన వెంటనే ఒక సౌత్ సినిమాలో ఈమెకు ఆఫర్ వచ్చిందనే టాక్ వచ్చింది. కానీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా పట్టాలెక్కలేదు. త్వరలోనే సౌత్‌లో ఈమె నటిస్తుందేమో చూడాలి. యానిమల్ సినిమాకు సీక్వెల్‌గా రాబోతున్న యానిమల్ పార్క్‌లో ఈమె పాత్ర ఏమైనా ఉండే అవకాశం ఉందా అంటూ పలువురు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## బిగువుల ప్రదర్శన సరే వ్వాట్ నెక్ట్స్ రాశీ?

నేటి జనరేషన్ స్టార్స్ లో తెలివైన ఎంపికలతో కెరీర్ బండిని నడిపిస్తున్న భామగా రాశీ ఖన్నాకు గుర్తింపు ఉంది. టాలీవుడ్ లో యంగ్ హీరోల సరసన నటిస్తూనే, దర్శకద్వయం రాజ్ అండ్ డీకే ప్రాజెక్ట్ ఫర్జీలో నటించింది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో ఈ బ్యూటీ పాన్ ఇండియాలో అభిమానులను ఫిదా చేసింది. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ హిందీ చిత్రాల్లో నటించేందుకు ప్రణాళికల్ని సిద్ధం చేసింది. ఆరణ్మనై 4 తో కమర్షియల్ విజయం అందుకుంది. ది సబర్మతి రిపోర్ట్, సర్దార్ లాంటి సినిమాలు తనకు నటిగా మంచి పేరు తెచ్చాయి. తెలుసు కదా! అనే తెలుగు చిత్రంలోను ఈ బ్యూటీ



నటిస్తోంది. అటు బాలీవుడ్ లో ఇంకా టైటిల్ నిర్ణయించని ఎ క్రేజీ మూవీలో నటిస్తోంది. కెరీర్ మ్యాటర్ ఇలా ఉండగానే, రాశీ యూత్ లో తన ఫాలోయింగ్ ఎంతమాత్రం తగ్గకుండా జాగ్రత్త పడుతోంది. ప్రస్తుత కాంపిటీషన్ లో తనను తాను నిలబెట్టుకునేందుకు వరుస ఫోటోషూట్లతో ఫ్యాన్ డమ్ కి టచ్ లో ఉంది. రాశీ తాజాగా తన ఫిట్నెస్ గురూ కుల్ దీప్‌తో కలిసి జిమ్ లో శ్రమిస్తున్న కొన్ని ఫోటోలను షేర్ చేసింది. రాశీ పర్ఫెక్ట్ ఫిట్ టోన్డ్ బాడీని హైలైట్ చేస్తూ ఈ ఫోటో షూట్ గుబులు పుట్టిస్తోంది. బ్లాక్ అండ్ బ్లాక్ - ఆల్ బ్లాక్ ట్రాక్ లో ఉన్న ఈ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో తుఫాన్ సృష్టిస్తున్నాయి. రాశీ నడుము నెమ్మదిగా జీరో నుంచి మైనస్ సైజ్ కి తగ్గిపోవడం ఖాయమని ఈ హార్డ్ వర్క్ చెబుతోంది. కొంత కఠినమైన వ్యాయామ సెషన్స్ కి రాశీ ఖన్నా అటెండవుతోంది. నేను ఏడవకుండా ఆ సెషన్‌లో బయట పడ్డాను. సెల్ఫీలు తీసుకునేంత అందంగా అనిపించింది! అంటూ కొంటె ఫన్నీ ఈమోజీని రాశీ షేర్ చేసింది. రాశీని షేపప్ చేసేందుకు కోచ్ కుల్ దీప్ సేథి చాలా శ్రమిస్తున్నారనడానికి ఈ ఫోటోలే ప్రూఫ్.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536